# దారి దీపం
మాసపత్రిక
DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175
సంపుటి 4 - సంచిక 11 ఆగస్టు 2026 వెల : రూ.15



చంద్రబాబు - పొలిటికల్ గవర్నెన్స్

మోడీ-షాలను భయపెట్టిన సభాపర్వం

దిమాగీ నక్సల్స్‌లోకి వారు వస్తే విషమం!

దిమాగీ నక్సల్స్ ఎవరు? ప్రశ్నించే మెదళ్లు ప్రమాదమా?

ప్రశ్నించడం దేశద్రోహం కాదు.. నేహా బోరా ఇంటర్వ్యూ

అగౌరవం కాదు, అవసరమైన నిష్కర్ష!

80 ఏళ్ల స్వాతంత్ర్యం - సమకాలీన భారతం

కార్పొరేట్ అనుకూల చట్టాలు కె.జి.బేసిన్ గ్యాస్, ఆయిల్ దోపిడీ

జాతీయ వైజ్ఞానిక స్ఫృహదినం : 20 ఆగస్టు

'డబుల్ ఇంజన్' రాష్ట్రాల్లో విద్యా సంక్షోభం

నిలబడిన కొమ్మనే నరుక్కుంటున్న వైనం

అవి అజ్ఞానపు వ్యాఖ్యలే...!

ఆర్థిక వృద్ధి కంటే అసమానతల పెరుగుదలే ఎక్కువ!

సంక్షేమానికి నిజంగానే ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?

ఇప్పటికీ అంతే.. కొత్త పాళీ!

ఈ దేశం ఎవరిది? డా పరకాల ప్రభాకర్ గారి ప్రసంగం

We The People of India

చర్చా పత్రం : లక్ష్యాలు - భవిష్యత్ కార్యకలాపాలు

ఆగస్టు - 2026

పేజీలు : 43

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 11

**డి.వి.వి.యస్.వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. చంద్రబాబు - పొలిటికల్ గవర్నెన్స్ - సంపాదకీయం 3
2. మోడీ-షాలను భయపెట్టిన సభాపర్వం - తెలకపల్లి రవి 4
3. దిమాగీ నక్సల్స్‌లోకి వారు వస్తే విషమం! - రాహుల్‌కుమార్ 6
4. దిమాగీ నక్సల్స్ ఎవరు? ప్రశ్నించే మెదళ్లు ప్రమాదమా? - జి.తిరుపతయ్య 8
5. ప్రశ్నించడం దేశద్రోహం కాదు.. ప్రత్యేక ఇంటర్వ్యూలో నేహా బోరా 10
6. అగౌరవం కాదు, అవసరమైన నిష్కర్ష! - ఎన్.వేణుగోపాల్ 12
7. 80 ఏళ్ల స్వాతంత్ర్యం - సమకాలీన భారతం - కె.ఎస్.లక్ష్మణరావు 15
8. కార్పొరేట్ అనుకూల చట్టాలు కె.జి.బేసిన్ గ్యాస్, ఆయిల్ దోపిడీ - డా. కొల్లా రాజమోహన్ 17
9. జాతీయ వైజ్ఞానిక స్పృహదినం : 20 ఆగస్టు - ప్రొ.దేవరాజ మహారాజు 19
10. 'డబుల్ ఇంజన్' రాష్ట్రాల్లో విద్యా సంక్షోభం - కె.వేణుగోపాల్ 21
11. నిలబడిన కొమ్మనే నరుక్కుంటున్న వైనం - అశోక్ కుంబము 23
12. అవి అజ్ఞానపు వ్యాఖ్యలే...! - డా.సి.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి 27
13. ఆర్థిక వృద్ధి కంటే అసమానతల పెరుగుదలే ఎక్కువ! -ఎం.కోటేశ్వరరావు 29
14. సంక్షేమానికి నిజంగానే ఎక్కువ ఖర్చు చేస్తున్నామా? - చక్రధర్ బుద్ధ 31
15. ఇప్పటికీ అంతే.. కొత్త పాళీ! - నాగసూరి వేణుగోపాల్ 33
16. ఈ దేశం ఎవరిది? డా పరకాల ప్రభాకర్ గారి ప్రసంగం 37
17. We The People of India చర్చా పత్రం : లక్ష్యాలు - భవిష్యత్ కార్యకలాపాలు 38
18. కార్టూన్స్ 38
19. కొత్త పుస్తకాల స్వీకారం 39




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

### దారి దీపం
### మాసపత్రిక
**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



# చంద్రబాబు - పొలిటికల్ గవర్నెన్స్

రాజనీతి శాస్త్రంలో రాచరిక పాలన వుంది. నిరంకుశ పాలన వుంది. ఫాసిస్టు పాలన వుంది. ప్రజాస్వామ్య పాలన వుంది. ఇంకా పలు రకాల పాలనా వ్యవస్థలు వున్నాయి. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరొక అదనపు పదబంధాన్ని రాజనీతి శాస్త్రానికి అందించారు. మునిసిపాలిటీలు, పంచాయతీల ఎన్నికల చర్చలో భాగంగా రాష్ట్రంలో అన్ని స్థాయిలలో పొలిటికల్ గవర్నెన్స్‌కు పిలుపు ఇచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడితే అది ప్రజలందరి ప్రభుత్వం అవుతుంది. పరిపాలనలో తమకు ఓటు వేసిన వారు, ఓటు వెయ్యని వారు అన్న వివక్ష ఉండకూడదు. అలాగే ప్రతిపక్షాన్ని వెలివేసే పద్ధతులు పాటించకూడదు.

ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన పిలుపు ఈ ప్రజాస్వామ్య సంప్రదాయానికి విరుద్ధంగా వుంది. పైగా ఈ పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ప్రకటించారు. అంటే పాలనలో అధికార పక్షానికి తప్ప, ప్రతిపక్షాలకు స్థానం వుండదు. పైగా అధికారులను ఈ పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగస్వాములను చెయ్యడం అంటే ప్రభుత్వ కార్యకలాపాలలో వారిని అదుపాజ్ఞలోకి తెచ్చుకోవడం అవుతుంది.

ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం అంతా పాలక పార్టీ కనుసన్నలలోనే పనిచేస్తున్నది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఏకఛత్రాధిపత్యం, నియోజకవర్గాలలో శాసనసభ్యులు ఇష్టారాజ్యం నడుస్తున్నది. ఇప్పటి వరకు ముసుగులో నడుస్తున్న వ్యవహారాన్ని ముఖ్యమంత్రి ప్రకటనతో బహిరంగ కార్యకలాపంగా మారుతుంది. ఇది ప్రజాస్వామ్య పాలనను పక్కన పెట్టి పార్టీ పాలనగా మారుస్తుంది. అన్నింటా అధికార పార్టీ పెత్తనం నడుస్తుంది. ఇది ఆ పార్టీకి తాత్కాలికంగా ఉపయోగపడుతుందని భావించినా దీర్ఘకాలంలో బెడిసి కొడుతుంది.

మరో అంశం మునిసిపాలిటీలు, పంచాయతీల ఎన్నికలు. ఇవి ఐదేళ్లకు ఒకసారి జరిగి తీరాలి. కాని, జరగడం లేదు. రాజ్యాంగం స్పష్టంగా ఈ విషయం ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం ఏదో ఒక సాకుతో అడ్డుకుంటున్నది. ఈ తరహా ఒరవడికి తెరతీసింది చంద్రబాబునాయుడే. గతంలో పంచాయతీలలో ఐదెంచల వ్యవస్థ వున్నదని, దానిని మూడు అంచెల వ్యవస్థగా కుదించి ఎన్నికలు జరుపుతామని ప్రకటించి వాయిదా పర్వానికి నాంది పలికారు. రాజ్యాంగ సవరణ తమ చేతిలో లేదని తెలిసి కూడా అలాంటి సవరణ సాధిస్తామని బీరాలు పలికారు. చివరకు రాజ్యాంగ సవరణ రాలేదు. ఐదంచెల వ్యవస్థతోనే ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు మునిసిపాలిటీ, పంచాయతీ ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లు, 33, 34 శాతాలకు పెంచుతామని శాసనసభలో ప్రకటించారు. తమ పార్టీయే బీసీల పార్టీ అని ఈ చర్య దానిని నిరూపిస్తుందని అన్నారు. ఈ రిజర్వేషన్ల అమలుకు సుప్రీంకోర్టు అనుమతించదని ఆయనకు తెలుసు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు పదే పదే స్పష్టం చేసింది. ఇలాంటి భీషణ ప్రతిజ్ఞలు చేసిన కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు బీసీలకు తగ్గించక తప్పని రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరుపుకున్నాయి.

అందుచేత చంద్రబాబు ప్రకటించిన బీసీ రిజర్వేషన్లు సమంజసమే అయినా వాటి అమలుకు సుప్రీంకోర్టు అనుమతించే అవకాశం లేదు. దీనిని ఎవరో ఒకరు కోర్టులలో ప్రశ్నిస్తారు. ఈ రిజర్వేషన్ల చెల్లుబాటు కాని స్థితి వస్తుంది. ఇవన్నీ చంద్రబాబునాయుడుకు తెలుసు. అయినా కేవలం బీసీల మెప్పు కోసం మాత్రమే శాసనసభలో ప్రకటన చేశారనడంకంటే, ఎన్నికలను వాయిదా వెయ్యడానికే ఈ ప్రయత్నంగా కనిపిస్తుంది. మునిసిపాలిటీలకు, పంచాయతీలకు ఏదో ఒక సాకుతో వాయిదాల మీద వాయిదాలు వెయ్యకుండా వెంటనే ఎన్నికలు జరిపించి వాటికి నిదులు, విధులు కేటాయించి అవి స్థానిక ప్రభుత్వాలుగా ప్రజలకు అవసరమైన సేవలు అందించే సమర్థత అధికారాలుగా వాటిని తీర్చిదిద్దాలి. ❑

**- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# మోడీ-షాలను భయపెట్టిన సభాపర్వం



\- తెలకపల్లి రవి

జంతర్‌మంతర్ నిరసనలు ఆగినా ఆ ప్రతిధ్వనులు మాత్రం పాలకులను భయపెడుతూనే వున్నాయి. ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు మొహం చూడటానికే జంకుతున్న పరిస్థితి. తనకు ఎనిమిది సెకండ్లలో నిద్ర పడుతుందని మోడీ ఎంపీలతో ఇష్టాగోష్టిలో చెప్పారు. కాని, నిజానికి రాత్రి వేళల్లోనే వరస వీడియోలు విడుదల చేసి తన ఆందోళన బయటపెట్టుకున్నారు. చివరకు విశ్వగురువు ఆది గురువు ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది. జంతర్‌మంతర్ జాతి వ్యతిరేకులన్నట్టు బీజేపీ-ఆరెస్సెస్ సోషల్ మీడియా ప్రచారం సాగిస్తే, నిరసన తప్పు కాదని, ఆ యువత జాతి వ్యతిరేకులు కాదనీ గురూజీ సుభాషితాలు చెప్పారు. మరి తన శిష్యకోటికి ఈ మంచి మాటలు బోధించలేదా? అలాంటి వారిపై అమానుష నిర్బంధం గురించి ప్రశ్నలు మోహన్ భగవత్ ఎందుకు దాటేశారు? చిక్కుల్లో చిక్కిన మోడీని ఆదుకోవడానికీ, యువతను గందరగోళ పరచడానికి తప్ప! ఆ తర్వాతనైన పార్లమెంటులో ప్రభుత్వ ధోరణి మారిందా అంటే లేదు.

మోహన్ భగవత్ చెప్పినట్టు యువ నిరసనకారులు జాతి ద్రోహులు కాదని, జరిగిన దాడులకు విచారిస్తున్నామని, క్షమాపణ చెప్పడానికి లేదా విచారం వెలిబుచ్చబడానికి షాకు అభ్యంతరమేమిటి? మోడీ కూడా రీల్స్‌లో చెబుతారు తప్ప సభకు లేదా మీడియాకు చెప్పరు. బయటవారి విష ప్రచారాలు షరా మామూలుగా సాగుతుంటాయి. అంతేగాక అమిత్ షా వచ్చి మాట్లాడితే మీరు తట్టుకోలేరని పార్లమెంటులో మంత్రి కిరణ్ రిజిజు ఏకంగా బెదిరింపులకే దిగారు. మోడీ టీం కపట నాటకాలు అందుకు ఆరెస్సెస్ అధినేతల అండదండలు వీటిని బట్టే తెలుస్తాయి. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కూడా భగవత్ మాటలను స్వాగతిస్తూ కొన్ని కోర్కెలు వినిపించారు. రాజకీయాలలోకి ఇప్పుడే వచ్చే ఆలోచన లేదంటూ పార్టీలపై వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులు ఎక్కడ పోరాడినా మద్దతునిస్తామంటూ, వివిధచోట్ల పరిస్థితులపై అధ్యయనం చేయడానికి పన్నెండు మందితో ఒక కమిటీని నియమించారు. మరోవైపున వారిపై మీడియాలో రకరకాల కథనాలు కొనసాగుతూనే వున్నాయి.

**ఆ బిల్లు కోసమే హడావుడి**

వాటిని అలావుంచి మళ్లీ పార్లమెంటుకు వస్తే అమిత్ షా ప్రతిపక్షాల మాటనే కాదు, సభాపతి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాటను పెడచెవిన పెట్టడం విపరీతం. పలు వాయిదాల తర్వాత ఆయన సభ్యుల మాటను మీరు అమిత్ షాకు చెప్పండంటూ రిజిజును పురమాయించారు. కానీ ఫలితం లేకపోగా ఎదురుదెబ్బ తగిలింది, సభలో ఏ విషయం ఏమంత్రి మాట్లాడాలో ప్రతిపక్షాలు చెప్పలేవని తోసిపుచ్చారు. అనుకున్న సమయంలో అమిత్ షా వచ్చి మాట్లాడితే ప్రతిపక్షాలు తట్టుకోలేవని బెదిరించారు. గతంలో పెద్దనోట్ల రద్దు, రైతు ఉద్యమం, కాశ్మీర్ 370 రద్దు వంటి అంశాలపై ప్రధాని మోడీ మాట్లాడకుండా దాటేసిన తీరు ఇప్పుడు పునరావృతమవుతున్నది. కానీ మరో వైపున ఆయన ఎంపీలతో విడిగా సమావేశాలు జరిపి సందేశాలిస్తున్నారు, సంకేతాలు వదులుతున్నారు. ఢిల్లీ చాలా ప్రమాదకరమైన చోటు మీరు జాగ్రత్తగా వుండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సభలో పరీక్షల లీకుల నిరోధం, వందేమాతరం బిల్లులు ఆమోదింప చేసుకుని, మహిళా రిజర్వేషన్ బిల్లు అనే నియోజవకర్గాల పెంపు బిల్లు ఆమోదింపచేసుకోవాలని నానా తంటాలు పడుతున్నారు. ఇందుకోసం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో చర్చలు జరిపి ఒప్పించేందుకు విఫలయత్నం చేశారు. అయోధ్య రామాలయ నిధుల గల్లంతు, విద్యార్థుల నిరసనపై హింసాకాండకు అమిత్ షా క్షమాపణ చెప్పేవరకూ వేరే చర్చకు అవకాశం లేదని ప్రతిపక్షాలు తేల్చిచెప్పడంతో సభలో కొత్తదాడి చేసి మొత్తంగా వాయిదా వేశారు.

లీకులకు శిక్షలు పెంచే బిల్లుతోపాటు వందేమాతరం బిల్లు వంటివి ఆమోదించుకోవడంలోనూ చాలా రాజకీయం వుంది. రేపు ఆగస్టు 15న ఎర్రకోట కార్యక్రమంలో వందేమాతరం మొత్తం పాడి తమ దేశభక్తిని చాటుకునే కొత్త తంతు మొదలు పెట్టబోతున్నారు. వాస్తవానికి నియోజకవర్గాల పెంపు బిల్లుపై దాగుడుమూతలు మోడీ సర్కారు ఇరకాటాన్నే గాక ఆతృతను బయట పెడుతున్నాయి. 2024లోనే మెజార్టీ రాని బీజేపీ ఫిరాయింపులు, అవకాశవాద మద్దతుతో వెంటనే దాన్ని ఆమోదింపచేసుకోవాలనుకుంటున్నది. దాన్ని ఆమోదించుకోవడమే తమ పట్టును ప్రతిబింబిస్తుందని ఒకవైపు, ఆ విధంగానైనా గెలిచేచోట్ల సీట్లు పెరిగితే 2029లో గట్టెక్కగలమనే దింపుడు కళ్లం ఆశ మరోవైపు ఇందుకు

కారణమవుతున్నాయి. రాజకీయ గణితం ప్రకారం అలాగే జరగాలని ఏమీ లేదు. తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు అవకాశ వాదంతో తమకూ సీట్లు పెరుగుతాయని వంతపాడుతున్నాయి గానీ డిఎంకె వంటివి వ్యతిరేకమనే చెబుతున్నాయి. చివరకు ఎవరు ఎటు ఓటేస్తారో ఇంకా అనిశ్చితం. సీట్ల పెంపు లేకుండా మూడోవంతు రిజర్వేషన్ వరకూ ఆమోదం తీసుకోమంటే సిద్ధపడకపోవడంలోనే కేంద్రం నిజస్వరూపం తెలుస్తున్నది.

## ప్రమాదమేమిటి?

ఇంతకూ ఈ సమావేశాలలో సీట్ల పెంపు బిల్లు వస్తుందా లేదా అనేది సస్పెన్స్‌లో వుండగా విదేవీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్ఎ)ను ఎలాగైనా నెగ్గించుకోవాలని మోడీ సర్కారు తొందరపడుతున్నది. మానవ హక్కులు, లౌకికతత్వం వంటి వాటికోసం పోరాడే వందలాది ఎన్‌జివోలనూ, క్రైస్తవ మతసంస్థలనూ అదుపుచేయడానికే ఉద్దేశించిన బిల్లు ప్రపంచవ్యాపితంగానే చర్చకు కారణమైంది. అమెరికా సెనేటర్ రైక్, కాంగ్రెస్ సభ్యుడైన రిపబ్లికన్ రైలే మూర్ వంటివారు దీన్ని బాహాటంగానే తప్పుపట్టారు. ఒకటవ శతాబ్దం నుంచి భారత దేశంలో క్రైస్తవ మతం ప్రవేశిం చిందనీ అలాంటిచోట ఆ మతంపై నియంత్రణ ఏమిటని ప్రశ్నించారు. కొందరు విదేశీ ప్రతినిధులేగాక మిజోరాం ముఖ్యమంత్రి లాల్ ధూమా కూడా సందేహాలతో అమిత్ షాను కలుసుకుని ఆ పైన 12న బిల్లు వస్తుందని ప్రకటించారు. కేంద్రమే ఈ బిల్లుపై స్పష్టత ఇవ్వనపుడు ఒక ముఖ్యమంత్రి ప్రకటన చేయడమేమిటని కాంగ్రెస్ ఆక్షేపించింది. సీపీఐ(ఎం) వ్యతిరేకించగా ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మోడీకి లేఖ రాశారు. ఆ పార్టీ ఎంపీలు జాన్ బ్రిట్టాస్, శివదాసన్‌లు ఇప్పటికే బిల్లుపై వివరమైన ప్రకటనలే చేశారు. అసలు ఇండియా వేదిక సభ్యులు గట్టిగా నిలవరించాలని నిర్ణయించుకున్నారు. ఆఖరుకు బీజేపీ మేఘలయ ఎమ్మెల్యే ఎఎల్ హక్ కూడా ఈ బిల్లుపై స్పష్టత రావలసి వుందని తేల్చి చెప్పారు. పౌర సమాజం చొరవనూ, ఉద్యమాలనూ అడ్డుకోవడం, వివిధ మతాలకు ఆటంకం కల్పించడమే బిల్లు లక్ష్యమని సీపీఐ(ఎం) విమర్శించింది.

విదేశీ నిధుల నియంత్రణ పేరిట ఏర్పాటు చేసే వ్యవస్థ నిరంకుశంగా అడ్డుకునే ప్రమాదం వుంటుంది. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రమే ఇష్టానుసారం దర్యాప్తుల పేరుతో చొరబడుతుంది. విచక్షణాధికారాలు ఇవ్వడం వల్ల నిరంకుశ అధికారాలు కేంద్రం చేజిక్కించుకుంటుంది. ఇప్పటికే 20,711 సంస్థల రిజిస్ట్రేషన్లు రద్దు చేయబడ్డాయి. మైనార్టీ మతాలపై ఆంక్షలు కఠిన షరతులు బిగించబడతాయి. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం ఇంకా పెరుగుతుంది. ఇంత విస్తృత ప్రభావం చూపే ఈ బిల్లుపై కనీసచర్చలు లేకుండా ఏప్రిల్‌లో ముందుకు తెచ్చారు. ఇప్పుడు ఎలాగో ఆమోదింప చేసుకోజూస్తున్నారు. అందుకే సోమవారం పున:ప్రారంభమయ్యే ఉభయసభల సమావేశాలు చాలా వాడిగా వేడిగా కొనసాగనున్నాయి. మన దేశానికి సంబంధించిన చట్టాలలో విదేశాలకు అమెరికాకు సంబంధమేమిటన్న ప్రశ్న సరైందే గానీ అంతర్జాతీయ వ్యవహారాలలోనే అమెరికాకు తోకగా వ్యవహరించినప్పుడు ఈ స్వతంత్రేచ్ఛ ఏమైనట్టు? ఇప్పుడు అంతర్జాతీయ సమాజం మన రాజ్యాంగం అనుమతించే నిబంధనలపై చర్చ చేయడం తప్పదు కదా? ఇక్కడ ఇంకో పెద్ద రాజకీయాంశం వుంది. ఆరెస్సెస్ దేశంలో అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ అని మోడీనే ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే చెప్పారు. మరి అది ఎక్కడ రిజిస్టరైంది. నిధులు ఎలా వస్తాయంటే చెప్పరు. వీరూ అడగరు. పైగా ఎదురు దాడి చేస్తారు. నిజానికి సంఘ పరివార్ అనే ఆరెస్సెస్‌కు వున్నన్ని ప్రత్యక్ష, పరోక్ష రహస్య అనుబంధ సంస్థలు మరెవరికీ వుండవు. విహెచ్‌పి అనేది పేరులోనే విశ్వ వ్యాపితమైంది. మరి వారికి నిధులు ఎలా వస్తాయి? ఏం చేస్తున్నారు? అయోధ్యలో రామమందిర నిర్మాణం ముందునుంచి చూస్తున్నది ఆరెస్సెస్, విహెచ్‌పిలే కదా? మరి జవాబుదారీ తనమేది? ఇక్కడ మాత్రం ఎన్జీవోలు మైనార్టీ సంస్థల లెక్కలు లోతుగా తవ్వితీసినిధులే గాక స్థిరాస్తులు కూడా స్తంభింపచేసే అధికారం కొత్త తనిఖీ సంస్థకు కల్పించబో తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు విద్యావైద్య సేవలందించడం మనకు తెలుసు. ఈ నిబంధనల పేరట వాటి నిధులు స్తంభింపచేస్తే అభాగ్యులైన రోగులు పిల్లలు బాధపడాల్సి వస్తుంది. ఇలాంటి అభ్యంతరాలకు గురైన సంస్థలేవైనా కొత్తగా అనుమతి పత్రం తెచ్చుకోలేకపోతే వాటి ఆస్తులు పూర్తిగా సర్కారుకు దఖలు పడతాయి ఈ నిరంకుశ నిబంధనలు.

## స్వేచ్ఛ సేవలపై దాడి

ఆచరణలో ఎవరిపై ఎలా ప్రయోగించబడతాయో ప్రజలు గ్రహించలేరా? పైగా ఇది వస్తే మీ ఆటకట్టిస్తామని కొన్ని చోట్ల ఇప్పటికే పరివార్ సభ్యులు బెదిరింపులు సాగిస్తున్నారు. ఏవేవో పేర్లతో మీడియాలో రెచ్చగొట్టే చర్చలు చేస్తున్నారు. ఒక విధంగా ఇది దేశం వివిధ ప్రాంతాలలో, వివిధ రకాలుగా మతాల వారి వివాదాలు ఉద్రిక్తతలు పెంచే ప్రమాదం కూడా పొంచి వుంది. విదేశాలతో సంబంధాలపై ప్రభావం సరేసరి, ఇంతకు ముందే కొత్త వక్ఫ్ చట్టం ముస్లిం మతా వలంబులను కష్టపెడుతుంటే ఇప్పుడీ బిల్లు పులిమీద పుట్రలా తయారవబోతుంది. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలు దీన్ని పూర్తిగా ఆమోదించలేకపోతున్నాయి. ఈ భయం పట్టుకుంది గనకనే మోడీ వరసగా చీలిపోయిన ప్రాంతీయ పార్టీల నేతలతో, ఎంపీలతో సమావేశాలు జరిపి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇవేవీ బీజేపీ తప్పులను కప్పిపుచ్చలేవు. ❑

# దిమాగీ నక్సల్స్‌లోకి వారు వస్తే విషమం!

- రాహుల్‌కుమార్



**సమాంతర పరిణామాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. మన జీవితాల్లో జరుగుతున్నవి ఇంకెక్కడో అచ్చంగా అలాగే సాగుతుంటే వాటిని తెలుసుకోవాలన్న కుతూహలం పెరుగుతుంది. కానీ సారూప్యతలు కొన్ని సందర్భాల్లో భయానకంగానూ ఉంటాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని వాడి పెద్ద చర్చకు దారితీశారు. నక్సలైట్ల భావజాలంతో ప్రేరేపితులైన కొందరు ఆలోచనాపరులు దేశంలో అనేక రంగాల్లో పాతుకుపోయారనీ, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్థాయికి వారు ఎదిగారనీ విమర్శించారు.**



భౌతికంగా నక్సలైట్లను తుదముట్టించామనీ ఇప్పుడు దిమాగీ నక్సల్స్‌ను ఏకాకులను చేయాలనీ పిలుపునిచ్చారు. భారత్‌లో దిమాగీ నక్సల్స్ కిందకు ఎవరు వస్తారన్నది ప్రధాని స్పష్టం చేయలేదు. రాజకీయ ఉపన్యాసాల్లో వ్యక్తులనూ, బృందాలనూ ఫలానా వాళ్లుగా ముద్ర వేయటమే ప్రధానంగా ఉంటుంది. అందుకే వాళ్ల గురించి కచ్చితమైన నిర్వచనాలు అప్పటికప్పుడు ఉండవు. తమను ఉద్దేశించే మోదీ దిమాగీ నక్సల్స్ అనే పదాన్ని వాడారని భావించిన కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగారు. కొందరైతే తాము దిమాగీ నక్సల్స్‌మేనంటూ ప్రకటనలు చేశారు. ప్రతిపక్షాలను దిమాగీ నక్సలైట్లుగా ముద్ర వేయటం ప్రధాని మోదీ అభిమతం కాదనీ భారత రాజ్యాంగాన్ని అంగీకరించకుండా హింస ద్వారా ప్రభుత్వాన్ని కూల్చుదామనుకునే వాళ్లను ఉద్దేశించి మాత్రమే దాన్ని ఆయన అన్నారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చారు.

నిజంగానే హింసతో ప్రభుత్వాన్ని కూల్చాలనుకునే వారికి మద్దతు ఇచ్చే మేధావులకే దిమాగీ నక్సల్స్ ముద్రను పరిమితం చేస్తే అదొక తీరుగా ఉంటుంది. కానీ మేధోరంగంలో అలాంటి వ్యక్తులు ఇప్పుడు చాలా తక్కువగా ఉన్నారు. వాళ్లు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్థాయిలో లేరు. ప్రజలను ఉద్రూతలూగించే స్థాయిలో వాళ్ల ఆలోచనలు ఇప్పుడు లేవు. దిమాగీ నక్సల్స్ జాబితాలోకి ప్రభుత్వ విధానాలూ, సిద్ధాంతాలపై అసమ్మతి తెలిపే వారందరూ వస్తే పరిస్థితులు వేరే విధంగా మారతాయి. భిన్న భావవ్యక్తీకరణకే అప్పుడు ప్రమాదం ముంచుకొస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న పరిణామాలను చూస్తే ఆ ప్రమాదాన్ని తేలికగా తోసిపుచ్చలేం. మనకు ఎంతో దగ్గరైన ప్రజాస్వామ్య దేశాల్లో అమెరికాతోపాటు, ఇటలీ, ఇజ్రాయెల్‌లు కూడా అగ్రభాగాన ఉన్నాయి. అక్కడి ప్రభుత్వాధినేతలూ, పాలక పార్టీల నాయకులూ రాజ్యాంగానికి లోబడి వ్యవహరించే మేధావులపై, విద్యావేత్తలపై, సాహిత్యకారులపై గురిపెట్టి మరీ ఎదురుదాడులు చేస్తున్నారు. ఆ మూడు దేశాల్లో ఉదారవాద ప్రజాస్వామ్యం, బహుళ సంస్కృతి వాదం, సామాజిక–ఆర్థిక న్యాయంపై పట్టుదలతో వ్యవహరించే మేధావులను జాతి వ్యతిరేకులుగా చిత్రీకరించటం ఎక్కువైంది. వాళ్లందరినీ వామపక్షవాదులుగా, దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేసేవారుగా ముద్రవేసి విమర్శలు గుప్పించటం సాధారణమైపోతోంది.

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి

వచ్చిన తర్వాత ఈ ధోరణి బాగా పెరిగింది. వ్యక్తి స్వేచ్ఛకూ భావవ్యక్తీకరణకూ తిరుగులేదనుకునే దేశంలో సాక్షాత్తూ అధ్యక్షుడే ఎదురుదాడి ఆరంభించటం ఇతర దేశాల్లోని నాయకులకూ ప్రేరణగానే ఉంటుంది. భారత్‌లో కూడా వివిధ రూపాల్లో హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకించే మేధావులపై విమర్శలూ, ఆరోపణలూ ఇటీవల కాలంలో బాగా ప్రబలం అవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని పరిస్థితిని మదింపు వేస్తే అమెరికా, ఇటలీ, ఇజ్రాయెల్‌లో జరిగే పరిణామాలకూ ఇక్కడి వాటికీ సారూప్యత స్పష్టంగానే కనపడుతుంది. అమెరికా సమాజం మరింత మానవత్వంగా ఉండాలనీ, సంపదలో అసమానత్వాన్ని తగ్గించాలనీ, పర్యావరణాన్ని పరిరక్షించాలనీ, రక్షణ ఖర్చులకు కోత పెట్టాలనీ కోరుకునే మేధావులను ట్రంప్ ఎన్నో సందర్భాల్లో రాడికల్ లెఫ్ట్, అల్ట్రాలెఫ్ట్ అనీ, మార్క్సిస్టులూ, ఫాసిస్టులూ అని ముద్రలు వేసి విమర్శించారు.

"మన దేశంలో చీడపురుగుల్లా ఉన్న కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, ఫాసిస్టులు, రాడికల్ లెఫ్ట్ దుండగులను మనం నిర్మూలిస్తాం" అంటూ ఎన్నోచోట్ల విరుచుకుపడ్డారు. మేధావులకూ, ప్రగతిశీల విద్యార్థులకూ నిలయాలైన విశ్వ విద్యాలయాలపై ఒక దశలో బహుముఖ యుద్ధమే మొదలు పెట్టారు. వెనుకబడిన జాతులకూ, వివిధ సంస్కృతుల వారికీ, మహిళలకూ తగు ప్రాధాన్యం ఇవ్వాలనే విధానాలకు వర్సిటీలు స్వస్తి చెప్పాలని డిమాండు చేశారు. ఆ విధానాలన్నీ ప్రతిభను దెబ్బ తీస్తాయన్నదే ఆయన వాదన. ట్రంప్ ఉద్దేశంలో రిజర్వేషన్ల లాంటివి ఏవీ ఉండకూడదు. తన మాట వినటం లేదని హార్వర్డ్ యూనివర్సిటీకి నిధులనే ఆపేశారు. మూర్ఖులనూ అవివేకులనూ ఆ వర్సిటీ తయారుచేస్తోందని దుయ్యబట్టారు.

ముఖ్యంగా ట్రంప్, ఆయన మద్దతుదారులు రెండు పదాలపై (వోక్-Woke, డీఈఐ-DEI) విమర్శలను కేంద్రీకరించారు. వోక్ అంటే సామాజిక అన్యాయాల గురించి అప్రమత్తంగా ఉండటం. జాతి, లింగ వివక్షతలూ, సామాజిక అసమానతలూ, అల్పసంఖ్యాక వర్గాల హక్కుల పరిరక్షణతోపాటు ఇతర వ్యవస్థీకృత అన్యాయాల పట్ల అవగాహనతో ఉండి వాటిని తొలగించాలని కోరుకునే వాళ్లను వోక్ వ్యక్తులంటూ వ్యంగ్యంగా విమర్శించటం పరిపాటైంది. ఇక డీఈఐలో మొదటి అక్షరం డీ అంటే వైవిధ్యానికి (డైవర్సిటీ) ప్రాధాన్యం ఇవ్వటం. అంటే పదవుల్లో, విద్యాలయాల్లో, ఉద్యోగుల్లో వివిధ జాతులు, వివిధ సామాజిక నేపథ్యాలు కలిగిన వారికి తగు ప్రాతినిధ్యం ఉండేలా చూడటం. ఈ అంటే ఈక్విటీ. సమాన అవకాశాలు ఉండేలా కొన్ని ఏర్పాట్లు చేయటం, ప్రోత్సాహాలు ఇవ్వటం. ఐ అంటే ఇన్‌క్లూజన్. సంస్థల్లో వివిధ వర్గాల వారిని గౌరవప్రదంగా భాగస్వాములను చేయటం. నిజానికి ఇవేమీ అమెరికా సమాజాన్ని తలకిందులు చేసే విప్లవాత్మకమైన డిమాండ్లు కావు. వీటిని అమలు పరిస్తే అమెరికా సమాజం సోషలిజంలోకి వెళ్లిపోదు. మతం నాశనమైపోదు. క్రైస్తవ మత సంస్కృతికి విఘాతం కలగదు. కానీ వీటిపై ఆలోచించటానికీ కనీసం సానుభూతితో పరిశీలించటానికీ ట్రంప్ లాంటి వారు సిద్ధంగా లేరు. సామాజిక న్యాయం కోరుకునే వాళ్లందరినీ ప్రస్తుతం అల్ట్రా లెఫ్ట్ వాదులుగానే చూస్తున్నారు. వాళ్ల వల్ల అమెరికా సమాజం మనుగడకే ముప్పు వస్తుందనీ ప్రచారం చేస్తున్నారు. కొన్ని యూరపు దేశాల్లో మాదిరిగా లెఫ్ట్ పార్టీలు అమెరికాలో ఎప్పుడూ బలంగా లేవు. లెఫ్ట్ మేధావుల సంఖ్య ఎక్కువ కాదు. కానీ మతం చుట్టూ, జాత్యహంకారం చుట్టూ, వలసజీవులపై విద్వేషం చుట్టూ రాజకీయాలను నడిపేవాళ్లు.. ప్రజాస్వామ్యంలో సాధారణంగా వచ్చే డిమాండ్లను సైతం ఉపేక్షించలేరనటానికి అమెరికాలోని పరిణామాలే నిదర్శనం.

ఇటలీ ప్రధాని మెలోనీ వ్యాఖ్యలు కొన్ని విషయాల్లో ట్రంప్‌కంటే భిన్నంగా ఉండవు. 'నేను శత్రువులుగా భావించే వాళ్లలో వామపక్షాల వారే మొదట ఉంటారు' అని ఆమె నిర్మొహమాటంగా చెప్పారు. 'వోక్' కల్చర్ అనేది మన దేశాలను (క్రైస్తవ) విడదీస్తుంది. మన చరిత్రను పునర్ నిర్వచిస్తుంది. మన ఉమ్మడి సంప్రదాయాలను నాశనం చేస్తుంది' అని ఘాటుగా విమర్శించారు. సామాజిక అన్యాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పే 'వోక్' కల్చర్ నిజంగానే గత చరిత్రను పునర్ నిర్వచిస్తుంది. చరిత్రను సామాజిక అన్యాయాలు, సామాజిక వివక్ష దృష్టితోనే చూస్తుంది. రాజులు, ప్రభువుల ఘనకార్యాలకే పెద్దపీట వేయదు. యుగయుగాల్లో జరిగిన అన్యాయాలనూ, దురాగతాలనూ బాధితుల కోణం నుంచి పరామర్శిస్తుంది. వాటిని బలంగా వెలుగులోకి తీసుకొస్తుంది. ఇలా తవ్వితీసిన చరిత్ర ఆసరాతో గత అన్యాయాలను మళ్లీ జరగకుండా మనుషులను మేల్కొలుపుతుంది. కానీ సంకుచిత జాతీయ వాదులు చరిత్రలో అన్యాయాల వైపు చూడరు. జాతి చరిత్ర అంతా మనం గొప్పలు చెప్పుకొనే విధంగానే ఉండాలని కోరుకుంటారు. తప్పొప్పులపై శీతకన్ను వేస్తారు. దోపిడీలూ, దురాక్రమణలూ చరిత్రలో లేనట్లుగానే మాట్లాడతారు. వోక్ దృష్టితో సమాజాన్ని చూసేవాళ్లే.. ఇటలీలోని యూనివర్సిటీలు, మ్యూజియంలు, థియేటర్లు, ఒపెరా సంస్థల్లో పాతుకుపోయారని భావించిన మెలోనీ వాళ్లను తొలగించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పాఠ్యాంశాలను తిరగరాసి ఇటలీలో తాము గొప్పవాళ్లు అనుకునే వారికే పెద్దపీట వేయాలని చూస్తున్నారు. యూరపులో భావ విప్లవానికి కారణమైన అనేక మంది మేధావుల చరిత్రలను పాతాళ నుంచి తొలగిస్తున్నారు. మతమౌఢ్యం కంటే అధికంగా, మూర్ఖంగా జాతీయవాదాన్ని జపించే చోట ఇతర దేశాల ఘనతలనూ విజయాలనూ ఏ మాత్రం అంగీకరించే ప్రసక్తి ఉండదు.

# దిమాగీ నక్సల్స్ ఎవరు? ప్రశ్నించే మెదళ్లు ప్రమాదమా?

- జి.తిరుపతయ్య



"దిమాగీ నక్సల్స్"... వ్యాఖ్య ఈ పంద్రాగస్టు సందర్భంగా దేశ రాజకీయ వాతావరణంలో మారుమోగుతోంది. అసలు ఈ పదాన్ని ఏ ఉద్దేశంతో ఉపయోగించారో స్పష్టంగా తెలియక పోయినా, ఇందులో కనిపిస్తున్నది మాత్రం ఒక ఆధిపత్య భావజాల మానసిక ధోరణి. తమను ప్రశ్నించే గొంతులను, తమ పాలనను వేలెత్తిచూపే ఆలోచనలను అనుమానంగా చూడటం, విమర్శను శత్రుత్వంగా పరిగణించడం, తెలివిగా ప్రశ్నించే వారిని ఒక ముద్రతో పక్కకు నెట్టేయడం-ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రం ఆరోగ్యకరం కాదు.

> **"దిమాగీ నక్సల్స్" అని వినగానే సాధారణంగా ప్రజల మనసులో మెదిలే అర్థం ఒక్కటే-తెలివిని ఉపయోగిస్తూ ప్రశ్నించే వారంతా ప్రమాదకరులనే భావన. అంటే ప్రభుత్వాన్ని, దాని విధానాలను, పరిపాలనా తీరును ప్రశ్నించగలిగిన వారు అధికారంలో ఉన్న వారికి మింగుడు పడటం లేదన్నమాట. "పండితుడు పక్కన కూర్చుంటే అవధానికి చెమటలు పడతాయట" అన్న సామెత చందంగా, తమకంటే ఎక్కువగా ఆలోచించేవారు ఎదురుగా ఉన్నప్పుడు అధికారానికి అసౌకర్యం కలగడం కొత్త విషయం కాదు. మతం, ఆధిపత్యం, అస్తిత్వ భావజాలం, అధికారమే పరమావధిగా మారినప్పుడు "తానుతప్ప మరెవ్వరూ తెలివి ప్రదర్శించకూడదు" అనే మనస్తత్వం పాలకుల్లో ఏర్పడటం సహజమే.**

పురాణాలు, చరిత్రలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి. మర్యాద పురుషోత్తముడుగా పిలువబడే శ్రీ రాముడు తపస్సు చేస్తూ వేదమంత్రాలను ఉచ్చరిస్తున్నాడని తెలుసుకుని శంభూకుడు అనబడే దళిత వ్యక్తి తల నరికించిన సంఘటన రామాయణ ఇతివృత్తంలో మనకు కనిపిస్తుంది. ఒక బ్రాహ్మణ బాలుడు అకాల మరణం చెందడానికి ఈ శంభూకుని తపస్సు కారణమని భావించి రాముడు ఆ పని చేసినట్టుగా రామాయణంలో ఒక భాగంలో పేర్కొనబడింది. అందుచేతనే ఆ తర్వాతి కాలంలో శూద్రులు ఎవరూ మంత్రోచ్ఛారణలు చేయరాదని చెవులలో సీసం పోసేవారని అనేక సందర్భాల్లో వినపడుతుంది. మహాభారతంలో కులం తక్కువ వాడని వెలివేసినప్పటికీ విలు విద్యలో రాటుదేలిన ఏకలవ్యుడిని ద్రోణాచార్యుడు ఏం చేశాడో అందరికీ తెలిసిందే. సమాజంలోని అసమానతల పట్ల, వివక్ష పట్ల, సామాజిక హక్కుల పట్ల గొంతెత్తిన జ్యోతిరావు పూలే, పెరియార్ ఈ.వి.రామస్వామి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి వారందరూ ఆధిపత్య భావజాల, అధికార మదాందుల ఆగ్రహావేశానికి బలైనవారే. "బాంచన్ దొర" అని అన్నప్పుడు రాజు మొహంలో ఎంత దివ్యమైన తేజస్సు వెలుగుతుందో, అదేరాజు పక్కన "నేనెందుకు కూర్చోకూడదు" అని ఒక్క ప్రయత్నం చేసినా అంగీకరించలేని స్థితికి అధికార పీఠం పాలకులను చేరుస్తుంది.

క్రీస్తుపూర్వం 399లో అపారమైన మూఢ నమ్మకాలను ప్రశ్నించి, ప్రతి అంశాన్ని తర్కంతో చూడవలెనని యువతకు బోధిస్తూ నూతన ఆవిష్కరణలకు ప్రశ్నల ద్వారా సమాధానాలు వెతుకుతున్న సోక్రటీస్‌ను ఆనాటి ప్రభుత్వం అత్యంత క్రూరంగా హత్య చేసింది. భూమి గుండ్రంగా ఉందని వాదించిన ప్లేటోపై రాజ్య ధిక్కరణ కేసులు పెట్టింది. అవన్నీ అత్యంత క్రూరమైన, నాగరికత ఏ మాత్రం అభివృద్ధి చెందని సమాజాలు. రాజు దైవాంశ సంభూతుడిగా వెలుగొందుతున్న కాలాలు. ఇప్పుడు ప్రజాస్వామ్యం, ప్రజలే ప్రభువులను నిర్ణయిస్తారు. ప్రజలే ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తారు. ప్రజాభిప్రాయమే పాలకులకు పరమావధి. మెజారిటీ ప్రజల అభిప్రాయాలు భిన్నంగా వ్యక్తమైనప్పుడు పాలకులు తమ శాసనాలను తిరిగి రాసుకునే పరిస్థితి ప్రజాస్వామ్యంలోనే ఉంటుంది. దాదాపు 2500 సంవత్సరాల తర్వాత కూడా అదే పద్ధతిలో ఒక ఆధిపత్య భావజాలంతో "దిమాగి నక్సల్స్" అంటూ పరోక్షంగా, స్వాతంత్ర దినోత్సవ సాక్షిగా 145 కోట్ల ప్రజానీకాన్ని నిందించడం అంటే అది దేనికి సంకేతం?

ఏ సమాజంలోనైనా "వాసన లేని పువ్వు, బుధవర్గము లేని పురము" అర్థరహితమని భర్తృహరి ఏనాడో విశదీకరించాడు. బుధవర్గం అంటే పండితులు, విషయ పరిజ్ఞానం కలిగినవారు, ఆలోచనాపరులు. అలాంటి వారు సమాజంలో ఎక్కువగా ఉండాలని కోరుకోవాలి. "ఆ నో భద్రాః క్రతవో యంతు

విశ్వతః" అనే వేద వాక్యం కూడా ప్రపంచంలోని అన్ని దిక్కుల నుంచి శ్రేయస్కరమైన ఆలోచనలు రావాలని సూచిస్తుంది. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అనే భావన కూడా సత్యాన్ని అన్వేషించే భిన్న దృక్కోణాలకు స్థానం కల్పిస్తుంది. అయితే "ఘనమైన చరిత్ర, గణనీయమైన వారసత్వం" మనదని చెప్పుకోవడంలో అసలు అర్థం ఏమిటి? మన వారసత్వంలో దాగి ఉన్న ఇలాంటి విశాలమైన ఆలోచనలను ఆచరణలో పెట్టడమే కదా! అలాకాకుండా ఎవరో ఎద్దేవా చేసినట్లు, "మానవతా వాదివి కావాలంటే చదువుకుని మహా పండితుడివై ఉండాలి, మతతత్వవాదివి కావాలంటే నీకు ఏమీ తెలియని మూర్ఖత్వం పట్ల నీవే గర్వంతో విర్రవీగుతూ ఉండాలి" అనే పరిస్థితి ఏర్పడితే అది సమాజానికి ఎంతటి నష్టాన్ని కలిగిస్తుంది? విశ్వమంతా, సర్వకాలాలలో, సర్వ మతాలలో విజ్ఞులకు, వారి విజ్ఞతకు పెద్దపీట వేస్తుంటే, మనం విజ్ఞత కలిగిన వారినే శత్రువులుగా భావించడం సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యతని స్తున్నట్లా? లేక అధికార పీఠానికి బీటలు పడతా యన్న అభద్రతతో వణికిపోతున్నట్లా?

మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తినప్పుడు, అక్కడి పరిస్థితులు ఆయన్ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆ అనుభవాలే ఆయన్ను భారతదేశంలోని వివక్షను, బ్రిటిష్ వలస పాలనను ప్రశ్నించే దిశగా నడిపించాయి. భారత స్వాతంత్ర్యోద్యమానికి కొత్త ఊపిరినిచ్చిన పూజ్య బాపూజీని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం "దిమాగీ నక్సల్" అని ముద్రవేయలేదు. బక్కపలుచని శరీరం, తీగలాంటి సాధారణ గొంతు ఉన్నప్పటికీ, ఆయన ఆలోచనల ముందు ప్రపంచం తలవంచింది. భారతదేశానికి పూర్ణ స్వరాజ్యం కావాలని నెహ్రూ తదితరులు పట్టుబట్టినప్పుడు గాంధీజీ తొలినాళ్లలో వారి వ్యూహాలతో విభేదించిన సందర్భాలున్నాయి. కానీ, చివరికి పూర్ణ స్వరాజ్య లక్ష్యాన్ని ఆయన అంగీకరించారు. అంటే భిన్నమైన ఆలోచనను మొదట వ్యతిరేకించినా, దానిలోని న్యాయాన్ని గుర్తించి తన అభిప్రాయాన్ని మార్చుకునే గొప్పతనం కూడా నాయకత్వంలో ఉండాలి.అదే విధంగా, బాల్యం నుంచే సామాజిక వివక్షను ఎదుర్కొన్న, తరగతి గది బయట కూర్చోవాల్సి వచ్చిన, నీటి కోసం కూడా అవమానాలను ఎదుర్కొన్న బాలుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌గా ఎదిగాడు. తన మేధస్సుతో, ప్రశ్నలతో, అధ్యయనంతో దేశాన్నే ఆలోచింపజేశాడు. చివరికి అదే సమాజం భారత రాజ్యాంగాన్ని రూపొందించే అత్యంత కీలకమైన బాధ్యతను ఆయనకు అప్పగించింది. ఇదే కదా దిమాక్‌ను ఉపయోగించుకునే నిజమైన పద్ధతి! సమాజ గతికి, పాలకుల ఏకపక్ష ధోరణులకు, అన్యాయాలకు ఎదురు నిలిచినవారే అనేకసార్లు నూతన శకానికి నాంది పలికారు. ప్రశ్నించే వ్యక్తి శత్రువు కాదు, సమాజం తప్పు దారిలో వెళ్ల కుండా హెచ్చరించే కాపలాదారు. విమర్శించే మేధస్సు పాలకులకు శాపం కాదు, అది ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం.

ఇంతటి సూక్ష్మాన్ని మరిచి నిప్పులాంటి ప్రశ్నించే తత్వంపై దుప్పటి కప్పేస్తే, సదరు దుప్పటి బూడిదై పోతుందని వేరే చెప్పాలా! నిజానికి ఇప్పుడు జరుగుతున్నది నైపుణ్య దోపిడీ, దానిపై స్వారీ. అనగా ఇతరుల నైపుణ్యాన్ని విచ్చలవిడిగా ఉపయోగిస్తూ తమకు అనుకూలమైన విధంగా లాభాలను దండుకోవడమే పరమావధిగా నడుస్తోంది. దీనినే "దిమాగీ చోరీ" అనవచ్చు. ఇంకా వివరంగా చెప్పాలంటే ఇండియన్ సివిల్ సర్వీస్ ఉన్నతాధికారుల నుండి మొదలు అనేక మంది నిపుణుల ఆలోచనలలో చొరబడి తమకు అనుకూలమైన విధంగా, తమ విధానాలు మాత్రమే పరిఢవిల్లే విధంగా ప్రభుత్వ పాలసీలను తయారు చేయించి, అట్టి పాలసీలను ప్రజలపై రుద్ది, తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందుతూ ఉంటారు. రకరకాల పన్నుల విధింపు నుంచి ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడే విధమైన అనేక రకాల ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఇలాంటి అనేకమంది అధికారుల మెదళ్లను పావులుగా ఉపయోగిస్తూ ఉంటారు. పాలకులకు ఉపయోగపడే సలహాలు ఇచ్చేవారు "దిమాగీ నక్సల్స్" కారు. అదే సలహాను ప్రశ్నిస్తే, ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తే, ఒక్కసారిగా వారే "దిమాగీ నక్సల్స్" అయిపోతారు. మరి ఇది ఏ రకమైన ప్రమాణం?

**అంతేకదా సార్! ఎన్నికల్లో తమకు ఉపయోగపడే సలహాలు ఇచ్చిన వారు మంచి వ్యూహకర్తలు, ప్రతిపక్ష పార్టీకి సలహాలిచ్చిన వారంతా ద్రోహకర్తలు! ఇలాంటి భావ దారిద్ర్యం మెదడులో నిండుకున్నప్పుడు ప్రజలలోని పండితులంతా శత్రువులుగానే కనిపిస్తారు. ఇలాంటి పోకడలకు చరమగీతం పాడకపోతే అది పెరిగి మరింత పెద్ద రాచపుండుగా మారుతుంది. ఆలోచనాపరులను వేలెత్తి చూపడంతో ఆగకుండా, చివరికి ప్రతి ముఖానికి ముసుగు వేసుకుని తిరగమని శాసించే రోజులకు ఇది దారితీయవచ్చు. అందుకే ప్రశ్నించే మెదడును "దిమాగీ నక్సల్" అని ముద్రవేయడం కాదు. ఆ మెదడు ఎందుకు ప్రశ్నిస్తుందో వినాలి. విమర్శను అణచివేయడం కాదు. విమర్శలోని వాస్తవాన్ని పరిశీలించాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రమాదం ప్రశ్నించే పౌరుడి నుంచి కాదు. ప్రశ్నించడానికి భయపడే సమాజం నుంచి మొదలవుతుంది.** ❑

# ప్రశ్నించడం దేశద్రోహం కాదు..

**ప్రత్యేక ఇంటర్వ్యూలో నేహా బోరా**



**ప్రశ్న : అధికారం భయాన్నే ఒక ఆయుధంగా మార్చుకున్నప్పుడు, భయపడటానికి నిరాకరించడమే ఒక పెద్ద తిరుగుబాటు అవుతుంది. 'జెన్ జీ' (Gen Z) ఈ భయాన్ని ఎలా జయించింది.? ఈ దేశానికి మీ తరం ఇవ్వాలనుకుంటున్న అతిపెద్ద పాఠం ఏమిటి?**

నేహా : భయం తన హద్దులు దాటినప్పుడు చివరకు భయమే చనిపోతుంది. హిందీలో ఒక కవిత ఉంది – 'జుల్మ్ జబ్ హద్ సే బఢ్తా హైతో మిట్ జాతా హై'(అణచివేత హద్దులు దాటినప్పుడే దానికి అంతం మొదలవుతుంది). ప్రజలను ఎంతగా భయపెడతారు? లాఠీలు ఝుళిపిస్తారు, పెల్లెట్ గన్స్ ప్రయోగిస్తారు, ఉగ్రవాదులంటారు, వైరస్‌లంటారు. ఒక దశ తర్వాత ప్రజలు భయపడటం మానేస్తారు. మనం చాలాకాలంగా భయంతోనే జీవిస్తున్నాం. ఒక దశాబ్దానికి పైగా భయపెట్టారు. ఇక ఈ భయాందోళనల పాలనకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. భయం సరిహద్దు దాటితే వచ్చేది ధైర్యమే! మనమందరం సంఘటితమై పోరాడితే ఎంతటి భయమైనా పటాపంచలు కావాల్సిందే. ఇదే మేము దేశానికి ఇవ్వాలనుకుంటున్న సందేశం.

**ప్రశ్న: జంతర్ మంతర్ ఆందోళన విద్యార్థుల సమస్యలతోనే ప్రారంభమైనా.. ఉపాధి, రైతులు, కార్మికులు, మహిళలు, పౌర హక్కులతో ముడిపడిపోయింది. ఒక విద్యార్థి ఉద్యమం ప్రజా ఉద్యమంగా ఎప్పుడు మారుతుంది?**

నేహా: విద్యార్థులు ప్రజలు కాదన్నట్టుగా 'విద్యార్థి ఉద్యమమా? ప్రజా ఉద్యమమా?' అని విభజించడం సరైంది కాదు. విద్యార్థులు ఈ సమాజంలో భాగమైన ప్రజలే. జంతర్‌మంతర్ పోరాటం చివరి వరకు 'విద్యార్థి ఉద్యమం'గానే నిలిచింది. కాకపోతే దాని పరిధి విశాలమైంది. నీట్ (NEET) బాధితులతో మొదలై.. పీహెచ్‌డీ స్కాలర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు, స్కూలు పిల్లలు, సివిల్స్ అభ్యర్థుల వరకు ప్రతీ విద్యార్థినీ ఇది ఏకం చేసింది. రైతులు, కార్మికులు, మహిళలు, లాయర్లు, ప్రొఫెసర్లు వచ్చి మద్దతు తెలిపారు. ఇది విద్యార్థి ఉద్యమ స్వరూపానికి విస్తృతమైన ప్రజాదరణను, బలమైన మద్దతును ఇచ్చింది. అంటే విద్యార్థి అనే నిర్వచనం విస్తరించింది. అయినా విద్యార్థుల ఆకాంక్షల కేంద్రంగానే సాగింది.

**ప్రశ్న: 'విద్యార్థులు రాజకీయాల్లోకి రాకూడదు' అని నిరంతరం వింటుంటాం. కానీ విద్యా విధానాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాలు... అన్నీ రాజకీయ నిర్ణయాల పైనే ఆధారపడి ఉన్నాయి కదా? రాజకీయాలను ప్రశ్నించకుండా విద్యార్థులు తమ భవిష్యత్తును మార్చుకోగలరా?**

నేహా: రాజకీయం అనేది ఏదో అసహ్యకరమైన పదం కాదని, అదొక చెడ్డ విషయం కాదని ఈ తరం గుర్తించింది. మన కళ్ల ముందు జరుగుతున్న అన్యాయాలను చూస్తూ ఊరుకోకుండా, ఆ పరిస్థితిని మార్చడానికి మన చేతిలో ఉన్న శక్తిమంతమైన ఆయుధమే రాజకీయం! అందుకే రాజకీయాల నుంచి పారిపోవడం కాదు. మన జీవితాలను ప్రభావితం చేసే రాజకీయ నిర్ణయాలను అర్థం చేసుకుని, ప్రశ్నించి, అవసరమైతే మార్చే శక్తిగా రాజకీయాలను చూడాలి. ఆ మార్పు సానుకూలమైనది, నిరీక్షణను నింపేది, మెరుగైన రేపటిని అందించేది.

**ప్రశ్న: ప్రజలను భయపెట్టేందుకు కృత్రిమ భయాలను సృష్టిస్తున్నారని మీరు భావిస్తున్నారా? సాధారణ ప్రజలు ఆ భయాన్ని ఎలా గుర్తించాలి? దాన్ని సామూహిక ధైర్యంగా ఎలా మార్చాలి?**

నేహా: ప్రజలు నేడు ఎదుర్కొంటున్న భయం నిజమైనదే. ఐటీ సెల్ ద్వారా మహిళలకు అత్యాచార బెదిరింపులు, చంపేస్తామనే వార్నింగ్‌లు ఇస్తూ వాతావరణాన్ని భయానకంగా మారుస్తున్నారు. ఫాసిస్టుల అతిపెద్ద ఆయుధం – ప్రజల్లోనే ఒకరినొకరు శత్రువులుగా మార్చడం!

ఉద్యోగాలు ఎందుకు లేవని అడిగితే – 'ముస్లింలు మీ ఉద్యోగాలు లాక్కుంటున్నారు' అంటారు. క్యాంపస్‌లలో సీట్లు

ఎందుకు లేవని అడిగితే – 'రిజర్వేషన్ల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు మీ సీట్లు కొట్టేస్తున్నారు' అంటారు. తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి, కార్పొరేట్ మిత్రులను సంతృప్తిపరచడానికి ప్రభుత్వం సామాన్య ప్రజల మధ్యే పూడ్చలేని గోడలు కడుతోంది. ప్రశ్నించే వారికి 'దేశద్రోహులు', 'పాకిస్తానీలు' అని ముద్రవేయడం బాధ్యతల నుంచి పారిపోవడానికే. చరిత్రలో ఫాసిస్టు శక్తులు ఎప్పుడూ ఇదే పద్ధతిని ఉపయోగించాయి. భయాన్ని సృష్టించడం, ఒక శత్రువును తయారు చేయడం, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించడం. ఈ కుట్ర ను ప్రజలు గుర్తించిన రోజే ఆ భయం ఉమ్మడి పోరాట ధైర్యంగా మారుతుంది.

**ప్రశ్న: అధికారాన్ని ప్రశ్నించేవారిని దేశద్రోహులు, ఏజెంట్లు వంటి ముద్రలతో పిలుస్తున్నారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించినంత మాత్రాన దేశానికి వ్యతిరేకి అయిపోతారా? లేక నిలదీసే ధైర్యమే అసలైన దేశభక్తా?**

నేహా: బ్రిటిష్ వారి హయాంలో మనం వాళ్లను ప్రశ్నించాం కాబట్టే ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నాం. ఆ రోజు నిలదీయడమే మన చరిత్ర. ఈ రోజు ఆ దోపిడీ దొంగలు బ్రిటిష్ వారు కాకపోవచ్చు... గుజరాత్ నుంచో, కార్పొరేట్ కంపెనీల నుంచో వచ్చినవారు కావచ్చు. వాళ్లను కూడా ప్రశ్నించి తీరాల్సిందే! రాజ్యాంగం ప్రకారం 'ప్రజలే ఈ దేశం'. కొన్ని ప్రభుత్వాలు లేదా వ్యక్తులు అధికారంలో లేకపోవడమే దేశానికి మేలు అనుకున్నప్పుడు, ఆ ఫాసిస్టుల రాజీనామాను డిమాండ్ చేయడమే ఈ దేశానికి మనం చేసే అతిపెద్ద, అత్యంత నిజమైన 'దేశభక్తి'.

**ప్రశ్న: జంతర్ మంతర్ వద్ద ఎంతోమంది యువతులు ముందు కొచ్చారు. అవమానాలను, అణచివేతలను ఎదుర్కొన్నారు. స్పష్ట మైన అభిప్రాయాలున్న యువతిని చూస్తే పాలకులకు ఎందుకు భయం? దేశంలోని ప్రతీ యువతికి మీరిచ్చే సందేశం ఏమిటి?**

నేహా: రాజ్యాంగాన్ని తీసివేసి 'మనుస్మృతి'ని తేవాలని చూసే శక్తిమంతులైన పాలకులకు మహిళలు ఇంట్లోనే ఉండి పురుషులకు సేవ చేయాలనే ఆలోచన ఉంటుంది. మహిళలు రోడ్డుపైకి వచ్చి మాట్లాడితే, తమవైపు మాట్లాడినంత కాలం ఓకే. కానీ ఎదురు తిరిగి ప్రశ్నిస్తే తట్టుకోలేరు! 15 ఏళ్ల రుచిక అనే చిన్నారిపై 5 ఎఫ్ఐఆర్‌లు పెట్టారు. పార్లమెంట్‌లో ఎంపీలు మమ్మల్ని 'గట్టర్ జనరేషన్', 'ఉగ్రవాదులు' అని తిట్టినా సమా జం కంగారుపడదు కానీ, ఒక మహిళ బిగ్గరగా, రాజకీయం మాట్లాడితే – 'ఈమె దుస్తులు చూడు, ఈమె ప్రవర్తన చూడు, కుటుంబ గౌరవాన్ని తీస్తోంది' అని వేళ్లు చూపిస్తారు. ఇది పితృస్వామ్య ఆలోచన. ఎందుకంటే, ఒక మహిళ వీధిలోకి వచ్చి గళమెత్తిందంటే... ఆమె తన ఇంట్లో, తన సమాజంలో ఎన్నో పోరాటాలు చేసి, ఆ గోడలను బద్దలు కొట్టుకుని వచ్చిందని అర్థం! ఆ నిర్భయత్వమే పాలకులను వణికిస్తోంది.

**ప్రశ్న: 23 రోజుల నిరాహార దీక్ష తర్వాత కొన్ని డిమాండ్లు నెరవేరాయి. అయినా 'ఇది ఆరంభం మాత్రమే' అన్నారు. డిమాండ్లు నెరవేరగానే ఉద్యమం ముగుస్తుందా? లేక, ఆ మార్పును నిలబెట్టుకోవడానికి అసలు పోరాటం అప్పుడే మొదలవుతుందా?**

నేహా: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆగ్రహం, లేదా విద్యావ్యవస్థలోని లోపాలు ఒక్కసారిగా మాయమైపోవు. మోదీ–అమిత్ షాల ప్రభుత్వం ఎంతటి నిరంకుశమైనదో, ఎంతటి అసమర్థమైనదో ఈ ఉద్యమంతో వారి గాలిబుడగ పంక్చర్ అయి ప్రపంచానికి తేటతెల్లమైంది. ఈ దేశపు కొత్త తరం (యువత)తో మాట్లాడే దారి, వారి మద్దతు వారికి పూర్తిగా పోయింది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఈ యువతరమే. కాబట్టి యువత తిరస్కరించిన పాలకులు త్వరలోనే అధికారం కోల్పోవడం ఖాయం.

**ప్రశ్న: ప్రభుత్వాన్ని నిలదీయడం అవసరమే. కానీ ఆ తర్వాత ఏమిటి? మీ తరం కేవలం నిరసన తెలపడానికే పరిమితమా? లేక మెరుగైన విద్య, ఉపాధి, సమానత్వం, స్వేచ్ఛలతో కూడిన నవ భారతాన్ని నిర్మించే స్పష్టమైన విజన్ ఉందా? ఒక ప్రత్యామ్నాయ దృక్పథం కూడా చూపగలదా?**

నేహా: ఆగస్టు 20 నాటి హింస తర్వాత, ఒక్క మంత్రి రాజీనామాతో వ్యవస్థ మారదని అందరికీ అర్థమైంది. విద్యా, ఉపాధి, సామాజిక రంగాల్లో పాలకులు నిర్మించిన ఈ పునాదులనే కూల్చివేసి, ఒక నూతన వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆ కొత్త భారత్ విజన్ విత్తనం ఇప్పటికే నవతరంలో నాటుకుంది. అది త్వరలోనే వటవృక్షమై ఈ దేశాన్ని కాపాడుతుంది.

**ప్రశ్న: కులం, మతం, ప్రాంతం, భావజాలాల పేరుతో సమాజం విడిపోతున్న వేళ, విద్యార్థులు ఒకే వేదిక పైకి వస్తున్నారు. ఈ విభజన గోడలను బద్దలుకొడుతూ ప్రజాస్వామ్య ఉద్యమాన్ని ఎలా నిర్మించగలం?**

నేహా: మన మధ్య తేడాలు, విభేదాలు మాత్రమే ఉన్నాయని ఆర్ఎస్ఎస్–బీజేపీ ప్రచారార్భాటం మనల్ని నమ్మించింది. కానీ ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే – కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా కలిసి పోరాడిన విప్లవ పోరాటాల చరిత్ర ఈ దేశానికుంది. ఈ రోజు కుప్పకూలుతున్న ప్రజా ఆరోగ్యం, ప్రైవేటీకరణ అవుతున్న విద్య, పెరిగిపోతున్న నిరుద్యోగం ప్రతీ ఒక్కరి సమస్య! ఈ ఉమ్మడి **(మిగతా 15వ పేజీలో)**

# అగౌరవం కాదు, అవసరమైన నిష్కర్ష!



- ఎన్.వేణుగోపాల్

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులు చేసిన ప్రకటనకు, ప్రదర్శించిన నిష్కర్షకు అభినందనలు, కృతజ్ఞతలు, శుభాకాంక్షలు. ఈ పరిణామం పూర్తిగా తెలంగాణకు సంబంధించినది కాకపోవచ్చు. నల్సార్‌లో విభిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉంటారు. కాని ఎక్కడి నుంచి వచ్చినా తెలంగాణ నేల మీద చదువుకున్న, చదువుకుంటున్న విద్యార్థులు ప్రస్తుత సందర్భంలో అత్యవసరమైన ధిక్కారాన్ని ప్రకటించినందుకు కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది. ఇవాళ మన సమాజంలో అతి ధూర్త వినయాలు, మొహమాటాలు, మర్యాదలు, నంగిమాటలు, స్వప్రయోజనాల కోసం విలువల తాకట్టు, భజన, రాగ్ దర్బారీలో భాగస్వామ్యం, ఎంగిలి మెతుకుల కోసం వెంపరలాట వంటి లక్షణాలే సమర్థతకూ, నైపుణ్యానికీ చిహ్నాలుగా మారుతున్న సందర్భంలో, సామాజిక విలువల చట్రమే తలకిందులుగా అమలవుతున్న వేళ, ఉన్నది ఉన్నట్టు నిర్మొహమాటంగా చెప్పడానికి సాహసించినందుకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు జేజేలు.

బహుశా వారందరూ ఇంకా ఇరవై, ఇరవై ఐదేళ్ల లోపు చిన్నారి పిల్లలు. న్యాయశాస్త్రం చదువుకున్నవాళ్లు. న్యాయశాస్త్రం చదువుకుని తల పండిపోయి న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా అన్యాయాన్నే తలకెత్తుకుంటున్న అనేక మందిలా కాక, యువతరపు ఉడుకు నెత్తురుతో, తమ న్యాయ శాస్త్ర పరిజ్ఞానం న్యాయ భావనను నిలబెట్టడానికి ఉపయోగించాలని అనుకున్నారు. చాలామంది పెద్దలు, చదువుకున్నవాళ్లు, బుద్ధిమంతులు చెప్పలేని మాటలు చెప్పారు, చేయలేని పని చేశారు. 'రాజుగారికి బట్టల్లేవు' అనే వాస్తవాన్ని, చుట్టూ చూస్తున్న నిండు పేరోలగం, వందిమాగధ, కవి గాయక స్తోత్ర పాఠకులు అనలేకపోయిన మాటను, ఒక అమాయకపు చిన్నారి పిల్లవాడు అన్న జానపద కథ మనందరికీ తెలుసు. సరిగ్గా ఆ కథలోని ముక్కుపచ్చలారని చిన్నారి లాగనే, దేవతా వస్త్రాలతో తిరుగుతున్న భారత ప్రధాన న్యాయమూర్తి గురించి నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులు నిజం బైట పెట్టారు.

ప్రతి విశ్వవిద్యాలయంలోనూ విద్యా సంవత్సరం చివర తమ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసే ఉత్సవం జరుగుతుంది. కాన్వొకేషన్ అని పిలిచే ఈ ఉత్సవం విద్యార్థుల జీవితంలో చాలా కీలకమైన, సంతోషకరమైన సందర్భం. పట్టాలు ప్రదానం చేయడానికీ, ఆ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కాన్వొకేషన్ అడ్రస్ అనే కీలకోపన్యాసం చేయడానికీ ఒక ప్రముఖ వ్యక్తిని ముఖ్య అతిథిగా పిలుస్తారు. నల్సార్ విశ్వ విద్యాలయ ఛాన్సలర్ అయిన భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని నల్సార్ కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీ.

ఈ సంవత్సరం కాన్వొకేషన్ మరి కొద్ది రోజుల్లో జరుగుతుందనగా, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌నూ, రిజిస్ట్రార్‌నూ, అధ్యాపకులనూ సంబోధిస్తూ 450 మంది విద్యార్థులు రాసిన ఒక ఇ మెయిల్ లేఖ జూలై 23న బైటపడింది. ఆ లేఖను మొదట డెబ్బై మంది విద్యార్థులు ప్రారంభించారనీ, కాని కొన్ని గంటల్లోనే మరొక 380 మంది విద్యార్థులు దాని మీద సంతకాలు పెట్టారనీ తెలుస్తున్నది. ఆ లేఖలో విద్యార్థులు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను విశ్వవిద్యాలయ కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా ఆహ్వానించాలనే ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

"న్యాయశాస్త్ర విద్యార్థులుగా, మా ఆసక్తి పరిమితమైనది. పట్టాలు పుచ్చుకోబోతున్న తరగతి విద్యార్థులుగా మా ఆందోళన ప్రత్యేకమైనది. మా దృష్టిలో కాన్వొకేషన్ ప్రత్యేకమైనది. రాజ్యాంగ హక్కుల పట్ల నిబద్ధత, అందరికీ అందుబాటులో న్యాయం, సమస్యలతో సహేతుకంగా వ్యవహరించడం అనే విలువలతో సహా మన విశ్వ విద్యాలయపు సొంత విలువలు కూడా స్పష్టంగా ప్రతిఫలించే, విశ్వ విద్యాలయ ఎంపికలు వ్యక్తమయ్యే మహత్తర సమయం ఇది. ఏ ప్రముఖ వ్యక్తి ఇటీవలి సామాజిక ప్రవర్తనలో, ప్రచార మాధ్యమాల ప్రకారం, నిరసన తెలుపుతున్న పౌరులకు వ్యతిరేకంగా పోలీసులు చూపిన క్రూరత్వ ఆరోపణలను తేలిగ్గా తీసిపారవేశారో, ఆ వ్యక్తి చేతుల నుంచి మా డిగ్రీలు తీసుకోవడం, ఇంత కాలం నల్సార్ విశ్వ విద్యాలయంలో మేము నేర్చుకున్న విలువలకు సరిపడనిదని మేం అనుకుంటున్నాం"

అని విద్యార్థులు కుండ బద్దలు కొట్టారు. వారు ఎంత నర్మగర్భంగా రాసినా, ఆ మనిషి చేతులు మాకు డిగ్రీ ఇవ్వడానికి తగినవని మేం అనుకోవడం లేదు అనే మాట స్పష్టంగానే ఉంది.

ఈ ఉత్తరం జూలై 23న బైటపడింది గాని, పోలీసు దౌర్జన్యపు వీడియోలు చూడడానికి తనకు సమయం లేదని ప్రధాన న్యాయమూర్తి జూలై 21న సుప్రీంకోర్టులో చేసిన వ్యాఖ్యల తర్వాత రాసినదై ఉంటుంది. జూలై 20న ఢిల్లీలో జంతర్

మంతర్ నుంచి పార్లమెంటు భవనానికి శాంతియుత ప్రదర్శన జరపాలని కాక్రోచ్ జనతా పార్టీ 'ఛలో సంసద్' పిలుపు ఇచ్చింది. లక్షలాది తరలి వచ్చిన విద్యార్థి యువజన ప్రదర్శనకారుల మీద ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి చేశారు. వాటర్ కానన్ లతో దాడి చేశారు. పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు. దారుణమైన హింసాకాండ అమలు జరిపారు. వందలాది మంది విద్యార్థులను గాయపరిచారు. నెత్తురు పారించారు. నిరసన ప్రదర్శనలతో వ్యవహరించడానికి ఉన్న చట్టపరమైన నిబంధనలన్నిటినీ ఉల్లంఘించారు. గోదీ మీడియాగా పేరు పొందిన ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు ఈ దమనకాండను చూపనప్పటికీ, తగ్గించి చూపినప్పటికీ, సామాజిక మాధ్యమాలలో ఆ పోలీసుల దౌర్జన్యం, చట్టవ్యతిరేక, అమానుష ప్రవర్తన అంతా సంపూర్ణంగా కనబడుతున్నది. ఈ దమనకాండ మీద సుప్రీంకోర్టు వెంటనే విచారణ జరపాలనీ, విద్యార్థుల మీద హింసకు పాల్పడిన బాధ్యులను శిక్షించాలనీ సుప్రీంకోర్టు ముందరికి అభ్యర్థనలు వస్తే, అవి వినడానికీ, వీడియోలు చూడడానికీ తమకు సమయం లేదని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఆ వీడియోలు చూపెట్టి కోర్టు సమయం వృథా చేయవద్దనీ, న్యాయవాదులు తమ సమయం వృథా చేసుకోవద్దనీ జస్టిస్ సూర్యకాంత్ ఉచిత సలహా ఇచ్చారు. ఆ వార్తలు చదివితే ఏమాత్రం హృదయం ఉన్న వారైనా ఆ నిర్దాక్షిణ్య స్పందనకు కోపం తెచ్చుకోకతప్పదు. నల్సార్ విద్యార్థులు తమ లేఖలో ప్రకటించినది ఆ న్యాయమైన ఆగ్రహాన్ని మాత్రమే.

తాను అలా అనలేదని, ప్రచార సాధనాలు తప్పుగా రాశాయని ఆ తర్వాత ఆయన వివరణ ఇచ్చారు. జంతర్‌మంతర్ పోలీసు దుర్మార్గాల మీద విచారణ ప్రారంభించారు. అయినప్పటికీ, అనాలోచితంగానో, ఉద్దేశపూర్వకంగానో ఆయన అంతకు ముందు చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజల హృదయాల్లో, ముఖ్యంగా విద్యార్థి యువజనుల జ్ఞాపకంలో నిలిచిపోయాయి. తాను ఆ వ్యాఖ్యలు చేసినప్పుడు పద్ధతి ప్రకారం పిటిషన్ రాలేదని, ఒక న్యాయవాది మౌఖికంగా ప్రస్తావించారని సాంకేతిక కారణం చెప్పినప్పటికీ, విద్యార్థి ప్రదర్శకుల పట్ల, పోలీసుల దుర్మార్గం పట్ల ఆయన మనసులోని మాట ఏమిటో దేశానికి తేటతెల్లమయింది.

నిజానికి దేశంలో న్యాయవ్యవస్థ ప్రజలకు అందరాని దూరంలో, ఖరీదులో ఉందనీ, అందువల్ల ప్రజల నుంచి ఏ రూపంలో ఫిర్యాదు వచ్చినా స్వీకరించాలనీ, పోస్ట్ కార్డ్, టెలిగ్రామ్, మామూలు ఉత్తరం, చివరికి పత్రికా వార్త వంటి వాటిని కూడా స్వీకరించి ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా విచారణ జరపాలనీ ఇదే సుప్రీంకోర్టు 1970ల చివరలో, 1980లలో ఒక కొత్త, అవసరమైన, ప్రజోపయోగకరమైన, ఈ దేశానికి అవసరమైన సంప్రదాయాన్ని నెలకొల్పింది. ఇటీవలి కాలంలో ఆ సంప్రదాయానికి స్వయంగా న్యాయమూర్తులే తూట్లు పొడవడం జరుగుతున్నది. ప్రధాన న్యాయమూర్తితో సహా ఎందరో న్యాయమూర్తులు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను చిన్నచూపు చూస్తూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు సుప్రీంకోర్టుకు కూతవేటు దూరంలో రోడ్ల మీద విద్యార్థులను పరుగెత్తిస్తూ, నెత్తురు కారేట్టు కొడుతున్నప్పుడు, పెల్లెట్ గన్‌లతో చట్టవ్యతిరేక కాల్పులు జరుపుతున్నప్పుడు, ఆ చర్యలు ఎంత అమానుషంగా, ఎంత చట్టవ్యతిరేకంగా, ఎంత అప్రజాస్వామికంగా జరిగాయో చూడడానికైనా వీడియోలు చూడడం న్యాయమూర్తుల బాధ్యత. పోలీసులు అంతా సక్రమంగానే ప్రవర్తించారు అని నిర్ధారించడానికైనా ఆ వీడియోలు చూడాలి. కాని బాధ్యతారహితంగా తనకు అవి చూసే సమయం లేదని అనడం, ఎటువంటి పరిస్థితిలో అన్నప్పటికీ క్షమార్హం కాదు.

"మేము ఈ సమస్యను ఇప్పుడే, కాన్వొకేషన్ కన్నా చాలా ముందే, ప్రధాన న్యాయమూర్తిని ఆహ్వానించాలని మీరు నిర్ణయం తీసుకోకముందే మీ దృష్టికి తెస్తున్నాం. మీరు నిర్ణయం తీసుకునే సమయానికి మా అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నాము" అని రాశారంటే విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారుల పట్ల ఎంత మర్యాదగా, గౌరవంతో ఉన్నారో అర్థమవుతుంది. ఒకవేళ ఆయనను ఆహ్వానించాలనే ప్రతిపాదన ఏదైనా ఉంటే దాన్ని లాంఛనప్రాయమైన ఆహ్వానం పంపకముందే తీవ్రంగా పునరాలోచించాలని విద్యార్థులు సూచించారంటే విద్యార్థుల సమన్వయ ధోరణి కనబడుతుంది.

భారత ప్రధాన న్యాయమూర్తి హోదాలో ఉన్న వ్యక్తి విషయంలో ఇలా జరగడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి కావచ్చు. మరొక ఎనిమిది నెలల్లో పదవీ విరమణ చేయబోతుండగా ఆయన ఇటువంటి అవమానాలను, తిరస్కరణలను మూటగట్టుకోవడం విచారకరమే. విద్యార్థులు ఇలా ప్రవర్తించడం వ్యక్తిగతంగా జస్టిస్ సూర్యకాంత్‌కు అవమానమనో, అగౌరవమనో, భారత ప్రధాన న్యాయమూర్తి అనే పదవి ప్రతిష్ఠకు భంగకరమనో ఎవరైనా అనుకోవచ్చు. కాని ఈ పరిణామాలు ఇలా సంభవించడానికి పూర్తి బాధ్యత ఆయన ప్రవర్తనలోనే ఉంది. లేదా న్యాయవ్యవస్థ స్వతంత్రతను చెరిపివేస్తూ అధికారంలో ఉన్నవారి అడుగులకు మడుగులొత్తడంలోనే ఉంది. నిజానికి జస్టిస్ సూర్యకాంత్ గత చరిత్రలోని అభ్యంతరకర విషయాలను, ప్రధాన న్యాయమూర్తిగా చట్టాన్ని కూడా పక్కన పెట్టి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన తీరును, బెంగాల్ ఓటర్ల తొలగింపులో, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విచారణలో ఆయన తీసుకున్న అన్యాయమైన వైఖరిని పక్కన పెట్టినా, మే రెండో వారంలో తన ముందుకు వచ్చిన ఒక కేసులో అనవసరంగా ఈ దేశ యువతరం గురించి పరాన్న భుక్కులనీ, బొద్దింకలనీ, మీడియాగా, ఆందోళనకారులుగా

మారుతారనీ ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా విద్యార్థి యువజనులలో ఆయన పట్ల వ్యతిరేక పెరగడానికి కారణమయ్యాయి. నల్సార్ విద్యార్థుల ప్రతిఘటన ఆ దేశవ్యాప్త ఆగ్రహ ప్రకటనలో భాగమే.

నల్సార్ విద్యార్థుల వ్యతిరేకత మొదటిదేమీ కాదు. అహ్మదాబాద్‌లో జూలై 26న జరిగిన ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ – జిందాల్ గ్లోబల్ లా స్కూల్ కాన్వొకేషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా వెళ్లవలసి ఉండింది. చివరి నిమిషంలో ఆయన ప్రయాణం రద్దయి, ఆ స్థానంలో సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వి వెళ్లారు. రెండు రోజుల తర్వాత న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఎచ్.ఆర్.ఖన్నా స్మారకోపన్యాసంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసి ఉండగా ఆ కార్యక్రమాన్ని ఏ కారణమూ చెప్పకుండానే వాయిదా వేశారు. ఆగస్ట్ 2న ముంబాయిలోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) కాన్వొకేషన్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనవలసి ఉండగా, అనివార్య పరిస్థితుల్లో ఆ కాన్వొకేషన్‌ను రద్దు చేస్తున్నామని టిస్ ప్రకటించింది. అంటే రెండు వారాలలో ప్రధాన న్యాయమూర్తి నాలుగు తిరస్కారాలను ఎదుర్కోవలసి వచ్చిందన్నమాట. అన్ని రాజ్యాంగ వ్యవస్థల తటస్థతను, ప్రతిష్ఠను, గౌరవాన్ని కొల్లగొట్టి, వాటిని ధ్వంసం చేసి సమాజాన్ని విచ్ఛిన్నం చేయదలచిన సంఘ్ పరివార్ పాలనలో అత్యంత సహజమైన పరిణామాల్లో ఒకటి నల్సార్ విద్యార్థుల తిరస్కారం. అది ఎవరి పట్లనో అగౌరవం కాదు. విలువలు దిగజారుతున్న వ్యవస్థలో తప్పనిసరిగా పాటించవలసిన నిష్కర్ష. ❑

**(ప్రజాతంత్ర సౌజన్యంతో)**

## దిమాగీ నక్సల్స్‌లోకి వారు వస్తే విషమం!

**(7వ పేజీ తరువాయి)** ఇజ్రాయెల్‌లో పరిణామాలు ఏమీ భిన్నంగా లేవు. ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలను ప్రశ్నించే వారందరినీ జాతి విద్రోహులుగా ముద్ర వేయటం నెతన్యాహు పాలనలో బాగా ఎక్కువైంది. పాలస్తీనా సమస్యపై మానవత్వ ధోరణితో మాట్లాడే అవకాశం క్రమేపీ అక్కడ సన్నగిల్లిపోతోంది. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు అధికారాలను సైతం తగ్గించివేస్తున్నారు. ఇజ్రాయెల్‌లో 20 శాతంగా ఉన్న అరబ్బుల స్థితిగతులపై నిష్పక్షపాతంగా చర్చలు జరిగే పరిస్థితి లేదు. వాళ్లకు ఉండాల్సిన సమాన హక్కుల గురించి ఎక్కడా చర్చలు జరగవు. ఇక పాలస్తీనాను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయటమే సమస్యకు పరిష్కారం అనే ధోరణిలో మేధావులు ఎవరు మాట్లాడినా హేళనలనూ, తిట్లనూ భరించాల్సిందే.

దిమాగీ నక్సల్స్ అంటే ఫలానా వాళ్లు మాత్రమేనని మంత్రి రిజిజు వివరణ ఇచ్చినా వివాదం తొలగిపోవటం లేదు. ప్రజాస్వామ్యాన్ని ఒక విధానంగా అంగీకరించి, సామాజిక–ఆర్థిక న్యాయాన్ని కోరే వారందరినీ రాడికల్, అల్ట్రాలెఫ్ట్ పరిధిలోకి తీసుకువచ్చి.. అమెరికా, ఇటలీ, ఇజ్రాయెల్‌లో లాగా విమర్శలు, ఆరోపణలు ఎక్కుపెడితే ఇక్కడి పరిస్థితి మరింత అధ్వానంగా మారుతుంది. ప్రజాస్వామ్య తిరోగమనానికే అది దారితీస్తుంది. విదేశాంగ విధాన అవసరాల కోసం అమెరికా, ఇజ్రాయెల్, ఇటలీతో సన్నిహితంగా మెలగొచ్చు. కానీ అంతర్గత విధానాల్లో దూకుడుగా సమాంతర ప్రయాణం మొదలుపెడితే అవాంఛనీయ వైపరీత్యాలకే దోహదం చేస్తుంది. ఇప్పటికే ఆ పోకడలు కొన్ని రంగాల్లో ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. అసమ్మతికి చోటు ఇవ్వటం అనేది భారత సంస్కృతీ పరంపరలో చాలా కీలకం. అనేక భాషలకు, సంస్కృతులకు నిలయమైన భారత్‌ది ఎప్పుడూ విలక్షణమైన ప్రయాణమే. దాన్ని వదులుకుంటే పైమెరుగులతో కూడిన ప్రజాస్వామ్యం మిగలొచ్చు. కానీ సారంలో, స్ఫూర్తిలో మాత్రం అది సన్నగిల్లి పోతుంది. అప్పుడు ప్రజాస్వామ్యానికే దిమాగ్ పోతుంది! ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

## ప్రశ్నించడం దేశద్రోహం కాదు..

(12వ పేజీ తరువాయి)

సమస్యలపై మనం గళమెత్తితే, ద్వేషపూరిత రాజకీయాలను తుత్తునియలు చేసే ఉమ్మడి పోరాట వేదిక దానంతట అదే ఏర్పడుతుంది.

**ప్రశ్న: విద్య, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సంస్థలు... ప్రతీ వ్యవస్థనూ నడిపించేది రాజకీయ వ్యవస్థే. అత్యంత శక్తిమంతమైన ఈ రాజకీయ వ్యవస్థను ఎలా సవాలు చేయాలనుకుంటున్నారు? మీ వ్యూహం ఏమిటి? ఎలాంటి భవిష్యత్ భారతదేశాన్ని మీరు కోరుకుంటున్నారు?**

నేహా: ప్రతీ ఒక్కరికీ జీవించే హక్కు, ఆత్మగౌరవం, సమాన విద్యావకాశాలు ఉండే భారతాన్ని మేము కోరుకుంటున్నాం. కేవలం పొట్టకూటి కోసం బతకడం కాదు... సృజనాత్మకతతో, సంతోషంతో బతికే స్వేచ్ఛ కావాలి. పేద–ధనిక, కుల–లింగ భేదాల మధ్య ఉన్న అంతరాలను తుడిచిపెట్టినప్పుడే ఇది సాధ్యమవుతుంది. సౌదార్ద్రత, సమానత్వంతో ప్రజలందరినీ ఏకం చేయడమే మా వ్యూహం. ఆ రోజున మన పూర్వీకులు కలలుకన్న నిజమైన స్వేచ్ఛా భారతాన్ని మనం నిర్మించుకోగలుగుతాం. ❑

# 80 ఏళ్ల స్వాతంత్ర్యం - సమకాలీన భారతం




- కె.ఎస్.లక్ష్మణరావు

**భారతదేశం స్వాతంత్ర్యం పొంది 79 ఏళ్లు పూర్తి చేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న తరుణంలో సమకాలీన భారతదేశంలో జాతీయోద్యమ స్ఫూర్తిని మరోసారి భారత ప్రజలు ప్రదర్శించవలసిన అవసరం ఏర్పడింది. 1947 ఆగస్టు 15న రాజకీయ స్వాతంత్ర్యం పొందినప్పటికీ, ఆర్థిక- సామాజిక స్వాతంత్ర్యాలు సాధించవలసిన లక్ష్యాలుగా ఉన్నాయి. పాలకుల 'వికసిత్ భారత్ - 2047' వంటి ప్రచారాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. వరుసగా మూడోసారి 2024 లో ఏర్పడిన నరేంద్రమోడీ ప్రభుత్వం రాజ్యాంగ లక్ష్యాలను, ఆశయాలను దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నది. ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన జెన్ జీ ఉద్యమం యువతలో ఏర్పడిన నిరాశ, అసంతృప్తులను తెలుపుతున్నది.**

### రాజ్యాంగ లక్ష్యాలపైనే దాడి

భారత దేశంలోగల భిన్నత్వం, బహుళత్వాలకు అనుగుణంగా భారత రాజ్యాంగం రూపొందింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వాన గల ముసాయిదా కమిటీ భారత రాజ్యాంగాన్ని సమున్నతంగా తీర్చిదిద్దింది. రాజ్యాంగ పీఠికలో రాజ్యాంగ లక్ష్యాలను వివరించారు. సమాఖ్య విధానం, లౌకికవాదం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, న్యాయశాఖ స్వతంత్రత మొదలైన లక్ష్యాలతో రాజ్యాంగం కొనసాగాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. నరేంద్రమోడీ ప్రభుత్వం రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థను దెబ్బ తీస్తున్నది. మూడు రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల నల్లచట్టాలను తేవడం ఫెడరల్ వ్యవస్థకు పూర్తి విరుద్ధం. భారత రైతాంగం చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం ద్వారా ఈ చట్టాలను తిప్పికొట్టింది. ప్రజలను మతతత్వ, హిందుత్వ విధానాలతో చీల్చే విధంగా విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. మైనార్టీలపై భిన్నమైన పద్ధతులలో దాడులు జరుగుతున్నాయి. 'సర్' వంటి పద్ధతుల ద్వారా మైనార్టీలు, దళితులు, వలస కార్మికులు మొదలైన వారి ఓట్లు వివిధ రాష్ట్రాల్లో కోట్ల సంఖ్యలో తొలగిస్తున్నారు.




భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ, 'ఉపా' వంటి చట్టాల ద్వారా వేలాది మందిని విచారణ లేకుండా జైళ్లలో ఉంచుతున్నారు. 'న్యూస్ క్లిక్' ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను అన్యాయంగా అరెస్టు చేసి ఆరు నెలలకు పైగా జైలులో ఉంచారు. ఆయనపై పెట్టిన కేసులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. పరిశోధక విద్యార్థి ఉమర్ ఖలీద్‌ను ఆరేళ్ల నుండి జైలులో ఉంచారు. ఆయనకు బెయిలు ఇవ్వకపోగా, ఇంతవరకు కేసు విచారణకు కూడా రాలేదు. దేశవ్యాపితంగా ఒక 'అప్రకటిత ఎమర్జెన్సీ' కొనసాగుతున్నదని కొందరు రాజకీయ, రాజ్యాంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

### ఆర్థిక అసమానతలు

1991లో నయా ఉదారవాద విధనాలు ప్రారంభించిన తరువాత ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. ప్రముఖ ఆర్థికవేత్త థామస్ పికెట్టి రూపొందించిన నివేదికలో ప్రపంచ ఆర్థిక అసమానతలతోపాటు భారతదేశ ఆర్థిక అసమానతలను వివరించాడు. భారతదేశంలో 11 మంది సంపన్నుల చేతిలో 45 శాతం సంపద ఉన్నదని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొన్నది. పెరుగుతున్న అసమానతలు దేశ ప్రజల ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తున్నాయి. 2014 నుండి మోడీ

ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు కార్పొరేట్ ప్రయోజనాలకు ఉపయోగపడుతూ గౌతమ్ అదానీ, అంబానీ వంటి వారు ఆస్తులు పెంచుకోవడానికి దోహదపడ్డాయి. ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, సోలార్ ప్రాజెక్టులు విద్యుత్ మొదలైన వాటిని కార్పొరేట్ సంస్థలకు ప్రత్యేకించి అదానీకి అప్పగిస్తున్నారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం, ఎల్ఐసి వంటి సంస్థలను ప్రైవేటు వారికి అప్పగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆర్థిక అసమానతలు నిరుద్యోగానికి, ద్రవ్యోల్బణానికి దారితీసి ప్రజలలో సామాజికఅశాంతికి కారణమౌతున్నాయి.

### మానవాభివృద్ధిలో వెనుకబాటు

ప్రపంచ మానవాభివృద్ధి నివేదిక ప్రకారం భారతదేశం మానవాభివృద్ధిలో 175 దేశాలలో 133వ స్థానంలో కొనసాగుత్నుది. ఆర్థిక సంస్కరణల తరువాత ఆరోగ్యం, విద్య మొదలగు రంగాలు కార్పొరేటీకరణ చెందాయి. విద్యారంగంలో 50 శాతం ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లో కొనసాగుతున్నది. జాతీయ విద్యా విధానం -2020 విద్యారంగంపై కేంద్ర ఆధిపత్యానికి దారితీసి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్‌టిఎ) వంటి సంస్థలు ఏర్పడ్డాయి. కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ రావడానికి ప్రధాన కారణం విద్యా వ్యవస్థలో తెచ్చిన కేంద్రీకరణ, వ్యాపారీకరణ విధానాలే. వైద్య-ఆరోగ్య రంగాలు పేద ప్రజలకు, గిరిజనులకు ఆరోగ్య సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెందాయి. దేశంలో డ్రాప్ అవుట్ రేటు గ్రామీణ ప్రాంతాలలో 20 శాతం వరకు ఉన్నది. డ్రాప్ అవుట్ అవుతున్న వారిలో ఎక్కువ మంది ఆడపిల్లలే. భారతీయ మహిళలలో పౌష్టికాహార కొరత వలన 46 శాతం మంది రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నారు. థైరాయిడ్, బ్రెస్ట్ క్యాన్సర్, మెంటల్ స్ట్రెస్ వంటి ఆరోగ్య సమస్యలు మహిళలల్లో పెరుగుతున్నాయి. మొత్తం శ్రామికులలో 37 శాతం మహిళలు, వ్యవసాయ పనులలో 64 శాతం మహిళలు పనిచేస్తున్నా తగిన విధంగా వేతనాలు పొందడం లేదు. నూతన రంగమైన 'గిగ్' వర్కర్ల జీతభత్యాలు సంతృప్తికరంగా లేవు.

### వ్యసాయరంగ సంక్షోభం

గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటుండగా, లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలని ఎప్పటి నుండో భారత రైతాంగం కోరుతున్నది. గిట్టుబాటు ధరలు, పంటల బీమా, మార్కెటింగ్ మొదలైన వాటిలో రైతాంగం పూర్తిగా అన్యాయానికి గురైంది. వ్యవసాయానికి అవసరమైన సమగ్ర ఉత్పత్తి ఖర్చులను (సి2) లెక్కించి, దానికి యాభై శాతం అదనంగా రైతుకు మిగిలేలా వుండాలని (సి2 + 50) స్వామినాథన్ కమిషన్ పేర్కొంది. అది ఇంత వరకూ అమలు జరగలేదు. నరేంద్రమోడీ ప్రభుత్వం నూతనంగా అనేక రైతు వ్యతిరేక చట్టాలను (2025 మార్కెట్ నియంత్రణ చట్టం, సహకార చట్టం, విద్యుత్ సవరణ చట్టం, విత్తన చట్టం, ప్రకృతి వైపరీత్యాల చట్టం) తెస్తున్నది. ఇవి రైతులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తాయి. అమెరికా, బ్రిటన్‌లతో కుదుర్చుకున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ల వల్ల భారత వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోబోతున్నది. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవించే హక్కును హరిస్తూ 2005 మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో విబి గ్రామ్‌జీ చట్టం 2025 తేవడం గ్రామీణ ఉపాధిని నాశనం చేయడమే. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరిస్తాయి.

### సామాజిక తరగతులు

భారత రాజ్యాంగం సామాజిక న్యాయం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. రాజ్యాంగం ద్వారా దళితులు, గిరిజనులకు, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది. సామాజిక తరగతులు, మహిళల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు చేపట్టాలని ఆదేశించింది. కానీ 80 ఏళ్ల తరువాత కూడా ఆశించిన అభివృద్ధి జరగలేదు. దళితులు, మైనార్టీలపై దాడులు కొనసాగుతున్నాయి. వారి కోసం చేసిన అనేక చట్టాలు సక్రమంగా అమలు జరగడం లేదు. జాతీయ అటవీహక్కులు వంటి చట్టాలు సక్రమంగా అమలు జరగడం లేదు. మహిళల ప్రాతినిధ్యం గత 18 లోక్‌సభల్లో 15 శాతం మించలేదు. వివిధ రాష్ట్రాల శాసన సభల్లో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. అనేక ఉద్యమాల ఫలితంగా 2023లో 106వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు 1/3వంతు రిజర్వేషన్లు చట్టం ఆమోదించినప్పటికీ 2024 ఎన్నికలలో అమలు జరపలేదు. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టడానికి ప్రయత్నిస్తున్నది.

పై అంశాలను పరిశీలిస్తే దేశ ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్య ప్రాముఖ్యత అర్థం అవుతుంది. వందేళ్లపాటు జరిగిన జాతీయోద్యమంలో కోట్లాది మంది ప్రజలు పాల్గొన్నారు. బలిదానాలు, ప్రాణత్యాగాలు చేస్తూ, ఉరితీతలను లెక్కచేయకుండా ఉద్యమాల్లో పాల్గొన్నారు. లక్షలాదిమంది జైళ్లకు వెళ్లారు. ఈ మహోద్యమంలో జాతీయ కాంగ్రెస్‌తో పాటు విప్లవకారులు, గిరిజన నాయకులు, రైతాంగ ఉద్యమ నేతలు మొదలైన వారంతా భాగస్వాములయ్యారు. ఆర్థిక, సామాజిక, స్వాతంత్ర్య సాధనకు, మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి. ❑

# కార్పొరేట్ అనుకూల చట్టాలు కె.జి.బేసిన్ గ్యాస్, ఆయిల్ దోపిడీ

-డా. కొల్లా రాజమోహన్





**భారతదేశానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సహజ వనరులలో ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, ముఖ్యంగా కృష్ణా-గోదావరి (కె.జి) బేసిన్ అత్యంత కీలకమైనవి. దేశ ఇంధన భద్రతలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. అయితే, ఇటీవల కాలంలో ఈ ప్రజా సంపదను ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలకు అడ్డగోలుగా ధారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రజా ప్రయోజనాలను, పర్యావరణాన్ని విస్మరించి కేవలం రిలయన్స్, వేదాంత వంటి ప్రైవేటు సంస్థల లాభార్జనే ధ్యేయంగా చట్టాలను సవరించడం దేశీయ ఆర్థిక సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టుగా మారింది.**

### ఆయిల్ ఫీల్డ్స్ సవరణ బిల్లు 2024: కార్పొరేట్ అనుకూల చట్టం

దేశీయ చమురు, గ్యాస్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ది ఆయిల్ ఫీల్డ్స్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) సవరణ బిల్లు, 2024'ను తీసుకువచ్చింది. ఈ బిల్లు 2024 డిసెంబరు 3న రాజ్యసభలోనూ, 2025 మార్చి 12న లోక్‌సభలోనూ ఆమోదించబడింది. ఈ చట్టం పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు సాగిలపడే విధంగా రూపొందించబడింది.

### క్రిమినల్ శిక్షల రద్దు - నేరరహితం చేయడం

1948 నాటి పాత చట్టం ప్రకారం, పర్యావరణానికి ముప్పు తెచ్చినా లేదా నిబంధనలు ఉల్లంఘించినా నిందితులకు 6 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే నిబంధనలు ఉండేవి. తప్పు చేసిన వారు సమాజంలో తల దించుకునేలా, భయం కలిగి ఉండేలా ఆ శిక్షలు ఉండేవి. కానీ, ప్రస్తుత సవరణ బిల్లు వ్యాపార వాతావరణాన్ని సులభతరం చేయడం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అనే పేరుతో జైలు శిక్షను పూర్తిగా రద్దు చేసింది. దీని స్థానంలో కేవలం రూ.25 లక్షల జరిమానాను ప్రవేశపెట్టింది. వందల, వేల కోట్లు అక్రమంగా సంపాదించే కార్పొరేట్ శక్తులకు రూ.25 లక్షల జరిమానా అత్యంత స్వల్పమైన మొత్తం. డబ్బుతో శిక్ష నుంచి బైట పడేందుకు, ఒక్కరోజు కూడా జైలుకు వెళ్లకుండా తప్పించుకునేందుకు ప్రభుత్వమే ఈ చట్టం ద్వారా దారి చూపిస్తోంది.

### ప్రభుత్వ మౌలిక సదుపాయాల లూటీ

ఈ బిల్లు ప్రకారం, మన దేశ అగ్రగామి ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఓ.ఎన్.జి.సి దశాబ్దాలుగా ఎంతో కష్టపడి, భారీ పెట్టుబడులతో ఏర్పాటు చేసుకున్న రిగ్గులు, పైప్‌లైన్లు, ఉత్పత్తి, ప్రాసెసింగ్ సౌకర్యాలను ప్రైవేటు ఆపరేటర్లు చట్టబద్ధంగా ఉచితంగా వాడుకోవచ్చు. ఇది ప్రైవేట్ సంస్థల పెట్టుబడి, నిర్వహణ ఖర్చులను భారీగా తగ్గిస్తుంది. అంటే, కష్టమంతా ప్రభుత్వ సంస్థది, లాభమంతా ప్రైవేట్ కంపెనీలది అన్నట్లుగా ఈ విధానం ఉంది.

## కృష్ణా జిల్లా కాజ బ్లాక్ వ్యవహారం - 'వేదాంత'కు అయాచిత లబ్ధి

కృష్ణా జిల్లాలోని పామర్రు, కాజ బ్లాక్ పరిధిలో ఒ.ఎన్.జి.సి సంస్థ తన సొంత ఖర్చుతో విస్తృతంగా అన్వేషణ జరిపి, భారీగా హైడ్రోకార్బన్ నిల్వలను గుర్తించింది. ఆన్-షోర్‌లో 115 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ విలువైన బ్లాక్‌ను వెలికితీసేందుకు, ప్రభుత్వం ఒఎన్‌జిసిని కాదని వేదాంత కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది.

రూ.650 కోట్ల పెట్టుబడితో 30,000 బారళ్ల క్రూడ్ ఆయిల్, 30 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తామని 'వేదాంత' చెబుతోంది. ఒకవేళ అక్కడ చమురు దొరకకపోతే ఆ నష్టాన్ని భరించేది ఒఎన్‌జిసి. కానీ నిక్షేపాలు దొరికిన తర్వాత అయాచితంగా లాభాలు పొందేది మాత్రం 'వేదాంత'. దీనినే లాభాలు ప్రైవేటుకు, నష్టాలు జాతీయీకరణకు అంటారు.

## స్థానిక ప్రజలకు, పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

ఈ సవరణ బిల్లు, ప్రైవేట్ సంస్థల ప్రవేశం వల్ల ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి తీవ్రమైన నష్టం వాటిల్లనుంది. పర్యావరణ క్షీణత, ఫ్రాకింగ్ బిల్లు ద్వారా సంప్రదాయ గ్యాస్, ఆయిల్‌తో పాటు 'షేల్ గ్యాస్' వెలికితీతను సులభతరం చేశారు. షేల్ గ్యాస్ తీయడానికి వాడే 'ఫ్రాకింగ్' పద్ధతి వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయి, అంతేకాక భూమి కంపించే ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ఒకే అనుమతి విధానంతో పర్యావరణ అనుమతులు వేగంగా ఇవ్వడం వల్ల పర్యావరణ రక్షణకు ఎటువంటి గ్యారంటీ లేకుండా పోయింది.

## జీవనోపాధి దెబ్బతినడం

కాజ, కెజి బేసిన్ లాంటి తీర ప్రాంతాలలో పైప్‌లైన్లు వేయడం, రిగ్గులు పెట్టడం వల్ల స్థానిక మత్స్యకారుల వేట దెబ్బతింటుంది. అలాగే బందరు కాలువ ద్వారా పొలాలకు నీరు పెట్టుకుంటున్న వ్యవసాయ భూములు కలుషితమై రైతులు తీవ్రంగా నష్టపోతారు.

## 'వేదాంత' కంపెనీ వివాదాల చరిత్ర

'వేదాంత'సంస్థకు పర్యావరణ విధ్వంసం చేసిన చరిత్ర ఉంది. తమిళనాడు తూత్తుకుడిలోని స్టెరిలైట్ కాపర్ ప్లాంట్ కాలుష్యానికి వ్యతిరేకంగా 2018లో స్థానికులు నిరసన చేసినప్పుడు జరిగిన పోలీసు కాల్పుల్లో 13 మంది మరణించారు. ఒడిశాలోని నియంగిరి కొండల్లో బాక్సైట్ తవ్వకాల కోసం గిరిజనుల హక్కులను కాలరాచినందుకు 2013లో సుప్రీం కోర్ట్ అక్కడ మైనింగ్‌ను నిషేధించింది. ఒడిశా ఝూర్సుగూడ ప్లాంట్ విషపూరిత వ్యర్థాలను పొలాల్లోకి వదలడం, సెబీ చేత షేర్ల అవకతవకలపై నిషేధానికి గురికావడం, జాంబియా దేశంలో పన్ను ఎగవేత, పర్యావరణ నష్టం కారణంగా గనుల జప్తును ఎదుర్కోవడం వంటి ఎన్నో వివాదాలు 'వేదాంత' చుట్టూ ఉన్నాయి. అటువంటి సంస్థకు మన బందరు కాలువ, కాజ ప్రాంత పర్యావరణాన్ని అప్పగించడం అత్యంత ప్రమాదకరం.

## నార్వే దేశ నమూనా - మనకెందుకు సాధ్యం కాదు?

ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాలలో ఒకటైన నార్వేలో సహజ వనరులు ప్రజల ఉమ్మడి ఆస్తిగా ఉన్నాయి. అక్కడ చమురు, గ్యాస్ ద్వారా వచ్చే లాభాలను ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా ప్రభుత్వ ఆధీనంలోని సార్వభౌమ నిధిలో జమ చేసి, ప్రజల ఉచిత విద్య, వైద్యం, సామాజిక భద్రతకు వాడుతున్నారు.

కానీ మన దేశంలో రిలయన్స్ వంటి కంపెనీలు కెజి బేసిన్ లోని వనరులను వెలికితీసి ప్రపంచవ్యాప్తంగా అమ్ముకుంటున్నాయి. రష్యా నుండి చౌకగా చమురు దిగుమతి చేసుకుని యూరప్‌కు ఎక్కువ రేట్లకు అమ్ముకుంటున్న రిలయన్స్, ఆంధ్రప్రదేశ్ ప్రజల అవసరాలకు మాత్రం గ్యాస్ కేటాయించడం లేదు. డబ్బులు తీసుకుని కూడా ఇవ్వకుండా, ఇక్కడి గ్యాస్‌ను 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు తరలిస్తున్నారు.

## న్యాయవ్యవస్థ నిర్వీర్యం - వివాదాల పరిష్కారం

ఈ కొత్త బిల్లు ప్రకారం వివాదాల పరిష్కారానికి కోర్టులకు ఎటువంటి అధికారమూ లేదు. కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ లేదా అంతకంటే ఎక్కువ హోదా ఉన్న ఒక అధికారి మాత్రమే వివాదాలను పరిష్కరిస్తారు. అవినీతి వ్యవస్థలో ఇటువంటి అధికారులు ప్రజానుకూలంగా తీర్పులు ఇస్తారని భావించలేము. గతంలో ఒ.ఎన్.జి.సి వెలికితీసిన గ్యాస్‌ను రిలయన్స్ దొంగతనంగా అమ్ముకున్న వ్యవహారంలో ప్రభుత్వం, కోర్టులు ఏమీ చేయలేక చివరకు రాజీ పడమని సలహా ఇవ్వడమే దీనికి నిదర్శనం. సహజ వనరులు ప్రజల సొత్తు. ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలు ఎప్పుడైనా ప్రజల ప్రయోజనాలకు లోబడి ఉన్నప్పుడే సమాజం పురోగమిస్తుంది. విలువైన ప్రజల సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం వల్ల ప్రజలు శాశ్వతంగా పేదరికంలోనే ఉండిపోతారు. పాలకవర్గ పార్టీలు ఈ అన్యాయాన్ని విమర్శించకపోవడం శోచనీయం. మన ప్రయోజనాలను, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా చైతన్యవంతులై, ఇందుకోసం కృషి చేసే వేదికల ద్వారా ఐక్యంగా, పోరాడవలసిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది. ❑

# జాతీయ వైజ్ఞానిక స్పృహదినం : 20 ఆగస్టు



- ప్రొ.దేవరాజ మహారాజు

**చుట్టూ ఉన్న కోటానుకోట్ల జీవరాశుల మధ్య తనకు ఈ జీవితం ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఆదిమానవుడికి ఒక పట్టాన అంతుపట్టలేదు. మొదట అదొక నిగూఢమైన రహస్యం అనుకున్నాడు. తర్వాత కాలంలో తన ఊహకు అందని ఏదో అమోఘమైన శక్తి ఈ విశ్వాన్నంతా ఒకేసారి, ఉన్న ఫళంగా సృష్టించి ఉంటుందని భావించాడు. అదే ఇంత అద్భుతంగా తయారైందని విశ్వసించాడు. అందుకే, ప్రతి మతంలోనూ 'సృష్టి' ప్రస్తావన కనిపిస్తుంది. దేవుడి పేర్లూ మతాలూ వేరువేరైనా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు అందరూ నమ్మింది ఒకే విషయం! "దేవుడే ఈ విశాల విశ్వానికి సృష్టికర్త"-అని!! ఆ భావం కొన్ని వేల సంవత్సరాలపాటు వర్ధిల్లింది.**

సృష్టికి సంబంధించిన విషయంలో మతాలు చెప్పిందే ఆయా సమాజాల్లో 'సత్యం'గా చలామణీ అయ్యింది. మత గ్రంథాలు ప్రామాణికమయ్యాయి. అందువల్ల ఆ విశ్వాసాన్ని కాదని, ఆలోచించే వారే లేక పోయారు. ఎవరైనా వ్యతిరేకంగా నోరెత్తితే ఏకంగా మరణ శిక్షలే ఉండేవి. అందువల్ల శాస్త్రీయ దృక్పథం - అనేది ఊపిరి పోసుకోవడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది. వివేకానికి మూర్ఖత్వం పెద్ద ప్రతిబంధకంగా నిలిచింది. మరోవైపు మత పెద్దల, మత న్యాయస్థానాల తీర్పులు జనాన్ని భయకంపితుల్ని చేశాయి. తెల్లవాడు నల్లవాణ్ణి, ఉన్నవాడు లేని వాణ్ణి, అగ్రవర్ణం వాడు నిమ్న వర్గం వాడిని, పురుషుడు స్త్రీని బానిసలుగా చూసే హీన సంస్కృతి రాజ్యమేలింది. పైస్థాయి వారు కింది స్థాయి వారిని ఎంతగా ప్రభావితం చేశారంటే "తాము పాపులం గనక, ఆ దేవుడు ఆ ప్రభువు తమను బానిసలుగా పుట్టించాడని, అంతా ఆ దేవుని ఇష్టప్రకారమే జరుగుతూ ఉందని, యజమానులకు సేవలు చేస్తూ తరించడమే తాము చేయాల్సి ఉందని అమాయకంగా నమ్ముతూ మోసపోయారు. అలాంటి పరిస్థితుల్లో మరో రకమైన ఆలోచన రావడానికే వీలులేకపోయింది. బలప్రయోగాలు ఎల్లకాలమూ రాజ్యమేల లేవు కదా? స్థల కాలాల్ని, అందులోని పరిస్థితుల్ని జాగ్రత్తగా గమనించిన ప్రజలు ఆలస్యంగానైనా సరే, వివేకం పెంచుకుంటారు కదా?

పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాలలో కోపర్నికస్, గెలీలియో, బ్రూనో, న్యూటన్, లిల్, డార్విన్, హట్టన్ వంటి వైజ్ఞానికులు విశ్వ నిర్మాణం, జీవ పరిణామం విషయాలలో కొత్త సిద్ధాంతాల ను ముందుకు తెచ్చారు. మత విశ్వాసాలకు బలమైన సవాళ్లు విసిరారు. ఎదుర్కొవడానికి స్థిరంగా నిలబడ్డారు. ఈ విశ్వాన్ని నడిపిస్తున్న సూత్రాలేమిటో నిశితంగా పరిశీలిస్తే, మనకు ఈ విశ్వంలోనే కనిపిస్తాయని నిరూపిస్తూ వచ్చారు. దీనితో జనంలో రెండు ప్రశ్నలు తలెత్తాయి. ఒకటి మతం చెప్పింది విశ్వసించడమా? రెండు సైన్సు చూపిన మార్గాన్ని అనుసరించడమా? ఇవి రెండూ ప్రజల చర్చకు దారితీశాయి. ఆనాడే కాదు, శతాబ్దాలు దాటొచ్చినా, ఈ చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది సంస్కృతి, సంప్రదాయం, ఆచారం పేర్లతో ప్రపంచంలో ఎక్కువ శాతం మంది మూఢ నమ్మకాల్లో మగ్గిపోతూ ఉన్నారు. అదే సమయంలో శాస్త్ర సాంకేతిక ఫలితాలను పూర్తిగా అనుభవిస్తున్నారు. "వైజ్ఞానిక రంగం అందించిన అన్ని వసతుల్ని ఒకవైపు అనుభవిస్తూనే, ఇంకా ఎందుకు మూడు వేలనాటి పనికిరాని భావజాలాల్ని పట్టుకుని వేళ్లాడుతున్నారూ?" అన్నది నేటి సైన్సు కార్యకర్తల ప్రశ్న. దేన్ని అనుభవిస్తున్నారో దానిపట్ల నిజాయితీగా ఉండనవసరం లేదా? నిజాయితీ లేక అబద్ధపు బతుకులు బతికేవారిని ఏమనాలి?

క్రీ.శ.1700 నుంచి వైజ్ఞానికులు భూమి పొరల్లో కొన్ని కొన్ని చోట్ల శిలాజాలను గుర్తిస్తూ వచ్చారు. క్రమంగా ఏ శిలాజం ఏ జంతువుదో గుర్తించగలిగే నైపుణ్యాన్ని పెంచుకున్నారు. అందులో కొన్ని రకాల వృక్షాలు, జంతువులు తర్వాతి కాలాలలో జీవించి లేవని గుర్తించారు. ఈ విషయంలో పరిశోధనలింకా జరుగుతూనే ఉన్నాయి. జార్జి కువిర్(1769-1832) అనే ఫ్రెంచ్ ప్రకృతి పరిశోధకుడు గతంలో జీవించిన కొన్ని ప్రాణులు అంతరించి పోయాయని ప్రతిపాదించాడు. అందువల్ల ఈ "అంతరించిపోవడ"మనే విషయం వెలుగులోకి వచ్చింది. అంతేకాదు, అదొక ముఖ్యమైన అధ్యయన విషయమైంది. జేమ్స్ హట్టన్ స్కాట్లాండ్ భూగర్భ శాస్త్రవేత్త 1788లో భూ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. భూమి పొరలు పొరలుగా ఉందని దాని సారాంశం! అది నిజమే అని నిర్ధారణ అయ్యింది. ఎందుకంటే ఒక్కో పొరలో వృక్ష జంతు శిలాజాలు లభ్యమవుతూ ఉండడం వల్ల అవి ఏయే కాలాలలో జీవించి ఉండెనో లెక్కలు కట్టడానికి

వీలయ్యింది.

మత గ్రంథాల్లో చెప్పినట్టుగా ఒక్కసారిగా మహా ప్రళయాలు రావడం లేదని, అవి క్రమేపీ కొన్ని వందల, వేల యేళ్లపాటు జరుగుతూనే ఉంటాయని బ్రిటిష్ భూ భౌతిక శాస్త్రవేత్త చార్లెస్ లిల్(1797-1875) ఉదాహరణలతో సహా ప్రతిపాదించాడు. చార్లెస్ లిల్, జేమ్స్ హట్టన్ భూ సిద్ధాంతానికి ప్రాచుర్యం తెచ్చినవాడు. ఈ ఇద్దరి పరిశోధనా ఫలితాలు చార్లెస్ డార్విన్‌కు ఉపయోగపడ్డాయి. ఇవేకాక, ఇంకా ఇతర సిద్ధాంతాలెన్నో డార్విన్‌కు ఉపయోగపడ్డాయి. డార్విన్‌కు సమాంతరంగా ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ కూడా జీవ పరిణామ క్రమం పై పరిశోధనలు చేశాడు. విలియం స్మిత్ - ఇంగ్లీష్ జియాలజిస్ట్ తొలిసారి 'ఇంగ్లాండ్ - వేల్స్ జియోలాజికల్ మ్యాప్స్'ను ప్రకటించాడు.

దేవుడు చేసిన ఈ సృష్టిలో ఎలాంటి మార్పులు ఉండవని ప్రజలు నమ్మేవారు. యుగాంతంలో సర్వం నాశనమైపోయి, మళ్ళీ కొత్త జీవా లు పుడతాయని విశ్వసించేవాళ్లు. ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు ఏవీ లేకపోవడం వల్ల, ఇతర ప్రాంతాలు తిరిగి చూసే వీలుండేది కాదు. తమ చుట్టుపక్కల ఉన్న వృక్ష, జంతుజాతుల్ని మాత్రమే చూస్తూ 'జీవాల్లో మార్పేమీ ఉండదు' అని అనుకునేవారు. పారిశ్రామిక విప్లవం వల్ల రవాణా సౌకర్యాలు పెరిగాయి. రవాణా సౌకర్యంతోపాటు వ్యాపారాలు పెరిగాయి. వ్యాపారాలతోపాటు ప్రయాణాలు పెరిగాయి. ప్రయాణాలు పెరగడం వల్ల మనుషులకు వేర్వేరు ప్రాంతాల్లోని జీవవైవిధ్యాన్ని గమనించటానికి వీలయ్యింది. క్రమంగా కొత్త విషయాలు గ్రహించటానికి, కొత్తగా ఆలోచించడానికి అవకాశం వచ్చింది.


ప్రపంచవ్యాప్తంగా మనుషులు తమ చుట్టూ ఉన్న పరిసరాల్ని, పరిస్థితుల్ని గమనిస్తూ ప్రకృతి నుండి కొత్త విషయాలు నేర్చుకుంటూ వచ్చారు. ఒక్కొక్క ఆవిష్కరణతో మానవ జీవితాన్ని సుఖమయం చేసుకుంటూ వస్తున్నారు. వ్యవసాయ, ఆహార, ఆహార్య, రవాణా, వైద్య, విద్య, సంక్షేమ - వంటి అన్ని రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చుకున్నారు. పూర్తిగా జీవన శైలినే మార్చుకున్నారు. "మనుషులం గనక, మనుషుల్ని ప్రేమించాలి. వర్ణ, వర్గ, లింగ ప్రాంతీయ భేదాలు లేకుండా, మానవ జాతి అంతా ఒక్కటేనని నిలదించాలి" - అని అంటున్నారు. కాని కొందరు స్వార్థ పరులు, కుట్రదారులు మనిషిని మనిషితో కలపకుండా విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆ విషయంలో అందరూ అప్రమత్తమై ఉండాలి. మనిషిని కాదు - మనిషిలోని స్వార్థాన్ని చంపితే, నిస్వార్థం పెల్లుబికి వస్తుంది.

ఎక్కువ మంది నమ్మే అబద్ధం ఏనాటికీ సత్యంగా మారిపోదు. వారు అలా అబద్ధాన్ని నమ్మడానికి వారి అవగాహనా రాహిత్యమో, అమాయకత్వమో, అవివేకమో, లేక మూర్ఖత్వమో కావచ్చు. తక్కువమంది నమ్మే సత్యం ఎప్పటికీ అబద్ధం కాదు. హేతు బద్ధంగా తనని తాను నిరూపించుకుని, తగిన కారణాల్ని చూపించినప్పుడే, విశ్లేషణలకు, వివరణలకూ అవకాశమిచ్చి నప్పుడే అది వాస్తవమౌతుంది. సత్య నిరూపణ అంటే ఇదే. ఛాందసులు నమ్మే సత్యశోధన, సత్యాన్వేషణ వేరు. వాటితో దీనికి సంబంధం లేదు. ఏ నిరూపణలకూ నిలబడకుండా తమ విశ్వాసాల్ని గుడ్డిగా నమ్మమని బోధించేవి ఏవైనా సరే, అవి అబద్ధాలవుతాయి. సత్యం! వీటిని నమ్మేవారి సంఖ్యతో మనకు పనిలేదు. అబద్ధాలు రాజ్యమేలినా, వాటిలోని డొల్లతనం శతాబ్దాలుగా బయటపడుతూనే ఉందికదా? మనోభావాల్ని అడ్డుపెట్టుకుని, అబద్ధాల్ని సత్యాలుగా ఎల్లకాలం చెలామణీ చేయలేరు. నానాటికి జనంలో వివేకం పెరుగుతున్న దశలో గుడ్డి నమ్మకాల్ని వ్యాపింపజేయాలనుకోవడం బుద్ధి తక్కువ పని.

ఏ కాలంలోనైనా, ఏ సమాజంలోనైనా వైజ్ఞానికులు, హేతు వాదులు కొద్ది మందే ఉన్నారు. ప్రపంచంలో మార్పు వారితోనే సాధ్యమవుతూ వచ్చింది. నిత్య జీవితంలోని అన్ని రంగాల్లో వస్తున్న అన్ని మార్పులకు కారణం వీరే. ఆలోచించకుండా ఒక ప్రవాహంలో కొట్టుకుపోయే జనం కొన్ని మిలియన్ల మంది ఉండొచ్చుగాక, వారితో సమాజంలో ఏమార్పు రాలేదు. ఇక ముందు రాదు. తమ మానసిక బలహీనతలతో, కొన్ని భ్రమలకు లోనై, అదే వాస్తవమనుకుని, దైవశక్తుల్ని, మతాల్ని, సంబంధించిన గ్రంథాల్ని నమ్ముకుంటూ అధిక సంఖ్యాకులు జీవితం వృథా చేసుకుంటూ ఉంటారు. భక్తి అనేది మోసానికి, వ్యాపారానికి, దోపిడీకి పర్యాయపదాలైన తర్వాత కూడా, నిజం గ్రహించలేని అచేతనుల్ని ఏమందాం?

అటు విశ్వరహస్యాల్ని, ఇటు జీవరహస్యాల్ని తెలుసుకుంటూ నిత్య చైతన్యవంతులై ఉంటే 'జ్ఞానసిద్ధి' కలుగుతుంది. ఈ విశ్వంలో ఈ ప్రపంచంలో, ఈ దేశంలో, ఈ సమాజంలో నువ్వేమిటి? నీ స్థానమేమిటి? అనేది తెలుసుకుంటే 'ఆత్మ దర్శనం' కలుగుతుంది. అంతేగాని, ఆత్మ పరమాత్మ అంటూ ముక్కూ కళ్ళూ మూసుకుని బోధించేవారి వల్ల వినేవారి వల్ల ఈ లోకానికి ఎప్పుడూ ఎక్కడా ఏ ఉపయోగమూ కలగలేదు. ఇక ముందు కలగదు. సైన్సుకు అందని 'అతీతమైన శక్తి' ఉందని జనాన్ని ఊదరగొట్టేవారు తాము చేసే పనులన్నింటికీ తమ 'అతీతశక్తి'ని మాత్రమే ఉపయోగించుకుని-జనానికి ఏవైనా మంచి ఫలితాలు చూపగలిగితే అప్పుడు ఆలోచిద్దాం? దీనికి ముఖ్యమైన షరతులు ఏమిటంటే, వారు తమ దైనందిన జీవితంలో సైన్సు విజ్ఞానాన్ని గాని, సైన్సు పరికరాల్ని గాని, సైన్సు ఉత్పత్తులనుగాని ఏ మాత్రం వాడకూడదు! మూఢ నమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తూ హత్యకు గురై, అమరుడైన డా.నరేంద్ర దభోల్కర్ స్మృతిలో 20 ఆగస్టును జాతీయ వైజ్ఞానిక స్పృహ దినంగా పరిగణిస్తూ.. ❑

# 'డబుల్ ఇంజన్' రాష్ట్రాల్లో విద్యా సంక్షోభం



- కె.వేణుగోపాల్

**దేశ భవిష్యత్తుకు పునాది కావాల్సిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పాఠశాలల మూసివేతలు, ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉద్యమబాట పట్టడం విద్యా సంక్షోభాన్ని బయటపెడుతోంది. 'ప్రాథమిక విద్యను కాపాడండి' అనే నినాదంతో 'స్కూల్ కాంప్లెక్స్ సిస్టమ్'ను రద్దు చేయాలని హిమాచల్‌ప్రదేశ్‌లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే సమస్యలకు కారణమవుతోందనే విమర్శలు వస్తున్నాయి.**

గత పదేండ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరిచే విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. యుడైస్ తాజా నివేదిక ప్రకారం దేశంలో రోజుకు సగటున 13 ప్రభుత్వ పాఠశాలలు మూత పడుతున్నాయి. పాఠశాలల్లో బెంచీలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలపై విద్యార్థులు అధికారులను నిలదీస్తున్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్‌వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు నిరసనలకు దిగడం గమనార్హం. ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ రాష్ట్రాల్లో ఎక్కువ భాగం బీజేపీ పాలిత, డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలే కావడం. కేంద్రంలోనూ, రాష్ట్రం లోనూ ఒకే పార్టీ అధికారంలో ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందని చెప్పే డబుల్ ఇంజన్ నినాదానికి, ప్రభుత్వ విద్యారంగంలోని వాస్తవ పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి.

పాఠశాలల మూసివేతలు, ఉపాధ్యాయ ఖాళీలు, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యలు కొనసాగుతుండటం ఆ ప్రభుత్వాల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మౌలిక సదుపాయాల కోసం విద్యార్థుల పోరాటం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో తక్కువ మంది ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయి బోధన అందడం లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం



దాఖలైంది. 1 నుంచి 5వ తరగతి వరకు కనీసం ఇద్దరు, 6 నుంచి 8వ తరగతి వరకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాలని పిటిషన్‌లో కోరారు. 16 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయుల ఖాళీలు, పాఠశాలల పరిస్థితిపై వివరాలు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. రాజస్థాన్‌లోని జాలూరు జిల్లా మెంగల్వా గ్రామంలో ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు పాఠశాల బయట బైఠాయించారు. బీహార్‌లోని గయా జిల్లాలో పాఠశాల సమస్యలపై విద్యార్థులు ఆందోళన చేసి జిల్లా మెజిస్ట్రేట్ వచ్చి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని దహనులో తాగునీరు, వాష్‌రూమ్‌లు, భద్రతా సమస్యలపై విద్యార్థులు నిరసన తెలిపారు. దేశంలో ప్రాథమిక విద్య నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకు అనేక సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య 1,00,843గా ఉంది. ఇందులో ఆంధ్రప్రదేశ్ 16,357 పాఠశాలలతో మొదటి స్థానంలో ఉంది.

ఝార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో రోజుకు సగటున 13 ప్రభుత్వ పాఠశాలలు మూతపడినట్లు యుడైస్ నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో 4,791 పాఠశాలలకు తాళాలు పడ్డాయి. మధ్యప్రదేశ్‌లో 2,426 ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా, తెలంగాణలో 1,392 పాఠశాలలు మూసివేయ బడ్డాయి. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లోనే పాఠశాలల మూసివేతలు, డ్రాప్ అవుట్లు, విద్యార్థుల సంఖ్య తగ్గుదల వంటి సమస్యలు కనిపించడం ఆ ప్రభుత్వాల విద్యా విధానాలపై చర్చకు దారితీస్తోంది. ప్రచారంలో విద్యారంగ

అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ బడుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.డ్రాపౌట్ల పెరుగుదలపై ఆందోళనదేశంలో సెకండరీ స్కూల్ డ్రాపౌట్ రేటు 9.5 శాతంగా ఉంది. గుజరాత్‌లో ఇది 15.7 శాతంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వంగా కొనసాగుతున్న గుజరాత్‌లో కూడా విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను సూచిస్తోంది. రాజస్థాన్‌లో గత రెండు విద్యా సంవత్సరాల్లో 8 లక్షలకు పైగా విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ పాఠశాలల్లోనే 9.3 లక్షలకు పైగా విద్యార్థులు తగ్గడం గమనార్హం. దీనికితోడు విలీన విధానం.. విద్య అందుబాటుపై ప్రభావం చూపుతోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి దాదాపు 40 వేల పాఠశాలలు విలీనమయ్యాయి.

పాఠశాలల విలీన విధానం వల్ల పాఠశాల విద్యను సార్వత్రికం చేయాలనే లక్ష్యానికి ఆటంకం కలుగుతోందనే విమర్శలు ఉన్నాయి. 2030 నాటికి పాఠశాల విద్యను సార్వత్రికం చేయాలని భారత ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDG) కింద సంకల్పించింది. అయితే పాఠశాలల విలీనం వల్ల ముఖ్యంగా గ్రామీణ, మారు మూల ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బందులు పెరుగుతున్నాయి. సమీపంలో ఉన్న పాఠశాల మూతపడితే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడం వల్ల పేద కుటుంబాల పిల్లలు చదువు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్య నాణ్యతను మెరుగుపరిచే పేరుతో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి వాటి నిర్వహణ బాధ్యతను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రయివేటీకరణ వైపు అడుగులు వేయడం పేద, సామాన్య విద్యార్థులపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యా వ్యవస్థలోకి ప్రవేశించే ప్రతి పది మంది పిల్లల్లో నలుగురు ఉన్నత మాధ్యమిక విద్య పూర్తికాకముందే చదువు మానేస్తున్నారని గణాంకాలు సూచిస్తున్నాయి. దేశంలోని కేవలం 5.4 శాతం పాఠశాలలు మాత్రమే 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నిరంతర విద్యా ప్రయాణాన్ని అందిస్తున్నాయి.పై తరగతులకు వెళ్లే ప్రతి దశలో పాఠశాలలు మారాల్సి రావడం, రవాణా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువు కొనసాగింపుపై ప్రభావం చూపుతున్నాయి.

విద్యా కేటాయింపులు తగ్గుతున్న వేళ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ మాత్రం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల సమస్యలు, మౌలిక సదుపాయాల లేమి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్ పరిమాణం పెరుగుతున్నప్పటికీ, విద్యకు కేటాయించే వాటా తగ్గుతోంది. 2013-14లో మొత్తం కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 4.65 శాతం కేటాయించగా, 2025-26 నాటికి అది 2.5 శాతానికి పడిపోయింది. విద్యతోపాటు పరిశోధన రంగానికి తగిన ప్రాధాన్యం తగ్గుతోందనే విమర్శలు ఉన్నాయి. దేశ యువతను ప్రపంచ స్థాయిలో నిలబెడతామని చెప్పే ప్రభుత్వాలు, ప్రాథమిక విద్య బలపడేలా తగిన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు అభివృద్ధి, సుపరిపాలనకు ప్రతీకలని ప్రచారం చేస్తున్నప్పటికీ, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు ఆ వాదనలను ప్రశ్నిస్తున్నాయి. పాఠశాలలు మూతపడటం, విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉపాధ్యాయ ఖాళీలు పెరగడం వంటి అంశాలు ప్రభుత్వాలను నిలదీస్తున్నాయి. విద్య హక్కు నుంచి అవకాశంగా మారుతున్నదా? చదువుకోలేని పిల్లలకు విద్య అందించడం, బలహీన వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా యునెస్కో 'అందరికీ విద్య' కార్యక్రమాన్ని ప్రతిపాదించింది.

**విద్యలో లింగ వివక్షను తొలగించడం, వంద శాతం అక్షరాస్యత సాధించడం దాని ప్రధాన లక్ష్యాలు. అయితే ఒకవైపు అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించాలని చెబుతూనే, మరోవైపు ప్రయివేటు విద్యాసంస్థలను ప్రోత్సహించే విధానాలు కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. 2010లో అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టం విద్యను హక్కుగా గుర్తించింది. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడితే పేద, బలహీనవర్గాల పిల్లలకు ఉచిత, నాణ్యమైన విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉంది. విద్య అనేది కేవలం మార్కులు, ఉద్యోగాల కోసం మాత్రమే కాదు. సమాజ అభివృద్ధికి, ప్రజాస్వామ్య బలోపేతానికి పునాది. అందుకే ప్రభుత్వ పాఠశాలలను రక్షించడం, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించడం, ఆధునిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. తరగతి గదులకు తాళాలు పడకుండా, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఇది. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల నిజమైన పనితీరు ప్రచారాల్లో కాదు.. పాఠశాలల తరగతి గదుల్లో, విద్యార్థుల భవిష్యత్తులో కనిపించాలి.** ❑

# నిలబడిన కొమ్మనే నరుక్కుంటున్న వైనం



- అశోక్ కుంబము

పెట్టుబడిదారీ వ్యవస్థను మార్క్సిస్ట్ జీవావరణ శాస్త్ర **(Marxist Ecology)** దృష్టితో ఎలా అర్థం చేసుకోవచ్చో చర్చించే ముందు ఒక చిన్న పిల్లల కథ చెప్పాలని ఉంది. మిసెస్ పీటర్కిన్ అనే ఒక అమెరికన్ మహిళ పొద్దున్నే కాఫీ కలుపు కుంటూ అందులో చక్కెర బదులు ఉప్పు కలుపుతుంది. కొంచం తాగి రుచి చూసే సరికి కాని ఆమె చేసింది ఏమిటో అర్థం కాలేదు. ఒక్కసారిగా ఇంట్లో ఉన్న తన భర్తను, ఇద్దరి పిల్లలను పిలుస్తుంది. వాళ్ళు కూడా తలా కొంచం తాగి "నిజమే, ఇందులో చక్కెర బదులు ఉప్పు కలిపింది" అని నిర్ధారణకు వస్తారు. ఇక అప్పుడు 'కాఫీలోంచి ఉప్పు తీయడం ఎట్లా?' అనే దాని మీద పెద్ద చర్చ మొదలవుతుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క ఆలోచన చేసి అవి ఏవి పనికిరావని తెలుసుకొని, చివరగా నిపుణుల సలహా తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించుకుం టారు. అందరు కలిసి ఆ పట్టణంలో ఉన్న ఒక రసాయన శాస్త్రవేత్త దగ్గరికి పోయి వాళ్ళ సమస్య మొత్తం చెప్తారు. అంతా విన్న అతను, "ఈ పని నావల్ల కాదు" అని చెప్పేస్తాడు. దానికి అందరు కొంత బాధ పడుతుంటే, ఎలాగైనా ఈ సమస్య నుండి బయటపడాలని మిస్టర్ పీటర్కిన్ అభ్యర్థిస్తూ "ఎంత ఖర్చైనా ఫర్వాలేదు నేను భరిస్తా" అని ఆశ చూపుతాడు. అప్పటికే కొంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ శాస్త్రవేత్తకు 'కాఫీలో ఉప్పు' సమస్య ఒక మంచి అవకాశంగా కనిపిస్తుంది. వెంటనే "నా మానవ ప్రయత్నం నేను చేస్త" అని ఒప్పుకుంటాడు. ముందు ఆ కాఫీలో పొటాషియం క్లోరేట్ కలిపి రుచి చూడమంటాడు. మిసెస్ పీటర్కిన్ రుచి చూసి "ఇంకా ఉప్పుగానే ఉంది" అని చెప్తుంది. ఇక వరుసగా సల్ఫ్యూరిక్ ఆసిడ్, సిట్రిక్ ఆసిడ్, కార్బోనిక్ ఆసిడ్, అమోనియా ఇలా అన్ని రకాల రసాయనాలు అందులో కలిపి ప్రతిసారి కొంత రుచి చూపిస్తూ ఉప్పు ఎంత వరకు తగ్గిందో అడుగుతూ అన్ని ప్రయోగాలు చేస్తాడు. అప్పటికే మధ్యాహ్నం అయిపోతుంది. చివరికి "థియరీ ప్రకారం అన్నీ సరిగానే చేశాను, కాని ఫలితం రావడం లేదు. ఇక నేను ఏమీ చేయలేను" అని తేల్చేస్తాడు.

వేరే దారి లేక అతనికి అడిగినంత ఫీజు చెల్లించి ఇంటికి వస్తారు. కాఫీ తాగితేనే కాని రోజు మొదలుకాని మిసెస్ పీట ర్కిన్ చాలా అవస్థ పడటం అందరినీ ఇబ్బంది పెడుతుంటుంది. కాని ఏమీ చేయలేని పరిస్థితి. ఎలాగైనా ఒక పరిష్కారం కనుక్కోవాలి అని అందరు ఆలోచిస్తుంటే పీటర్కిన్ కూతురుకు వాళ్ళ వీధి చివరన అనుభవ జ్ఞానం కల్గిన ఒక పెద్దావిడ ఉంటుందని గుర్తొస్తుంది. వెంటనే తన తమ్ముడిని వెంట బెట్టుకొని అక్కడికి పరుగున వెళ్ళి ఆమెకు విషయం మొత్తం చెప్తుంది. అంతా చాలా జాగ్రత్తగా విన్న ఆమె, "మీ అమ్మ ఆ చెడిపోయిన కాఫీని పడేసి, కొత్త కాఫీ చేసుకోవచ్చు కదా!" అని చాలా సాధారణంగా అనేస్తది. అక్క తమ్ముళ్ళ కళ్ళు ఒక్కసారిగా ఆశ్చర్యంతో కొంత, ఆనందంతో కొంత మెరిసిపోయి "అరె, ఇంత చిన్న విషయం మాకు ఎందుకు తట్టలేదు" అనుకుంటూ వెంటనే ఇంటికి పరిగెత్తుతారు. ఇంటికి వెళ్లి ఆ పెద్దావిడ చెప్పిన పరిష్కారం చెప్పి పాత కాఫీ పడేసి, కొత్త కాఫీ చేస్తారు. చివరికి వాళ్ళమ్మ కాఫీ తాగుతుంది.

ఈ కథలో సమస్యను (కాఫీలో ఉప్పు కలపడం) ఉద్దేశపూర్వ కంగా సృష్టించుకోకపోయినా దానిని పరిష్కరించుకోవడం లో మాత్రం కొత్త సమస్యలను కొని తెచ్చుకున్నారు. ఈ చిన్న కథ ఆధారంగా పెట్టుబడిదారీ పోకడ వంటి సంక్లిష్టమైన విషయాలు వివరించడం వీలుకాదు కాని, వాతావరణ మార్పులకు (climate change) సంబంధించిన చర్చను అర్థం చేసుకోవ డానికి ఉపయోగపడుతుంది. కొత్త సమస్యలు సృష్టించడం, కొన్నిసార్లు సమస్య కానిదాన్ని సమస్యగా చేయడం, అది అందరి సమస్యగా మార్చడం, దాని పరిష్కారమంటూ సైన్స్‌ను బలి చేయడం, అదే క్రమంలో మరిన్ని సమస్యలను సృష్టించుకోవ డం. ఈ విధంగా సంక్షోభాలను సృష్టించి వాటిని తిరిగి పెట్టుబ డికి మార్గాలుగా మార్చుకోవడం పెట్టుబడిదారీ చరిత్ర నిండా చూస్తాము. ఇప్పుడు పర్యావరణ సంక్షోభం కూడా ఒక సరుకు అయ్యింది. వాతావరణ మార్పుకు అసలు కారణం: లాభం తప్ప మరేది పట్టించుకోని పెట్టుబడి దారీ వ్యవస్థ. మనిషిని (అంటే శ్రమ శక్తిని), ప్రకృతిని వీలయినంత వరకు దోపిడీ చేసి మిగులును పోగు చేసుకునే ఉత్పత్తి విధానం ఒకవైపు, అవస రాలకు మించి, కొత్త అవసరాలు సృష్టించుకొని సరుకులను, వనరులను వినియోగించే సమాజ ఏర్పాటు మరోవైపు. ఈ రెండు ధోరణులు ప్రకృతి స్వభావాన్ని (the nature of Nature), దాని పరిమితులను (Natureμs limits) దాట డం మూలంగా జరిగే పరిణామాలను పట్టించుకోవు. ఇటువంటి వ్యవస్థ మూలంగానే పర్యావరణ మార్పు జరుగుతుంది. అందుకే మార్క్సిస్టులు నిజాయితీగా పర్యావరణ మార్పు గురించి మాట్లాడదలిస్తే వ్యవస్థ మార్పు గురించి మాట్లాడాలి అని చెప్తు న్నారు. కాని, పెట్టుబడిదారులు, పాలకవర్గ మేధావులు వ్యవస్థ మార్పు అనగానే అసలు సమస్యే లేదంటున్నారు. అమెరికా

అధ్యక్షుడు ట్రంప్ అయితే ఒక అడుగు ముందుకేసి వాతావరణ మార్పు అనేది ఒక బూటకం అని కొట్టిపారేస్తున్నాడు.

ఇప్పుడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మనిషి వ్యతిరేక, ప్రకృతి వ్యతిరేక పోకడలను అర్థం చేసుకోవడానికి ట్రంప్ ఒక కొత్త సందర్భం. మొన్నటి వరకు రాజ్యం రక్షణతో ప్రపంచ మంతా విస్తరించిన ఒక పెట్టుబడిదారుడే స్వయంగా రాజ్యాధి నేత అయితే ఇక సరుకుగా మారకుండా, అణిచివేత, దోపిడీకి గురికాకుండా ఏదీ ఉండే అవకాశం లేదు. ఇదేమీ కొత్తగా మొదలైనదీ కాకపోయినా వాటి విస్తృతి, లోతు నానాటికి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి అమెరికన్ సమాజంలో సరుకీకరణ నిత్య జీవితంలో సర్వసాధారణమయ్యింది. మార్కెట్‌తో సంబం ధం లేకుండా, దాని పరిధిలోకి రాకుండా బతకడం అసాధ్య మైంది. నయా ఉదారవాద సూత్రాల ఆధారంగా సమాజంలోని అన్ని రంగాలు నడుపబడుతున్నాయి. ప్రముఖ మార్క్సిస్ట్ సామాజిక శాస్త్రవేత్త డేవిడ్ హార్వీ అన్నట్టు నయా ఉదారవాదం అనేది "సృజనాత్మక విధ్వంసం." సృజనాత్మకమైనది ఎందుకంటే అది చాలా సహజమైనదిగా, ప్రత్యామ్నాయం లేనిదిగా, దానికి ఎదురీదడం అంటేనే వృథా ప్రయాసగా ఒక భావజాలాన్ని నిర్మించి సమాజ సమ్మతిని కూడగట్టే ప్రక్రియ కనుక. ఇది కేవలం భావజాలం మాత్రమే కాదు, పాలకవర్గ రాజకీయార్థిక పాలసీ కూడా. అందులో ముఖ్యమైనవి: (1) సమాజంలోని అన్ని ఉత్పత్తి రంగాలను, సేవలను, సహజ వనరులను ప్రైవేటీకరిం చడం, (2) ఫైనాన్స్ కాపిటల్ విస్తృతిని పెంచడం, (3) కొత్త కొత్త సంక్షోభాలను సృష్టించి వాటి ద్వారా వ్యవస్థపై పూర్తి పట్టు సాధించడం, (4) రాజ్యాన్ని చెప్పుచేతుల్లో ఉంచుకోని పబ్లిక్ రంగ వనరులన్నింటినీ ధనిక వర్గ ప్రయోజనాలకు అనుగుణం గా పునఃపంపిణీ చెయ్యడం. ఈ పద్ధతుల ద్వారా పెట్టుబడి మనుషులపై, ప్రకృతిపై ఆధిపత్యం సంపాదించి పెట్టుబడి పోగుకు ఎలాంటి అడ్డులేకుండా చేసుకోవడం ప్రధాన వ్యూహం.

ఈ విధానాలను మిగతా ప్రపంచమంతా 1980ల నుండే అమలు చేయడానికి అమెరికా తన పెత్తనాన్ని ఉపయోగించి నప్పటికీ, 1990 నుండి మాత్రమే వాటిని తన సొంత గడ్డ మీద ఒక విధానంగా తీసుకొచ్చింది. ఈ పాలసీలు మిగతా సమాజాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపాయో అవే అమెరికాలో కూడా జరిగాయి. అన్ని రంగాలను పెట్టుబడి ఆధీనంలోకి తెచ్చుకోవడం, అన్ని అడ్డంకులు తొలగించుకొని మిగులుకు దారులు వేసుకోవడం. ఆ అడ్డంకులు బౌద్ధికమైనవి అయినా, సాంస్కృతికమైనవి అయినా, భౌతికమైనవి/ ప్రాకృతికమైనవి అయినా అన్నింటినీ తొలగించాల్సిందే. ఈ తొలగింపు వల్లనే పెట్టుబడి అభివృద్ధికి దారులు వేయాలి. ఈ మొత్తం విధానాన్ని హార్వీ accumulation by dispossession అని సూత్రీకరించాడు. అయితే, ఇదేమీ కొత్తది కాదు. ఇది మార్క్స్ వివరించిన ప్రాథమిక పెట్టుబడి పోగు (primitive accumulation of capital) విధానానికి కొనసాగింపే, కాకపోతే దోపిడీ చేసే పద్ధతులు మారాయి అంతే అంటాడు.

నయా ఉదారవాద విధానాల మూలంగా తమ భద్ర జీవితాల నుండి తొలగించబడిన కార్మికులు గాని, మరి ఏ ఇతర రంగం లోని సమూహాలను గాని సంఘటితపరిచే శక్తులు లేకుండ పోవడంతో, అదే తొలగించబడిన వర్గం **(dispossessed class)** ఒక బిలియనీయర్ తమ పరిస్థితిని చక్కదిద్దగలడని నమ్మి గద్దె మీద కూర్చోబెట్టింది. ఇది ఒక చారిత్రక విషాదం. ఇది దోపిడీని మరింత చట్టబద్ధం చేయనుంది. ఈ ప్రక్రియలో వాస్తవం బూటకం అవుతుంది, బూటకం వాస్తవం అవుతుంది. అందులో భాగమే "పర్యావరణ మార్పు ఒక బూటకం" అని ట్రంప్ ప్రకటన. ఇది కేవలం ఒక విశ్వాసాన్ని ప్రకటించుకో వడం మాత్రమే కాదు. బిలియన్ డాలర్ల ప్రకృతి వనరుల వ్యాపారాలకు అనుమతులు సంపాదించుకోవడానికి, తన సొంత ప్రయోజనాలను కాపాడుకోవడానికి చేసే ప్రయత్నమే. అందులో భాగంగానే తన క్యాబినెట్‌ను పర్యావరణ మార్పు జరగడం లేదని వాదించే **(outright denialists)** వాళ్ళతో నింపేశాడు. మరి వాస్తవం ఏంటి? సైన్స్ ఏమి చెబుతుంది?

సూర్యుని నుండి వచ్చే శక్తిలో 2/3 వంతు భూమిపై ఉన్న సముద్రాలు, అడవులు, మిగతా పచ్చని వనరులు గ్రహిస్తే, మిగిలిన 1/3 వంతు వెనుకకు పంపబడుతుంది. అలా వాతావ రణంలోకి వదలబడిన శక్తిలో కొంత భాగాన్ని గాలిలో ఉండే నీటి ఆవిరి, వివిధ రకాల వాయువులు (ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, ఓజోన్) గ్రహించి భూమి ఉపరితలం మీద వేడిగా ఉండేటట్టు చేస్తాయి. ఆ విధంగా వెలుబడిన వాయువులనే గ్రీన్‌హౌస్ గ్యాసెస్ (greenhouse gases) అంటారు. అవి ఒక బ్లాంకెట్ లాగా ఏర్పడి భూమిని వెచ్చగా ఉంచుతాయి. కాబట్టి ఈ ప్రకృతి పద్ధతిని "బ్లాంకెట్ ఎఫెక్ట్"గా పిలుస్తారు. ఒకవేళ ఇటువంటి సహజ ప్రక్రియ లేకపోతే భూమి మీద ఇప్పుడు ఉన్నదానికంటే 35 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉండేది. దానితో జీవం మనుగడ ప్రశ్నా ర్థకం అయ్యేది. కాని సమస్య ఏమిటంటే, పారిశ్రామిక విప్లవం జరిగిన నాటి నుండి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ శాతం పెరుగుతూ పోతోంది. దీనిమూలంగా వాతావరణంలో ఉష్ణశక్తి ఎక్కువ కావడంతో అంటార్కిటిక్, గ్రీన్‌లాండ్ మంచు పొరలు (ice sheets) కరిగే వేగం పెరిగింది. అది సముద్రమట్టాన్ని పెంచుతుంది. శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం ఇప్పటికే 30 శాతం పెరిగింది. కేవలం ఇరవయ్యో శతాబ్దంలోనే ప్రపంచవ్యాప్తంగా 0.75 సెంటిగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. దాని మూలంగా సముద్రమట్టం 22 సెంటీమీటర్ల ఎత్తు పెరిగింది. 2100 సంవత్సరానికి 1.1 డిగ్రీల నుండి 6.4 డిగ్రీలకు పెరిగే

అవకాశం ఉందని ఒక అంచనా. అదే జరిగితే, దాదాపు 28 సెంటీమీటర్ల నుండి 79 సెంటీమీటర్ల ఎత్తుకు సముద్రమట్టం పెరిగే అవకాశం ఉంది.

సముద్రంలో పెరిగే నీటిమట్టం మూలంగా ఎన్నో దీవులు మునిగిపోతాయి. సముద్రగర్భంలో ఒత్తిడి ఎక్కువై భూకంపాలు, సునామీలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. అంతేకాదు, సముద్రం ఎక్కువ కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి అందులో ఆసిడ్ స్థాయి పెరుగుతుంది. దీనిమూలంగా సముద్రంలో జీవరాశి నశించే ప్రమాదం ఉంది. మొత్తంగా అంచనా వేయలేని విపత్తులు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భయాందోళనలు వెల్లడిస్తున్నారు. సంఘటనలుగా జరిగే విపత్తులు ఒకవైపు అయితే వాతావరణ మార్పు మూలంగా పంటలపై, ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం మరోవైపు. మొత్తంగా, విధ్వంసం వైపు అడుగులు పడుతున్నాయి. పరిస్థితి చేయి జారకముందే అదుపు చేయాలని ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ శాస్త్రవేత్తలు మొరపెట్టుకుంటున్నారు. మార్పును అంచనా వేసి ప్రభుత్వాలకు, ప్రజలకు విషయ తీవ్రతను అర్థం చేయించడానికి ఐక్యరాజ్యసమితి **Intergovernmental Panel on Climate Change** అనే ఒక అంతర్జాతీయ సంస్థను 1988లో ఏర్పాటు చేసింది. ఈ సంస్థ తనంతట తానుగా పరిశోధనలు జరుపదు కాని, ప్రపంచవ్యాప్తంగా జరుపుతున్న పరిశోధనలను క్రోడీకరించి ప్రపంచ సమాజం ముందు పెడుతుంది. ఈ సంస్థ ప్రయత్నాల మూలంగానే కియోటో ప్రొటోకాల్ 1997లో ఏర్పాటయ్యింది. దీని ముఖ్య ఉద్దేశం గ్రీన్‌హౌస్ గ్యాసెస్ విడుదలను తగ్గించి వాతావరణ ఉష్ణోగ్రతలను అదుపులో పెట్టడం. ఇప్పటికి 192 దేశాలు ఈ అంతర్జాతీయ ఒప్పందాన్ని ఆమోదిస్తే, 35 శాతం గ్రీన్‌హౌస్ గ్యాసెస్ విడుదల చేసే అమెరికా ఒప్పుకోవడానికి మొండికేస్తుంది.

కియోటో ప్రొటోకాల్ ప్రయత్నాల కొనసాగింపుగా 2015లో పారిస్ ఒప్పందం వచ్చింది. దీని ముఖ్య లక్ష్యం ప్రపంచ సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల 2 డిగ్రీలకు మించకుండా చూసుకోవడం. దాని ప్రకారం ఇప్పటికి ఒప్పుకున్న 120 దేశాలకు కార్బన్ విడుదల తగ్గింపు టార్గెట్స్ పెట్టింది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులుసమకూర్చుకోవాలని నిర్ణయం చేసింది. ఆర్థిక వనరులు లేని పేద దేశాలకు సహాయం చేయడానికి క్లైమేట్ ఫైనాన్స్(climate finance) ఏర్పాటు చేయాలని తీర్మానం జరిగింది. అమెరికాలో జరుగుతున్న పర్యావరణ ఉద్యమ ప్రభావంతో ఒబామా ప్రభుత్వం ఈ ఒప్పందానికి ఒప్పుకుంది. కాని ఇలాంటి ఒప్పందాల మూలంగా అమెరికా అభివృద్ధి కుంటుపడుతుందని, తాను గెలిస్తే పారిస్ ఒప్పందం నుండి అమెరికా వైదొలగుతుందని ట్రంప్ ముందే ప్రకటించి ఉన్నాడు. భారతదేశం కియోటో నుండి పారిస్ వరకు జరిగిన అన్ని ఒప్పందాలకు సమ్మతి తెలిపింది. కాని ఆచరణలో ఎలాంటి పురోగతి చూపలేదు. అయితే, కేవలం మన దేశమే కాదు ఈ ఒప్పందాలను ఏ దేశం పూర్తిగా అమలు చేస్తున్న ఆధారాలు మాత్రం లేవు.

పెట్టుబడిదారీ విధానం మానవ మనుగడనే ప్రశ్నార్థకం చేసే దిశగా ప్రయాణిస్తున్న ఈ క్రమాన్ని మార్క్సిస్టులు ఎలా అర్థం చేసుకోవాలి? మార్క్స్ మీద, మార్క్సిస్టుల మీద ఒక అపవాదు ఉంది. వాళ్ళు ఉత్పత్తివాదులు, ఆర్థికవాదులని, పర్యావరణాన్ని పట్టించుకోరని. కాని వాస్తవానికి, మార్క్స్, ఏంగెల్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ పర్యావరణానికి చేసే హాని గురించి అప్పుడే చెప్పి ఉన్నారు. వాళ్ళు ఊహించి చెప్పినవి కాదు. అప్పటికే పెట్టుబడిదారీ వ్యవసాయంలో, సరుకుల ఉత్పత్తి విధానంలో వస్తున్న మార్పులను గ్రహించి, విశ్లేషించి చెప్పినవి. ఏంగెల్స్ తన Dialectics of Nature అనే గ్రంథంలో (చాప్టర్ 9) ప్రకృతిని జయించగలననీ, నియంత్రించగలననీ మనిషి తన మొదటి ప్రయత్నంలో పొంగిపోవచ్చు. కాని రెండోసారి లేక మూడోసారి జరగబోయే పరిణామాలలో ప్రకృతి పగ తీర్చుకుంటుంది. అలా జరిగే ఊహించని పరిస్థితి మూలం గా మొదట పొందిన ప్రయోజనాలు రద్దయిపోతాయని చెప్పాడు. ఏంగెల్స్ "ప్రకృతి పగ తీర్చుకుంటుంది" అనడమంటే గతితార్కికంగా ప్రకృతి పర్యవసానం ఉంటుందని చెప్పడం.

మార్క్స్ ఇంకా స్పష్టంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు సమాజాన్ని ప్రకృతి నుండి వేరు చేసి ఒక పూడ్చలేని అగాధాన్ని సృష్టిస్తాయని చెప్పాడు. 1850-60లలో జర్మన్ రసాయన శాస్త్రవేత్త జస్టస్ వాన్ లైబిగ్ బ్రిటిష్ పారిశ్రామిక వ్యవసాయ పద్ధతులు సారవంతమైన భూములను ఏ విధంగా నాశనం చేశాయో చేసిన విమర్శ మార్క్స్‌కు ప్రకృతి జీవక్రియకు (natural metabolism) సంబంధించిన సాంకేతికమైన విషయాల మీద మంచి పట్టునిచ్చింది. దాని ఆధారంగా మెటబాలిక్ రిఫ్ట్ **(metabolic rift)** అనే భావనను ఉపయోగించి సమాజానికి ప్రకృతికి మధ్య తెగిపోతున్న జీవ సంబంధం గురించి విశ్లేషించాడు. మనిషిని ప్రకృతిలో భాగంగా చూస్తూనే, ఒక కరడుకట్టిన ప్రకృతివాదిలా కాకుండా ప్రకృతి-మనిషి మధ్య ఉండే గతితార్కిక సంబంధపు దృష్టికోణాన్ని మార్క్స్ ప్రతిపాదించాడు. శ్రామికులు లేదా ఉత్పత్తిదారులు తమ శ్రమ ద్వారా ప్రకృతికీ సమాజానికీ మధ్య ఒక సంబంధాన్ని నిర్వచించుకుంటారు. ఆ క్రమంలో ప్రకృతిని తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటారు. ప్రకృతిలో భాగంగా ఇమడటానికి తమను కూడా మార్చుకుంటారు. ఈ విధంగా ఒక సజీవ సంబంధాన్ని నిలబెట్టుకుంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఇటువంటి సంబంధాలతో పనిలేదు. ప్రకృతిని జయించి, నియంత్రించి పెట్టుబడుల అభివృద్ధికి దానిని ఒక ముడి పదార్థంగా

చేసుకోడమే దాని లక్ష్యం. అది ఎప్పుడూ ప్రకృతిని తనకు లభించిన ఒక బహుమతిగానే భావిస్తుంది. దాని దృష్టి అంతా లాభాలపైన, మరింత పెట్టుబడిని పోగేయడం మీదనే తప్ప మనిషికి ప్రకృతికి మధ్య పెరుగుతున్న అగాధం గురించి కాదు. అది ఎప్పుడూ ప్రకృతి విలువను సంపద సృష్టిలో(కొన్ని సందర్భాలలో భూమి అద్దెను నామమాత్రంగా పరిగణలోకి తీసుకున్నప్పటికీ) లెక్కించదు. ఎందుకంటే ప్రకృతిని తనకు మంజూరు చేయబడిన సొంత ఆస్తిగా భావిస్తుంది కాబట్టి. అయితే జేమ్స్ ఓ కన్నర్ వంటి మార్క్సిస్ట్ మేధావులు మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థను విశ్లేషించడానికి శ్రమశక్తి విలువ **(the value of labour power)** మీదనే ఎక్కువ దృష్టి పెట్టాడు కాని, అన్ని ఉత్పత్తులలో కీలకమైన ప్రకృతి విలువకు **(the value of nature)** అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు అనే విమర్శను లేవనెత్తాడు. దీనికి జవాబుగా జాన్ బెల్లామీ ఫాస్టర్ (మంత్లీ రివ్యూ ఎడిటర్, సోషియాలజిస్ట్), పాల్ బుర్కెట్ వంటి మార్క్సిస్ట్ పర్యావరణవాదులు మార్క్స్ సిద్ధాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసి శ్రమశక్తి విలువను ప్రకృతి విలువతో జోడించి మార్క్సిస్ట్ జీవావరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

డబ్బు రూపంలో ఉన్న పెట్టుబడి**(M)** ఉత్పత్తి ద్వారా సరుకులుగా**(C)** మార్చబడి, అవి అధిక లాభానికి అమ్ముడుపోయి **(M1)** మిగులును పోగు చేసుకోడం పెట్టుబడిదారీ విధాన ముఖ్య లక్షణం. ఎక్కువ లాభాలు రాబట్టాలంటే సరుకు తయారీలో ముఖ్య ఉత్పత్తి సాధనాలైన (శ్రమశక్తిని, ప్రకృతిని) మరింతగా కొల్లగొట్టాలి. దీనికితోడు సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తిని మరింతగా పెంచుకోవాలి. ఒకవేళ కార్మికులు ఎక్కువ వేతనాలు డిమాండ్ చేస్తే, ఎక్కడ తక్కువ వేతనాలకు కార్మికులు దొరుకుతారో అక్కడికి ఉత్పత్తి రంగాలను తరలించుకోవాలి. లేదా చౌక కార్మికులను తన దగ్గరికి తెప్పించుకోవాలి. లేదా ఉత్పత్తిని పూర్తిగా యాంత్రీకరించి కొద్దిమంది కార్మికులతో పరిశ్రమను నడపాలి. కార్మికుల సమస్య నుండి ఏదో విధంగా తప్పించుకోవచ్చు, మరి సహజ వనరులను ఎక్కడ నుండి కొత్తగా పుట్టిస్తారు? అవి ఎక్కడ ఉంటే అక్కడికి పోవాలి. వాటిని విచ్చలవిడిగా వాడుకోవడానికి అను మతులు ఇచ్చే ఒక దళారీ పాలక వ్యవస్థను ఏర్పరచుకొని, చెప్పుచేతల్లో పెట్టుకోవాలి. అడ్డుకునే ప్రజా శక్తులు ఉంటే నల్ల చట్టాలను ప్రవేశపెట్టి, హింసను కొనసాగించాలి. చౌకగా దొరికే శ్రమశక్తి, చౌకగా దొరికే వనరులు, చెప్పినట్టు ఆడే పాలకవర్గం, దానికి భజన చేసే మేధావి వర్గం, మీడియా. తమ సరుకులను ప్రపంచమంతా అమ్ముకోవడానికి అనుకూలమైన వాణిజ్య ఒప్పందాలు. ఇంకేం కావాలి ప్రపంచ ఉత్పత్తి, వినియోగ సామ్రాజ్యాలను నిర్మించుకొని రాజకీయార్థిక పెత్తనం చేయడానికి. ఇదే నడుస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తీరు. కాని ఏ వనరులు ఎక్కడా అపరిమితం కావు. ముఖ్యంగా ఇప్పుడు ప్రపంచీకరించబడిన ఉత్పత్తి, సరఫరా, వినియోగం మొత్తం ఇంధన వనరుల మీద ఆధారపడి నడుస్తున్నాయి. ఈ వనరులు పరిమితమైనవి. పీక్ ఆయిల్ సిద్ధాంతకర్తలు **(peak oil theorists)** ప్రపంచ ఇంధన వినియోగం ఇప్పటికే గరిష్ట పరిమితికి చేరుకుందని లెక్కలు చెప్తున్నారు. ఇంధనం లేకుండా జీవితంలో దేన్నీ ఊహించలేని పరిస్థితికి చేరాము. ఒక్క వ్యవసాయాన్ని ఉదాహరణగా తీసుకున్నా, యంత్రాలు, రసాయనాలు, ఉత్పత్తి, సరఫరా, వాటిని ప్రాసెస్ చేయడానికి, ప్యాకింగ్‌కు, సుదూరాలకు అమ్మకానికి... ఈ విధంగా అన్ని ప్రక్రియలు ఇంధనం మీద ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రక్రియలో వెలువడుతున్న వివిధ రకాల కాలుష్యాలు వాతావరణాన్ని నాశనం చేస్తున్నాయి.

ఈ మొత్తం క్రమంలో మనిషిని మనిషి నుండి, మనిషిని ప్రకృతి నుండి (జన్యుమార్పిడి పంటలు దీనికి ఒక ఉదాహరణ) పరాయీకరించడం పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న దుర్మార్గం. సాంకేతిక పరిజ్ఞానం తనను కాపాడుతుందనే అతి విశ్వాసాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రకటించుకుంటుంది. కాని, వాస్తవానికి అది తాను నిలబడిన కొమ్మనే అదే నరుక్కుంటుంది. ప్రకృతి బహుమతిగా దొరికిందని భావించి దాన్ని విపరీతంగా కొల్లగొట్టుకుంటూ పోతే అదే చివరికి బొందల గడ్డగా మారుతుంది. "ప్రకృతి పగతీర్చుకుంటుంది" అంటే ఇదే. దీనర్థం ప్రకృతే పగ తీర్చుకుంటుంది అనుకుంటూ మనం ఇప్పుడు ఏమీ చేయనవసరం లేదు అని తలరాత సిద్ధాంతాన్ని **(fatalism)** ప్రకటించడం కాదు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, వినియోగ వ్యవస్థ జీవావరణాన్ని పూర్తిగా కొల్లగొట్టకముందే దానిని కాపాడుకోవాలి. దీనికంతటికీ ఒకే మందు: మనిషిని మానవీకరించి, ప్రకృతి–సమాజం మధ్య జీవబంధాన్ని పునరుద్ధరించే ప్రత్యామ్నాయ ఉత్పత్తి వినియోగ వ్యవస్థ కోసం నిరంతర ప్రయత్నం చేయడం. ఈ వ్యవస్థల నిర్మాణం వర్గపోరాటంలో భాగమయినప్పుడే అవి నిలబడి పెట్టుబడిదారీ వ్యవస్థను అధిగమించగలుగుతాయి. లేకపోతే పర్యావరణ ఉద్యమాలను పెట్టుబడి తన వశం చేసుకుంటుంది. ఇప్పటికే ఆ పని మొదలయ్యింది. కాఫీ కథలాగా, చెడిపోయిన వ్యవస్థ మూలాలను అలాగే ఉంచి సరిదిద్దడంకన్నా నూతన వ్యవస్థ నిర్మాణంలో భాగం కావడమే సహేతుకమైనది. ఆల్బర్ట్ ఐన్‌స్టైన్ ఇప్పుడు మళ్ళీ తన వ్యాసం 'సోషలిజం ఎందుకు?' **(Why Socialism)** మంత్లీ రివ్యూ మొదటి సంచికలో, మే 1949లో మొదటగా ప్రచురింపబడినది) రాసే అవకాశం ఉంటే మానవ విలువల పరిరక్షణతోపాటు ప్రకృతి రక్షణ కోసం సోషలిజం అవసరం ఎప్పటికన్నా ఇప్పుడే ఎక్కువని రాసేవాడేమో. అంతిమంగా సారాంశంలో పర్యావరణ రక్షణ పోరాటమంటే పెట్టుబడిదారీ వ్యతిరేక వర్గ పోరాటమే! ❑ **(కొలిమి సౌజన్యంతో)**

# అవి అజ్ఞానపు వ్యాఖ్యలే...!



- డా.సి.ఎన్.క్షేత్రపాల్ రెడ్డి

కమ్యూనిస్టులు పిరికివాళ్లని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవి. పార్లమెంటులో ఆమె చేసిన వ్యాఖ్యలను కేవలం రాజకీయ విమర్శగా చూడకూడదు. భారతదేశంలో గత వందేళ్ల కాలంలో కమ్యూనిస్టులు, స్వాతంత్ర్య ఉద్యమంతో సహా, సాగించిన మహోన్నత ప్రజా పోరాటాల చరిత్రను అవమానించడం కిందనే లెక్కగట్టాలి. అమరుల త్యాగాలను తక్కువ చేయడంతోపాటు కార్మికులు, రైతులు, పేదలు, ఆదివాసీలు, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగిన ఉద్యమాల వారసత్వాన్ని చులకన చేసినట్టుగానే భావించాలి. ఏ అర్హతతో ఆమె ఆ వ్యాఖ్యలు చేశారో అనే అంశాన్ని చర్చకు పెట్టాలి.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర అణచివేతల నుంచే నిర్మాణమైంది. పుట్టుకలోనే కాన్పూర్, మీరట్, పెషావర్ వంటి అనేక కుట్ర కేసులను ఎదుర్కొన్నది. కమ్యూనిస్టు నాయకులు జైళ్ల పాలయ్యారు. పోలీసుల తూటాలకు ఎదురు నిలిచారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులను సంఘటితం చేయడంలో కమ్యూనిస్టులే కీలక పాత్ర పోషించారు. కార్మిక వర్గాన్ని సంఘటిత శక్తిగా తీర్చిదిద్దారు. కార్మిక హక్కుల కోసం పోరాడారు. వలస పాలకుల అణచివేతను ఎదుర్కొన్నారు. అరెస్టులు, నిషేధాలు, జైళ్లు, పోలీసు వేధింపులు ఎదురైనా వెనక్కి తగ్గనిది కమ్యూనిస్టులే. దేశ స్వాతంత్ర్యం అనంతరం ఈ పోరాటాలు కొనసాగాయి. దేశాన్ని పట్టిపీడిస్తున్న భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, కౌలు రైతులపై దౌర్జన్యం, కార్మికుల దోపిడీ, నిరుద్యోగం, ఆకలి, పేదరికం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులే ప్రజలను సంఘటితం చేశారనేది కాదనలేని సత్యం. ఇందులో భాగంగానే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. ఇది కమ్యూనిస్టుల పోరాటాల చరిత్రలో ఒక మహత్తర అధ్యాయం. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల హింస, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలోనే తెలంగాణ రైతాంగం తిరగబడింది.

**1946 నుంచి 1951 వరకు సాగిన ఈ ఉద్యమంలో లక్షల మంది రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు భాగస్వాములయ్యారు.**



**కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన దొడ్డి కొమురయ్య అమరత్వం మొదలు, మొత్తం నాలుగు వేల మంది కార్యకర్తల ప్రాణత్యాగాలతో గ్రామాలను భూస్వాముల చెర నుంచి విముక్తం చేసింది. "భూమి కోసం.. భుక్తి కోసం.." అనే నినాదంతో పేద రైతుల చేతుల్లోకి లక్షల ఎకరాల భూమి చేరింది. ఇలా తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం పోరాటాలు నడిపిన వారిని పిరికివాళ్లుగా పేర్కొనడం ఆమె అజ్ఞానానికి నిదర్శనం.**

ఈ తరహా భూపోరాటాలు దేశవ్యాప్తంగా ఇంకా అనేకం జరిగాయి. బెంగాల్‌లో తేభాగా రైతాంగ ఉద్యమం ఇదే తీరున సాగింది. పండిన పంటలో మూడింట రెండు వంతులు సాగుదారుడికే దక్కాలని డిమాండ్ చేసింది. ఈ ఉద్యమానికి కమ్యూనిస్టులే నాయకత్వం వహించారు. కేరళలో పున్నప్ర-వయలార్ పోరాటం ఇదే కోవలోకి వస్తుంది. కార్మికులు, రైతులు ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగించిన మరో గొప్ప పోరాటం అది. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన ఆ పోరాటంలో పోలీసు కాల్పుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రజల కోసం తుపాకీ తూటాలను లెక్కచేయని వారిని పిరికివాళ్లు అనడం ఎంతమాత్రమూ సమంజసం కాదు.

భారత కమ్యూనిస్టు ఉద్యమం కేవలం వీధి పోరాటాలకే పరిమితం కాలేదు. ప్రజా ఉద్యమాల సారాంశాన్ని పార్లమెంట్‌లోకి తీసుకెళ్లింది. పార్లమెంట్‌ను పదవుల వేదికగా

కాకుండా ప్రజా సమస్యలను ప్రశ్నించే వేదికగా ఉపయోగించు కున్నది కమ్యూనిస్టు నేతలే. తొలి లోక్‌సభ నుంచే హిరేన్ ముఖర్జీ, రేణు చక్రవర్తి వంటి కమ్యూనిస్టు నాయకులు ప్రజా సమస్యలను సభలో ప్రస్తావిస్తూ ప్రజల పక్షం వహించి బలమైన వాదనలు చేశారు. భూపేష్‌గుప్తా ప్రభుత్వ విధానాలను గణాంకాలతో, వాస్తవాలతో నిలదీసేవారు. దేశ హోం మంత్రిగా పనిచేసిన ఇంద్రజిత్ గుప్తా తన సుదీర్ఘ పార్లమెంటరీ జీవితంలో కార్మికులు, పేదలు, పౌర హక్కుల కోసమే గళమెత్తారు. సోమనాథ్‌ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. వీరందరి పార్లమెంటరీ చర్చలు, పోరాటాలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

ఇప్పటికీ రైతుల, కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్నది కమ్యూనిస్టులే. ప్రజల కష్టార్జితంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ప్రజా సంపద దోపిడీగా ప్రశ్నిస్తున్నది, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని, పౌర హక్కుల ఉల్లంఘనలను సభలో ప్రస్తావిస్తున్నది కమ్యూనిస్టులే. మొత్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనం మధ్య నిలబడి, చట్టసభలోనూ పోరాడుతున్నది కమ్యూనిస్టులే. ఈ దేశంలో హక్కుల కోసం పోరాడి, పేదలకు గొంతునిచ్చి, కార్మికులను సంఘటితం చేసి, కార్మికుల కనీస వేతనం, పని గంటల నియంత్రణ, ట్రేడ్ యూనియన్ హక్కులు, పని ప్రదేశాల్లో భద్రత, సామాజిక భద్రత వంటి అంశాలను భారత రాజకీయ చర్చల్లో బలంగా వినిపించింది కమ్యూనిస్టులే. ఇవన్నీ నిర్మలమ్మకు పిరికివారి చర్యలుగా కనిపించడం హాస్యాస్పదమే.

రాజ్యాంగం ఇచ్చిన జీవించే హక్కు కోసం కార్మికులకు కనీస వేతనాల చట్టం దక్కాలని పోరాటం చేసి, 1948లో కనీస వేతన చట్టం రూపకల్పనకు బీజం వేసింది. కార్మికుడి శ్రమకు కనీస విలువ ఉండాలని, కార్మికుడికి సంఘటిత హక్కు ఉండాలని, పని ప్రదేశంలో గౌరవం, భద్రత ఉండాలని నిరంతరం పోరాడిన వామపక్ష కార్మిక ఉద్యమ పాత్రను ఈ సమాజం మరచిపోలేదు. బ్యాంకుల జాతీయాకరణ విషయంలోనూ వామపక్షాలది దీర్ఘకాలిక పోరాటం. ప్రజల పొదుపులతో నడిచే బ్యాంకులు కొద్దిమంది పారిశ్రామికవేత్తలకు మాత్రమే కాదని, అవి జాతీయం కావాలని నినాదం ఇచ్చింది వామపక్షాలు. వామపక్షాల పోరాటాల ఫలితంగానే 1969లో బ్యాంకుల జాతీయాకరణ జరిగింది. ఈ పోరాటం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన మార్పులను తెచ్చింది.

గ్రామీణ పేదలకు ఉపాధిని చట్టబద్ధ హక్కుగా దక్కాలని పోరాటం చేసింది కమ్యూనిస్టులే. ఆ పోరాటాల ఫలితమే నిన్నటి దాకా అమలైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. దీన్ని వామపక్ష పార్టీలు బయట నుంచి మద్దతు ఇచ్చి, 



యూపీఏ-1 తరుణంలో సాధించాయి. 2006లో వచ్చిన అటవీ హక్కుల చట్టం విషయంలోనూ వామపక్షాలకు ఘనమైన పాత్ర ఉంది. తరతరాలుగా అడవి బిడ్డలకు ఆధారమైన భూమి, అటవీ వనరులపై చట్టబద్ధమైన హక్కులను సాధించడంలో వామపక్ష రాజకీయ శక్తుల ఒత్తిడి ముఖ్యమైనది. ఆదివాసీల చారిత్రక హక్కులను గుర్తించాలని పౌర సమాజంతో కలిసి బయట, పార్లమెంట్‌లోనూ పోరాడింది కమ్యూనిస్టులే.

2005 నాటి సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత జవాబుదారీగా మార్చడానికి పోరాటాలు చేసింది. దేశంలో అనర్థులు ఉండరాదని, ప్రజలందరికీ ఆహారం హక్కుగా దక్కాలని గళమెత్తిన ఉద్యమంలో, దాన్ని రాజకీయ పోరాటంగా మార్చడంలోనూ వామపక్షాల పాత్ర కీలకమైనది. ఇప్పుడు పాలకులు గొప్పలు చెప్పుకుంటున్న మహిళా బిల్లును రూపకల్పన చేసింది కమ్యూనిస్టు పార్టీ మహిళా నేత గీతా ముఖర్జీ. ప్రజల నుంచి వచ్చే ప్రతి డిమాండ్‌ను రాజకీయ డిమాండ్‌గా మార్చడం, వాటిని పార్లమెంట్‌లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వాలపై పోరాటాలు నడపడం పిరికితనం అవ్వదు కదా.

**కమ్యూనిస్టులపై విమర్శ చేయడం సులభం. వారు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పడమే కష్టం. కమ్యూనిస్టు ఎంపీ జాన్ బ్రిట్టాస్ రూపాయి విలువ తగ్గుతున్నదంటే దేశంలో అవినీతి పెరిగిందని మోదీ గతంలో అన్న వ్యాఖ్యలను గుర్తు చేశారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసే నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ ఎంత ఉన్నది, ఇప్పుడు ఎంత ఉన్నది అని ప్రశ్నించి, దేశంలో తారస్థాయికి చేరిన రాజకీయ అవినీతిని ప్రశ్నించారు. ఆయన లేవనెత్తిన ప్రశ్నకు సమాధానం చెప్పుకోలేకనే కమ్యూనిస్టులను పిరికివారని అంటూ తమ చేతకానితనాన్ని, పిరికితనాన్ని, భయాన్ని, చరిత్ర తెలియని తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు.** ❑

# ఆర్థిక వృద్ధి కంటే అసమానతల పెరుగుదలే ఎక్కువ!

- ఎం.కోటేశ్వరరావు



గడచిన పదేండ్లలో ప్రపంచ వృద్ధి రేటులో పెద్ద మార్పు లేదు. కానీ అదే సమయంలో కొంత మంది సంపద విపరీతంగా పెరిగింది. ధనవంతుల సంఖ్యలో అదే తీరు. పేదలు మరింతగా పేదలౌతున్నారు. ఎందుకిలా జరుగుతోంది? యుబిఎస్ అనే పెద్ద స్విస్ బ్యాంకు 2026 సంవత్సర ప్రపంచ సంపద నివేదికను ఇటీవలే విడుదల చేసింది. దానిలో కొన్ని అంశాలు ఇలా ఉన్నాయి. ఒక బిలియన్ అమెరికన్ డాలర్లు(వంద కోట్ల డాలర్లు, ప్రస్తుత విలువ ప్రకారం రూ.9,562 కోట్ల 34 లక్షల, 50 వేలు) అంతకుమించి సంపద ఉన్నవారి సంఖ్య 2025లో ప్రపంచంలో 3,302 మంది ఉన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 383 మంది(13.1శాతం) పెరిగారు. వీరిలో వెయ్యి మందికి పైగా అమెరికా, 562 మంది చైనా, 211 మంది మనదేశంలో ఉన్నారు. తరువాత స్థానాల్లో జర్మనీ 193, రష్యాలో 122 మంది తేలారు. సగటున వీరి సంపద అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 25శాతం పెరిగింది. ప్రపంచ వృద్ధి రేటుకు ఎన్నోరెట్లు ఎక్కువ. దక్షిణ కొరియా, హంగరీలో పెరుగుదల రేటు రెట్టింపు కాగా, చిలీలో 80, చెక్, మెక్సికోలలో 60, బ్రెజిల్, గ్రీస్‌లలో యాభై శాతానికి మించి ఉంది. ఈ వివరాలు 2025 ఏప్రిల్ నుంచి 2026 ఏప్రిల్ సమాచారం మేరకు వెల్లడించారు. దక్షిణ కొరియాలో ఏడాది కాలంలో బిలియనీర్లు 31 నుంచి 52కు పెరిగారు.

అయితే ప్రపంచమంతటా అలాగే ఉందా? కొన్ని దేశాల్లో స్థిరంగా, కొన్నిచోట్ల తగ్గారు. చిలీలో పెరగకపోగా థాయ్ లాండ్‌లో 25 నుంచి 22కు, సౌదీ అరేబియాలో19 నుంచి 16కు తగ్గారు. గతంలో లక్ష రూపాయల సంపద ఉంటే లక్షాధికారి అని పిలిచారు. ఇప్పుడు వారి స్థానంలో మిలియనీర్ (అంటే కనీసం పది లక్షలు)లు వచ్చారు. ఇది కూడా అమెరికన్ డాలర్లలో లెక్కవేస్తున్నారు. ఇలాంటి వారు గతేడాది 1.5శాతం మంది పెరిగారు. దీన్నే మరో విధంగా చెప్పాలంటే రోజుకు 2,680 మంది కొత్తగా మిలియనీర్లు అయ్యారు. తూర్పు ఐరోపాలో ఈ వృద్ధి రేటు ఎక్కువగా ఉంది. గతేడాది మొత్తం పదిలక్షల మంది కొత్తగా మిలియనీర్ల జాబితాలో చేరితే వారిలో సగం మంది ఒక్క అమెరికాలోనే ఉన్నారు. ప్రపంచంలో అధిక సంపద ఉన్న దేశం అమెరికా అన్న సంగతి తెలిసిందే. అయితే అక్కడి జనాలందరూ ధనవంతులా అన్నది అసలు సమస్య. సగటు ఆదాయం, సగటు సంపదకూ, మధ్యగత రాబడి,



సంపదకూ తేడా ఉంది. దాన్ని అర్థం చేసుకుంటే వాస్తవ పరిస్థితి తెలుస్తుంది. ప్రపంచంలో అత్యంత ధనికుడు ఎలన్‌మస్క్ అమెరికాలో ఉన్నాడు. అయితే అమెరికన్లందరూ ఎలన్ మస్క్‌లు కారు. మనదేశంలో అంబానీ, అదానీలు ఎలా ధనవంతులో జనం అందరి స్థితి అది కాదని తెలిసిందే. యుబిఎస్ నివేదిక 30 ధనిక ఆర్థిక వ్యవస్థలున్న దేశాల గురించి సగటున ఒక వ్యక్తి సంపద ఎంత అని విశ్లేషించింది.

ఒక దేశ సంపద విలువను జనాభాతో భాగిస్తే సగటు ఎంతో తెలుస్తుంది. ఒకడి దగ్గర లక్ష, మరొకడి దగ్గర వెయ్యి రూపాయలుంటే సగటు ఇద్దరి రూ.50,500 అవుతుంది. లొట్టలేసుకుంటూ చెప్పే ఈ అంకెలతో రెండవ వాడికి ఏమైనా ప్రయోజనం ఉంటుందా! ఈ లెక్కన స్విట్జర్లాండ్ సగటు సంపదలో మొదటి స్థానంలో ఉంటే అమెరికా రెండవది. మీడియన్ సంపద (మధ్యగత)ను చూస్తే అదే అమెరికా 28వ స్థానానికి దిగజారింది.మరో మాటలో చెప్పాలంటే 27 దేశాలు మెరుగ్గా ఉన్నాయి. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఒక ఊరిలో పది మంది ఉంటే ఒక్కొక్కరి దగ్గర వెయ్యి రూపాయలు ఉన్నాయను కుందాం. సగటున చూసినా, మధ్యగతంగా చూసినా వెయ్యి రూపాయలే ఉంటాయి. అంటే సంపద అందరి దగ్గరా సమంగా ఉన్నట్లు. అదే ఊరిలోని మరో పది మందిలో ఒకడి దగ్గర లక్ష ఉండి తొమ్మిది మంది వద్ద వెయ్యి ఉంటే సగటున ఒక్కొక్కరి దగ్గర 10,900 ఉన్నట్లు మధ్యగత సంపద వెయ్యే ఉంటుంది. రెండవదే వాస్తవం. అందుకే సగటు సంపదలో అమెరికా రెండవది, మధ్యగతంలో 28వది. మరో ఉదాహరణగా బ్రిటన్‌ను చూద్దాం. ముప్పయి దేశాల జాబితాలో సగటులో 21, మధ్యగతంలో 13వదిగా ఉంది. దీని అర్థం

ఏమిటంటే అమెరికా కంటే సాధారణ పౌరుల పరిస్థితి బ్రిటన్‌లో మెరుగ్గా ఉంది, అసమానతలు తక్కువగా ఉన్నట్లు. మరికొన్ని వివరాలను చూద్దాం. అమెరికన్ డాలర్ల ప్రాతిపదికన సంపద విలువ.

ఎగువన ఉన్న అంకెలు చెబుతున్నదేమిటి? గినీ కోయఫిషియంట్ ప్రాతిపదికన 0 నుంచి 100వరకు పాయింట్లను చూస్తే ఎంత తక్కువ ఉంటే అంతగా అసమానతలు తక్కువగా, ఎంత ఎక్కువ ఉంటే అంతగా ఎక్కువ ఉన్నట్లు పరిగణిస్తారు. ఇదే విధంగా సగటుతో పోల్చినపుడు మధ్యగత ఎక్కువగా ఉంటే జనాల రాబడి లేదా సంపద ఎక్కువగా ఉన్నట్లు. ఈ వివరాల ప్రకారం చైనాలో కూడా సంపద అసమానతలు ఉన్నాయి. మనదేశం, ఇతర ఇరుగుపొరుగు దేశాలతో పోల్చితే తక్కువగా గిని ఉందంటే అర్ధం అసమానతలు తక్కువగా ఉన్నట్లు పరిగణిస్తున్నారు. మనం అగ్ర స్థానంలో ఉన్నాం. అమెరికాలో 77 ఉంది. ప్రజాస్వామిక దేశాలలో ఇంతగా అసమానతలు ఉండటం ఏమిటి? అక్కడే తొలి ట్రిలియనీర్-ఎలన్‌మస్క్ అవతరించాడు. మన నేతలు జీడీపీ చూశారా 'యుపిఏ హయాంకంటే మేం పెంచాం' అని గొప్పలు చెప్పుకుంటున్నారు. జీడీపీ అంటే సంపద కాదు, ఒక ఏడాదిలో వస్తువులు, సేవల ద్వారా సృష్టించిన ఉత్పత్తి విలువ. తాము 2024 నాటికి ఐదులక్షల కోట్ల డాలర్ల స్థాయికి జీడీపీని పెంచుతామని మోడీ సర్కార్ ఘనంగా చెప్పుకుంది. మోడీ అధికారంలోకి వచ్చినపుడు 2014లో 2.04లక్షల కోట్లుగా ఉన్నది 2026లో 4.15లక్షల కోట్లకు(అంచనా) చేరింది. ఇప్పుడు 2029 నాటికి ఐదు లక్షల కోట్లకు చేరుస్తామని కొత్త గడువు చెప్పారు.

సోవియట్ యూనియన్ రద్దయిన తరువాత రష్యాలో ఉన్న ప్రభుత్వ సంపదలన్నింటినీ కొంతమంది పెద్దలు కొట్టేశారు. అమెరికా నయా ఉదారవాద పెట్టుబడిదారీ మేధావులు ఇచ్చిన సలహాల మేరకు ఇది జరిగింది. పుతిన్ ఇతర నేతలు వారి సలహాను పాటించారు గనుక రష్యా పోటీకి రాకుండా ఉండేందుకు ధనికదేశాల్లో ఒకటిగా పరిగణించి రాజీమార్గంగా జి7 కూటమిని జి8గా కూడా మార్చారు. అయితే ఆ ప్రయోగం వికటించింది. ఆర్థిక అసమానతలు చాలా ఎక్కువగా ఉన్న దేశాలలో ఇప్పుడు రష్యా ఒకటి. ఇక గల్ఫ్ దేశాలలో ఐక్య అరబ్ రిపబ్లిక్(యుఏయి) అసమానతలు విపరీతంగా ఉన్న సమాజం. దాని జనాభాలో కేవలం 13శాతం మంది మాత్రమే పౌరులు, మిగిలిన వారంతా వలస కూలీలే. ఆధునిక బానిసదేశంగా దాన్ని పరిగణిస్తారు. సంపదల అసమానతల గురించి ఫ్రెంచి ఆర్థికవేత్త గాబ్రియెల్ జక్‌మాన్ చేసిన విశ్లేషణ ప్రకారం అమెరికాలో కేవలం 19 మంది ధనికుల వద్ద 14శాతం వరకు జాతీయ ఆదాయం పోగుపడింది. దాని చరిత్రలో ఎన్నడూ

| దేశం | మధ్యగత | సగటు | గినీ |
|---|---|---|---|
| చైనా | 27,273 | 75,731 | 70.9 |
| భారత్ | 3,755 | 16,500 | 80.2 |
| పాక్ | 2,076 | 5,226 | 74.4 |
| బంగ్లా | 3,842 | 9,786 | 75.0 |
| నేపాల్ | 1,685 | 4,672 | 77.6 |
| శ్రీలంక | 8,615 | 23,991 | 77.2 |

సంపద ఇలా కేంద్రీకతం కాలేదు.

పదిశాతం ధనికుల వద్ద 50 శాతం ఆదాయ వృద్ధి ఉండగా దిగువ 50శాతం మంది వద్ద 15 నుంచి 20శాతమే ఉన్నట్లు కూడా జక్‌మాన్ చెప్పాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థ వినిమయ ఖర్చు మీద ఆధారపడేట్లు చేశారు. పదిశాతం మంది ధనికులు యాభై శాతం ఖర్చు చేస్తుండగా ఇటీవలి కాలంలో దిగువ 60శాతం వాటా తగ్గిపోతున్నట్లు తేలింది. పారిశ్రామిక వద్ధి తగ్గటం, దిగుమతుల మీద ఆధారపడటం, కార్మికులకు వేతనాల పెరుగుదల మందగించటంతో రాబడి తగ్గటం వంటి కారణాలు అత్యధికుల్లో వినిమయం పడిపోవటానికి దారి తీస్తున్నది. 1950 దశకంలో అమెరికా జీడీపీలో ఉత్పాదకరంగం వాటా 25శాతం ఉండగా ఇప్పుడు పదిశాతానికి పడిపోయింది. ఫైర్ రంగం అంటే ఫైనాన్స్, ఇన్సూరెన్స్, రియలెస్టేట్ వాటా 1947లో పదిశాతం ఉండగా ఇప్పుడు 21శాతానికి చేరింది. ఈ రంగం వృద్ధి కార్పొరేట్ కంపెనీలు, వాటిలో పని చేసే నిపుణులకు తప్ప సాధారణ కార్మికులకు రాబడి పెరగదు. తలసరి జీడీపీ పెరగవచ్చుగానీ జనాల జీవన ప్రమాణాలు ఆమేరకు పెరగటం లేదు.

ప్రపంచ ఇనీక్వాలిటీ లాబ్ (అసమానతల ప్రయోగశాల) సమాచారం ప్రకారం ప్రస్తుతం మన దేశంలో ఒక శాతం మంది చేతుల్లో 40.1శాతం సంపద పోగుపడగా రాబడిలో వారి వాటా 22.6శాతం ఉంది.(కొందరి అంచనా మేరకు 2022లో 25శాతం ఉంది) బ్రిటీష్ వారి ఏలుబడిలో 1922 నుంచి 1947 వరకు రాబడిలో ఎగువ ఒకశాతం వాటా 20-21శాతం మధ్య ఉందని అంచనా. అది స్వాతంత్ర్యం తరువాత 1961నాటికి 13శాతానికి తగ్గింది. 1991 నుంచి అమలు చేసిన నూతన ఆర్థిక విధానాల ఫలితంగా బ్రిటీష్ కాలం నాటి కంటే సంపద, రాబడి కేంద్రీకరణ ఎక్కువైంది. అమెరికాలో పాతకాలం నాటి రాక్‌ఫెల్లర్, ఫోర్డ్, జెపి మోర్గాన్ వంటి వారిని వెనక్కు నెట్టి ఇప్పుడు ఎలన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బెర్గ్ వంటివారు ఎలా ముందుకు వచ్చారో మనదేశంలో టాటా, బిర్లా, గోయంకాలను దాటి అంబానీలు, అదానీలు దూసుకుపోవటాన్ని మనం చూడవచ్చు. **(మిగతా 28వ పేజీలో)**

# సంక్షేమానికి నిజంగానే ఎక్కువ ఖర్చు చేస్తున్నామా?

- చక్రధర్ బుద్ధ

ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా సంక్షేమానికి నిజంగానే ఎక్కువ ఖర్చు చేస్తున్నామా? ఒకే దేశం, ఒకే జనాభా. కానీ ఏ కొలబద్దతో చూస్తామన్నదాన్ని బట్టి దేశంలో 'పేదలు' 5.3 శాతమూ కావచ్చు, 82.1శాతమూ కావచ్చు. ఈ వైరుధ్యం సంక్షేమం అవసరంపై చర్చను మరోసారి ముందుకు తెస్తోంది. ముఖ్యంగా, జాతీయ ఆహార భద్రతా చట్టానికి కేంద్ర ప్రభుత్వం 2026 జూన్‌లో ముసా యిదా సవరణ బిల్లును విడుదల చేసిన నేపథ్యంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సవరణలు మంచివా కావా అనే విషయాన్ని పక్కన పెడితే, ఈ చర్చలో తరచూ వినిపిస్తున్న ప్రశ్న ఒకటుంది: 'ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ ఎదుగుతున్నవేళ, దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇవ్వడం ఇంకా అవసరమా?'

ఈ ప్రశ్నకు ప్రధానంగా రెండు రకాల స్పందనలు వినిపిస్తాయి: ఇంత భారీ స్థాయిలో ఉచిత రేషన్ ఇవ్వడం ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించకుండా సంక్షేమంపై ఆధార పడేలా చేస్తోందనేది ఒక వాదన. మరోవైపు, దేశం నిజంగా అంతగా అభివృద్ధి చెందితే ఇన్ని కోట్ల మందికి ఉచిత ఆహారం ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నిస్తూ, ఆర్థికవృద్ధి కథనాన్నే అనుమానించేది మరో వాదన. కానీ ఈ రెండు వాదనలూ ఒక ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నాయి: తీవ్రమైన పేదరికం నుంచి బయటపడటం, ఆర్థిక భద్రత సాధించడం ఒకటే కాదు. అందువల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ, పేదరికం తగ్గుతున్నప్పటికీ సంక్షేమం అవసరం తప్పనిసరిగా తగ్గిపోదు. గత రెండు దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరిగిందన్నది వాస్తవం. అదే సమయంలో పేదరికం భారీగా తగ్గింది. ప్రపంచ బ్యాంకు 2025 జూన్‌లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, రోజుకు 3 డాలర్ల పేదరిక రేఖను ప్రమాణంగా తీసుకుంటే, 2011-12లో 27.1శాతంగా ఉన్న 'తీవ్రమైన పేదరికం' 2022-23 నాటికి 5.3శాతానికి తగ్గింది. కానీ కథ అక్కడితో పూర్తికాదు. పేదరికం తగ్గడం వేరు, ఆర్థిక భద్రత వేరు.

పేదరికాన్ని కొలిచేందుకు ప్రపంచవ్యాప్తంగా ఒకే ప్రమాణాన్ని ప్రపంచ బ్యాంకు ఉపయోగించదు. దిగువ-మధ్య ఆదాయ దేశాలకు పేదరిక ప్రమాణంగా నిర్ణయించిన 'రోజుకు 4.20 డాలర్ల' లెక్కనే తీసుకుంటే, 2022-23లో భారత జనాభాలో 23.9శాతం మంది ఆ రేఖకు దిగువన ఉన్నారు. ఎగువ-మధ్య ఆదాయ దేశాలకు ఉపయోగించే 8.30 డాలర్ల ప్రమాణాన్ని తీసుకుంటే ఈ సంఖ్య ఏకంగా 82.1శాతానికి చేరుతుంది. పేదరికానికి సంబంధించి 5.3శాతం, 23.9శాతం, 82.1 శాతం అనే మూడు సంఖ్యలు ఒక కీలక వాస్తవాన్ని బయట పెడతాయి: ఏ ప్రమాణంతో కొలుస్తామన్నదాన్ని బట్టి 'పేద' అనే నిర్వచనం, ఆ పరిధిలోకి వచ్చే జనాభా -- రెండూ పూర్తిగా మారిపోతాయి. తీవ్ర పేదరిక రేఖను దాటినంత మాత్రాన కోట్లాది మంది ఆర్థిక అభద్రత నుంచి బయటపడినట్లు కాదు.

ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త, భారతీయ వ్యవహారాలపై నిపుణుడు ప్రొఫెసర్ డియెగో మయోరానో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తారు. తీవ్ర పేదరికం నుంచి బయటపడినప్పటికీ, భారత జనాభాలో పెద్ద భాగం పేదరికానికి కొద్దిగా ఎగువన మాత్రమే జీవిస్తోందని; అనారోగ్యం, పంట నష్టం లేదా ఆదాయంలో అకస్మాత్తుగా వచ్చే దెబ్బలు వారిని మళ్లీ పేదరికంలోకి నెట్టగలవని ఆయన ఒక పరిశోధనా పత్రంలో పేర్కొన్నారు. ఒక కుటుంబం అధికారికంగా దారిద్ర్య రేఖకుపైన ఉండవచ్చు. ఇంట్లో మోటార్ సైకిల్, స్మార్ట్‌ఫోన్ ఉండవచ్చు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపుతుండవచ్చు. బయటకు చూస్తే అది మధ్య తరగతి కుటుంబంలా కనిపించవచ్చు. కానీ ఆ కుటుంబంలో తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగం పోవటం లేదా పంట నష్టం సంభవిస్తే? ఒక్క సంఘటనే చిన్న పొదుపును తుడిచిపెట్టి, అప్పుల్లోకి నెట్టి, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్ముకునేలా చేసి, ఆ కుటుంబాన్ని మళ్లీ పేదరికంలోకి తోసేయవచ్చు. అందుకే పేదరికం తగ్గడం వేరు; ఆర్థిక భద్రత సాధించడం వేరు.

ఈ ఆర్థిక అస్థిరత ఎంతమాత్రం ఊహాజనితం కాదు. 'ఇండియా హ్యూమన్ డెవలప్‌మెంట్ సర్వే' డేటాను ప్రపంచ బ్యాంకు విశ్లేషిస్తే ఒక విషయం స్పష్టమైంది - 2005 నుంచి 2012 మధ్య 27 శాతం కుటుంబాలు పేదరికం నుంచి బయట పడగా, 7శాతం కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోయాయి. ఈ కోణంలోనే 80 కోట్ల ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్యను కూడా చూడాలి. నిజానికి ఇది ప్రస్తుత పేదరికానికి సంబంధించిన ప్రత్యక్ష అంచనా కాదు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ

జనాభాలో 50 శాతం వరకు కవరేజ్ కల్పించాలన్న నిబంధనను బట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఉచిత రేషన్ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 81 కోట్లుగా ఉంది. కాబట్టి వీరందరినీ అత్యంత పేదలుగా చూడటంకంటే, వారిలో ఎంతమంది ఆహార భద్రత వంటి రక్షణలు లేకుండా ఒక అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా ఆదాయపు దెబ్బను తట్టుకోగలరన్నదే అడగాల్సిన అసలు ప్రశ్న. ఇన్ని సంవత్సరాలుగా సంక్షేమ పథకాలు అమలవుతున్నప్పటికీ ఈ అభద్రత ఇంకా ఉంటే సంక్షేమం విఫలమైందనుకోవాలా? అలా తేల్చడం తొందరపాటు. సంక్షేమం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా భద్రమైన స్థితికి తీసుకెళ్లే ఏకైక సాధనం కాదు. ఆహార భద్రత, ఉపాధి హామీ, పింఛన్లు వంటి పథకాలు ఆర్థిక దెబ్బ వచ్చినప్పుడు కుటుంబం పూర్తిగా కిందపడిపోకుండా కనీస రక్షణను కల్పిస్తాయి. మనం గమనించాల్సింది – ఇవి లేకపోతే ఆ కుటుంబాలు ఎంత త్వరగా అప్పుల్లోకి, ఆకలిలోకి జారిపోతాయన్నది. అందువల్ల ఒక సంక్షేమ పథకం విజయాన్ని 'లబ్ధిదారుడు ఇంకా ఆర్థిక అభద్రతలోనే ఉన్నాడా?' అనే ఒక్క ప్రశ్నతో కొలవలేం. 'ఆ పథకం లేకపోతే వారి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేది?' అన్న ప్రశ్న కూడా అడగాలి.

దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం, అందుబాటులో వైద్యం, విద్య వంటి అంశాలు అవసరమే. సంక్షేమం వాటికి పూర్తి స్థాయి ప్రత్యామ్నాయం కాదు. కానీ ఆ స్థాయి భద్రత అందరికీ అందేంత వరకు, సామాజిక రక్షణ ఒక కీలకమైన ఆధారంగా ఉంటుంది. మరి సంక్షేమంపై మనం నిజంగానే అధికంగా ఖర్చు చేస్తున్నామా? సంక్షేమ పథకాల పరిధి విస్తృతంగా ఉండటం వల్ల, దేశ సంపదలో అసాధారణంగా పెద్ద భాగాన్ని వాటికే ఖర్చు చేస్తున్నామనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్థికవేత్త రీతికా ఖేరా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది ప్రధాన సంక్షేమ పథకాలపై గత రెండు దశాబ్దాల వ్యయాన్ని పరిశీలించారు. వారి లెక్కల ప్రకారం, ఒక్క కోవిడ్ సంవత్సరంలో మాత్రమే ఈ పథకాల మొత్తం వ్యయం జీడీపీలో 3శాతాన్ని దాటింది. 2023-24లో జీడీపీలో వీటి వాటా దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉన్న స్థాయికి పెద్దగా భిన్నంగా లేదు. ఈ పరిశీలన కొన్ని ప్రధాన పథకాలకే పరిమితమైనప్పటికీ ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతుంది: విస్తృత కవరేజ్ ఉన్నంత మాత్రాన మనం నిజంగా అధికంగా ఖర్చు చేస్తున్నట్లా?

కోట్ల మందికి ఒక పథకం చేరుతున్నప్పటికీ, ఒక్కో కుటుంబానికి అందుతున్న సహాయం వారి వాస్తవ అవసరాలతో పోలిస్తే పరిమితంగానే ఉండవచ్చు. అందువల్ల కేవలం లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చూపిస్తూ సంక్షేమ వ్యయం తీవ్రభారంగా మారిందని తేల్చడం సరికాదు. దేశ ఆర్థిక సామర్థ్యంతో పోలిస్తే ఎంత ఖర్చు చేస్తున్నాం, ఆ ఖర్చు కుటుంబాలకు ఎంత వరకు ఆర్థిక రక్షణ కల్పిస్తోంది అన్నవే అసలైన ప్రశ్నలు.

చిన్న ఆర్థిక దెబ్బలకే కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారే ప్రమాదం ఉన్నప్పుడు సంక్షేమాన్ని తగ్గించడం సరికాదు. కేవలం రేషన్ పంపిణీకే పరిమితం కాకుండా నాణ్యమైన ఉచిత వైద్యం, విస్తృత సామాజిక భద్రత వంటి వ్యవస్థలను అందించాలి. లబ్ధిదారుల సంఖ్య కంటే రక్షణ నాణ్యతను పెంచడమే ముఖ్యం. అందుకే సంక్షేమంపై చర్చ కేవలం సంఖ్యల చుట్టూ మాత్రమే తిరగకూడదు. ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ, పెరుగుతున్న ఆ సంపదలో కొంత భాగాన్ని పౌరుల ఆర్థిక భద్రత కోసం కేటాయించడం సహజమైన తదుపరి అడుగు కావాలి. బహుశా అసలు ప్రశ్న 'ఇంకా సంక్షేమం ఎందుకు?' అన్నది కాదు. ఆర్థికంగా బలపడుతున్న భారత్, పెరుగుతున్న సంపదను తన పౌరుల ఆర్థిక భద్రతగా ఎంతవరకు మార్చగలుగుతోంది అన్నదే అసలు ప్రశ్న. ❑

# ఆర్థిక వృద్ధి కంటే అసమానతల పెరుగుదలే ఎక్కువ!

**(26వ పేజీ తరువాయి)** ప్రపంచంలో ఆదాయ అసమానతల పెరుగుదల గురించి ఎంత చెప్పుకున్నా తరగదు. అమెరికాలో 2025 వివరాలను చూసినపుడు ఒక కంపెనీ సిఇఒ-కార్మికుడి వేతన వ్యత్యాసం ఆకాశానికి అంటినట్లు తేలింది. టెస్లా కంపెనీలో ఒక కార్మికుడి మధ్యగత ఆదాయం కంటే దాని అధిపతి ఎలన్ మస్క్‌కు 25లక్షల రెట్లు ఉందన్నది నమ్మలేని నిజం. అమెరికా కార్మిక సంఘాల సమాఖ్య ఎఎఫ్ఎల్-సిఐఓ వార్షిక వేతన నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. స్టాండర్డ్ అండ్ పూర్ 500 కంపెనీల జాబితాను పరిశీలించినపుడు మధ్యగత వేతనంతో పోల్చితే ఉన్నతాధికారులకు 285రెట్లు అదనంగా ఇస్తున్నారు. ఇదే కంపెనీల సిఇఒల వేతనం 1,700 శాతం ఎక్కువ. ఈ వ్యత్యాసం అన్ని రంగాలలో ఒకే విధంగా లేదు. ఉత్పాదకరంగంలో ఏడాదికి సగటున ఒక సిఇఒ 69.6 కోట్ల డాలర్లు పొందుతుండగా కార్మికుడు 93 వేల డాలర్లు మాత్రమే తీసుకుంటున్నాడు. అధ్యక్షుడు ట్రంప్ రెండవసారి అధికారానికి రావటానికి ముందుకంటే గతేడాది అతగాడి రాబడి 254 రెట్లు పెరిగింది. వరల్డ్ లిబర్టీ ఫైనాన్సియల్ ట్రంప్ కుటుంబ క్రిప్టో కరెన్సీ కంపెనీ, దాన్నుంచి గతేడాది 220 కోట్ల డాలర్ల ఆదాయాన్ని పొందాడు. ఈ మొత్తం ఒక సాధారణ అమెరికన్ కార్మికుడి రాబడితో పోల్చితే 43,154 రెట్లు ఎక్కువ. స్టాక్‌మార్కెట్‌లో మన కార్పొరేట్, పెద్ద కంపెనీల సిఇఓల వేతనం సాధారణ కార్మికుడి మధ్యగత వేతనం కంటే రెండువందల రెట్లు ఎక్కువ, అమెరికా తరువాత అంత తేడా ఉన్న ఘనత మనదే, ఎటువైపు పయనిస్తున్నట్లు! ❑


# ఇప్పటికీ అంతే.. కొత్త పాళీ!



- నాగసూరి వేణుగోపాల్

**తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: "...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..."**






1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: "మూడు సంవత్సరాలు–వెయ్యిరోజులు–దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గర దగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం?.. దేశ దేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత."

ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం 'కొత్తపాళీ'లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే 'కొత్తపాళి' సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇటీవల మళ్ళీ వారి రచనలు 'ఇనుప కచ్చడాలు', 'దేవాలయాలపై బూతు బొమ్మలు', 'సాహిత్య మొర్మరాలు', 'పాత పాళీ', 'కొత్తపాళీ' పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. 'కొత్తపాళీ' గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు 'కొత్తపాళీ'ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది.

నిజానికి తాపీధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? – అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న

కాలానికీ, సమయానికీ – గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు. సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి:

అ) సాహిత్య విమర్శను రీడబుల్‌గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ – వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ.

ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: "...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే..." అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి."

"తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి రుణపడి ఉన్నాడు. ఆ రుణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి," అని కూడా చెప్తారు తాతాజీ. ఈ క్లారిటి చూడండి: "...అందులో సంస్కృతమే ఉండనీయండి, తెలుగే ఉండనియ్యండి, ఇంగ్లీషు, హిందూస్తానీ మరేదయినా ఉండనీయండి. ఏమైనాసరే తెలియడం ప్రధానం" అంటారు. 1936లో రాసిన మాటలు నేటికీ చాలామందికి ఎంతో అవసరమనిపిస్తుంటుంది – కొన్ని సమయాలలో వినిపించే వాదనల రొద వింటూంటే!

**వారి 'కొత్తపాళీ' వ్యాసాల నుంచి కొన్ని పదునైన వాక్యాలు, పరిశీలనలు:**

- 1) తెనుగు చేస్తానని చెప్పి, మరింత సంస్కృతం గుప్పి తెలియకుండా చేయడం అక్రమం, తన పాండిత్యం ప్రదర్శించ డానికే వ్రాసుకొనడమే అంటుంది మొల్ల – నన్నయ గురించి.
- 2) జాను తెలుగు కోసమూ, ద్విపదల కోసమూ, తెలుగు ప్రజల గాథల కోసమూ చూచేవాళ్ళు కొంతమంది ఉండేవాళ్ళు – నన్నెచోడుడు, పాలకురికి సోమనాథుడు మొదలైన వాళ్ళు. వీళ్ళ పేర్లే మొన్న మొన్నటిదాకా మనకు తెలియకుండా పోయాయి.
- 3) కవి సమయాలన్నారు, సాహిత్యసూత్రాలన్నారు, కావ్య మర్యాదలన్నారు, నాటక లక్షణాలన్నారు, వెయ్యిపేర్లు చెప్పారు. పదివేల నియమాలు దింపారు.. ఇవన్నీ సంస్కృతం రేవులో నుంచే దిగుమతి.
- 4) పగలు కలువపువ్వులు వికసించి ఉండటం ఎంతమంది చూచారు కాదు? అవి కలువలు కావంటారా?
- 5) తెలుగులో తెలుగు సాహిత్యాన్ని చూపాలి. సంస్కృతం పరిచయం వల్ల మరింత అభివృద్ధి పొందడానికి బుద్ధిపుట్టాలి. గాని బానిస బుద్ధి పుట్టిపోకూడదు.
- 6) కృష్ణరాయ చక్రవర్తినీ, ఆతని ఆముక్తమాల్యదా చూడండి. ఆ ఊహాచాతురీ ఆ ప్రపంచ పర్యావలోకనమూ, ఆ కవిత్వ దృష్టీ చూచినవాళ్ళకి అతడు గ్రుడ్డి వ్రాతగాడు కాక, ఒక నూరు కళ్ళున్న వ్రాతగాడిలా కనిపిస్తాడే!
- 7) పేరుగాంచిన ప్రబంధాలని మనం కొంచెం జాగ్రత్తగా చూడాలి. వాటిని కేవలం పారవేయకూడదు. అలా పారవేసినట్టయితే ఆంధ్రసారస్వత జీవనంలో మూడు, నాలుగు వందల సంవత్సరాలు వ్యర్థమయిపోయినట్టే అవుతుంది. అంత నష్టానికి ఎవరు ఒప్పుకోగలరు?
- 8) గ్రంథాలలో స్త్రీ పురుష సాంగత్య విషయంలోని సంగతులన్నీ మడికట్టుకుని విడిచిపెడితే బాగుండదు.
- 9) వేడివేడినెత్తురుతో జీవయాత్ర సాగిస్తూ ఉన్న తెలుగు ప్రజలకి మనసాహిత్యంలో జాగా లేకపోయింది. జావా, సుమత్రా ద్వీపాలకి వెళ్ళి వలసలు ఏర్పాటు చేసే చేవగలిగిన తెలుగు తనానికి జాగా లేకపోయింది. పడవలు కడుతూ, సముద్రాలు దాటిన తెలుగు సాహసానికి జాగా లేకపోయింది. ఇంతెందుకు, బ్రతికి ఉన్న తెలుగుకు జాగా లేకపోయింది.

ఎనభైయ్యేళ్ళ క్రితం రాసిన 'కొత్తపాళీ' సాహిత్య విమర్శలో సహనం, సమన్వయం, హేతుబద్ధత, తార్కికత, తెలుగు మీద మనకుండాల్సిన గురి – మరీ ముఖ్యంగా హాయిగా, అలవోకగా చదివేలా రాయగలగడం – వంటి కోణాలలో నేటికీ మనకు అవసరం. ❑




# ఈ దేశం ఎవరిది?

**We The People Of India సదస్సులో..**
**డా పరకాల ప్రభాకర్ గారి ప్రసంగం**

సభాధ్యక్షులు వర్మ గారు, పెద్దలు శోభనాద్రీశ్వరరావు గారు మరియు సభలో ఉన్న పెద్దలందరికీ, నాకన్నా చిన్నవారందరికీ నమస్కారాలు. సుదీర్ఘకాలం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పనిచేసిన వ్యక్తిగా మీ అందరికీ నేను పరిచయస్తుడినే. దేశంలో ఉన్నటువంటి రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల మీద మాట్లాడమని నన్ను కోరారు. ఇవి అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న సమస్యలే. నేను మీకు ఒక నాలుగు ప్రధాన సమస్యలను గుర్తుచేయడానికి ప్రయత్నిస్తాను. ముఖ్యంగా ఇవాళ దేశంలో ఉన్నటువంటి ప్రధానమైన సమస్య రాజకీయ సమస్య గురించే మనం ముందుగా మాట్లాడుకుందాం.

### రాజకీయ సమస్య : ఈ దేశం ఎవరిది?

దేశంలో ఇవాళ ఉన్న రాజకీయ సమస్య ఏమిటంటే, "ఈ దేశం ఎవరిది?" (Who does this nation belong to). ఇది మీకు, నాకు చిన్న ప్రశ్నగా అనిపించవచ్చు కానీ, ఇది చాలా పెద్ద ప్రశ్న. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఈ ప్రశ్న వేసుకొని సమాధానాలు వెతుకుతున్నాయి.

దీనికి ప్రధానంగా రెండు సమాధానాలు వినిపిస్తుంటాయి:

**అందరిదీ :** ఈ దేశం అందరిదీ. ఈ దేశంలో ఎవరు ఉంటే వారందరికీ ఈ దేశం చెందుతుంది. **We the people** – మనందరం అనే భావన.

**ఒక వర్గానిదే :** ఈ దేశం ఒక మతానికి, ఒక జాతికి లేదా ఒక వర్గానికి చెందినది. మిగతా వారు ఉండొచ్చు కానీ, వాళ్ళు మా చెప్పు చేతల్లో ఉండాలి. మా దయాదాక్షిణ్యాలపై బతకాలి అనేది.

ఈ రెండు వాదాల మధ్య ఘర్షణ శతాబ్దాలుగా జరుగుతోంది. జాతీయ రాజ్యాల వాదం(**Nation State**) యూరప్‌లో పుట్టింది. ఒక జాతి, ఒక మతం, ఒక భాష, ఒక రంగు అనే భావనలు అక్కడ నుంచే వచ్చాయి. ఈ భావనను అమలు చేయడానికి ప్రయత్నించినప్పుడు ఐరోపాలో భౌతిక ఘర్షణలు, రక్తపాతం జరిగాయి. ఆ మతానికి, భాషకు, రంగుకు చెందని వారిని బయటకు గెంటెయ్యడం లేదా చంపెయ్యడం మనం స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, రువాండా, టర్కీ, యుగోస్లావియా లాంటి ఎన్నో దేశాల్లో చూశాం.

### భారత రాజ్యాంగ సభ - ఒక అద్భుతమైన ప్రయోగం

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్ర్యం పొందిన అనేక దేశాలు, తమను తాము ఎలా పరిపాలించుకోవాలో రాజ్యాంగాలను రాసుకున్నాయి. కానీ భారతదేశం చేసిన ప్రయోగం అద్భుతమైనది. దాదాపు మూడు సంవత్సరాలు (నెలలు తక్కువ 3 ఏళ్లు) రాజ్యాంగ సభలో సమావేశమై, ఎన్నో చర్చలు, వాదోపవాదాలు చేసి ఒక రాజ్యాంగాన్ని రూపొందించారు. మిగతా దేశాల్లో రాజ్యాంగ సభలు ఏమి చర్చించాయో తెలుసా? "ఈ దేశం ఎవరిది? మన మతం వాళ్లదా? మన భాష వాళ్లదా?" అని. అమెరికా లాంటి దేశంలో 1776లో స్వాతంత్ర్య




ప్రకటన(**Declaration of Independence**) చేసినప్పుడు "అందరూ సమానమే" అని చెప్పారు. కానీ, అక్కడ నల్ల జాతీయులకు ఓటు హక్కు వచ్చింది 1968లో. స్విట్జర్లాండ్ లాంటి దేశంలో మహిళలకు ఓటు హక్కు వచ్చింది 1972లో. కానీ, భారత రాజ్యాంగ సభలో ఒక్క నిమిషం కూడా "ఈ దేశం ఎవరికి చెందుతుంది?" అనే దానిపై చర్చ జరగలేదు. రాజ్యాంగ సభ సమావేశమైన మరుక్షణం నుంచే ఈ దేశం అందరిదీ అని నిర్ణయించారు. మతం, కులం, భాష, ప్రాంతం, రంగు, ఆస్తితో సంబంధం లేకుండా ఈ దేశం అందరికీ చెందుతుందని ఏకగ్రీవంగా అంగీకరించారు.

### భారతీయ ఓటు హక్కు - ఒక సాహసం :

1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారత దేశంలో 500లకు పైగా సంస్థానాలున్నాయి. సైనికులు, గూఢచారులు, పోలీసులు, వ్యాపారులు, బ్యాంకులు అన్నీ బ్రిటీష్ వారి చేతుల్లోనే ఉన్నాయి. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత రాజ్యాంగం ఒక అద్భుతమైన సాహసం చేసింది. దేశంలో వున్న కోట్లాది మంది పేదలకు, నిరక్షరాస్యులకు, మహిళలకు, అందరికీ సమానంగా ఒకేసారి ఓటు హక్కు కల్పించింది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ (ఆస్తులు, చదువుతో నిమిత్తం లేకుండా) ఒకే విలువ ఉన్న ఓటును ఇవ్వడం ప్రపంచ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన అడుగు.

### మెజారిటీ పాలన వర్సెస్ మైనారిటీ రక్షణ

ప్రజాస్వామ్యం అంటే కేవలం మెజారిటీ పాలన అని కొందరు అనుకుంటారు. 100 మందిలో 51 మంది ఒక నిర్ణయం తీసుకుంటే మిగతా 49 మంది దాన్ని పాటించాలా? ఒకవేళ ఆ 51 మంది "ఈ 49 మందిని చంపేయాలి" అని తీర్మానం చేస్తే అది ప్రజాస్వామ్యం అవుతుందా? కాదు.

ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన సూత్రం: **Majority rule with minority protection** (మైనారిటీల రక్షణతో కూడిన మెజారిటీ పాలన). మైనారిటీల (మత, భాషాపరమైన లేదా అభిప్రాయపరమైన) హక్కులను రక్షించలేని ఏ మెజారిటీ పాలన కూడా డెమోక్రసీ కాలేదు. కానీ ఇవాళ భారతదేశంలో కొంతమంది, "మేము మెజారిటీలో ఉన్నాం కాబట్టి దేశం మాదే, మేం చెప్పినట్లే జరగాలి" అని వాదిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం, ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

### ఆర్థిక సమస్యలు మరియు డెమోగ్రాఫిక్ డివిడెండ్ (Demographic Dividend)

దేశ ఆర్థిక పరిస్థితి గురించి మనం మాట్లాడుకోవాలి. 1980ల నుండి మన రాజకీయ నాయకులు 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (యువ జనాభా శాతం అత్యధికంగా ఉండటం) గురించి ఊదరగొడుతున్నారు. ఒక దేశంలో పనిచేసే వయసున్న జనాభా ఎక్కువగా ఉంటే అది గొప్ప అవకాశం. ఇది 1980లో మొదలైంది. 2040 నాటికి(ఇంకా 14 ఏళ్లలో) ముగిసి పోతుంది. దేశం వృద్ధాప్యంలోకి వెళ్ళకముందే మనం సంపన్న దేశంగా(Rich country) ఎదగాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తే భయమేస్తోంది.

**తలసరి ఆదాయం:** ఇవాళ మన దేశ తలసరి ఆదాయం సుమారు 2,800 డాలర్లు. ఒక దేశం సంపన్న దేశం అనిపించుకోవాలంటే తలసరి ఆదాయం కనీసం 14,000 డాలర్లు ఉండాలి. అక్కడికి చేరాలంటే మనం ఏటా 9% నుంచి 10% వృద్ధి రేటు సాధించాలి. కానీ మనం 6% దగ్గరే ఆగిపోయాము.

**నిరుద్యోగం:** ప్రతి సంవత్సరం 1 కోటి 20 లక్షల మంది యువత ఉపాధి కోసం లేబర్ మార్కెట్లోకి వస్తున్నారు. కానీ వాళ్ళకి ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి? దేశంలో నిరుద్యోగ రేటు 23%కి చేరింది.

**నైపుణ్య లేమి** (Skill Deficit): ప్రపంచంలో శ్రామిక శక్తి శిక్షణలో మన పరిస్థితి చాలా దారుణంగా ఉంది. మన లేబర్ ఫోర్స్‌లో కేవలం 3% మందికి మాత్రమే కనీస శిక్షణ (**Training**) ఉంది. మిగతా 97% మంది ఎలాంటి నైపుణ్య



శిక్షణ లేకుండానే పనిచేస్తున్నారు. ఈ స్థితిలో మనం ప్రపంచంతో ఎలా పోటీపడతాం?

**వ్యవసాయ రంగ సంక్షోభం:** మన దేశ శ్రామిక శక్తిలో 45% మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, జాతీయ ఆదాయం(**GDP**)లో వారి వాటా కేవలం 15% మాత్రమే. అంటే 45 మంది కష్టపడితే 15 రూపాయలు మాత్ర మే వస్తున్నాయి. ప్రపంచ దేశాలతో పోలిస్తే వరి ఉత్పాదకతలో మన ర్యాంకు 52, గోధుమ ఉత్పాదకతలో 38.

**పౌరసత్వ చట్టాలు**(CAA, NRC, NPR) **- ఓట్ల తొలగింపు కుట్ర**

ఇన్ని భయంకరమైన ఆర్థిక, సామాజిక సమస్యలు ఉన్నప్పుడు, పాలకులు వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాలి. కానీ వారు ఏం చేస్తున్నారు? 'సిటిజన్ షిప్ అమెండ్మెంట్ యాక్ట్'(**CAA**), 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్'(**NRC**), 'నేషనల్ పాపులేషన్ రిజిస్టర్'(**NPR**) లాంటి విభజన రాజకీయాలను ముందుకు తీసుకువస్తున్నారు. ఈ చట్టాల అసలు ఉద్దేశం మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను భయభ్రాంతులకు గురిచేయడం. "నీ పౌరసత్వం నిరూపించుకో" అని అడగడం ద్వారా, తరతరాలుగా ఈ దేశంలో జీవిస్తున్న ప్రజలను దగా చేస్తున్నారు. ఒక మతాన్ని, కులాన్ని లక్ష్యంగా చేసుకొని ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### ఓట్ల తొలగింపు గణాంకాలు:

ఇది కేవలం మాటలు కాదు, వాస్తవ గణాంకాలు చూడండి. దేశవ్యాప్తంగా లక్షలాది ఓట్లను ఏకపక్షంగా తొలగిస్తున్నారు:

- ఉత్తరప్రదేశ్‌లో సుమారు 2 కోట్ల 83 లక్షల ఓట్లు తొలగించబడ్డాయి.
- బీహార్‌లో 80 లక్షల ఓట్లు తొలగించబడ్డాయి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక ఇలా ప్రతి రాష్ట్రంలోనూ లక్షలాది ఓట్లను గల్లంతు చేశారు.

తొలగించబడిన ఈ ఓటర్లలో ఎక్కువ శాతం ముస్లింలు, దళితులు, ఆదివాసీలు మరియు పేద వర్గాలకు చెందినవారే. అంటే ఒక నిర్దిష్ట వర్గాన్ని రాజకీయ ప్రక్రియ నుంచి దూరం చేసే కుట్ర ఇది. రాజ్యాంగం అందరికీ ఓటు హక్కు ఇస్తే, వీరు దొడ్డిదారిన ఆ హక్కును లాగేసుకుంటున్నారు.

### రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

ఇవాళ మనం ఎదుర్కొంటున్నది కేవలం ఒక ఎన్నికల సమరం కాదు, ఇది భారతదేశ ఆత్మను రక్షించుకునే సమరం. "ఈ దేశం అందరిదీ" అనే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్న శక్తులను మనం అడ్డుకోవాలి. మతానికి, కులానికి, భాషకి, ప్రాంతానికి, లింగానికి అతీతంగా ప్రతి పౌరుడూ ఈ దేశ రాజకీయ సమాజంలో సమాన భాగస్వామి. ఈ రాజ్యాంగ విలువలను కాపాడుకునే బాధ్యత, సైన్యం మనమే కావాలి. ఏ మతస్తులైనా, ఏ కులం వారైనా ఈ దేశం మనందరిదీ. ఈ భావనను బతికించుకోవడమే ఇవాళ మన ముందున్న అతిపెద్ద సవాలు. ఆ సవాలును స్వీకరించి, ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని సెలవు తీసుకుంటున్నాను. ❑

# We The People of India

## చర్చా పత్రం : సంస్థ లక్ష్యాలు - భవిష్యత్ కార్యకలాపాలు

**We The People of India** ఒక పౌర సమాజ సంస్థ. రాజ్యాంగ లక్ష్యాల మీద ప్రజాస్వామ్య విలువల మీద ప్రజా చైతన్యాన్ని పెంపొందించడం ఈ సంస్థ లక్ష్యం. అంతేకాదు ఈ విలువలకు వ్యతిరేకమైన చర్యలను చర్చిస్తుంది. ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తుంది. ఈ లక్ష్యాలలో భాగంగా దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలను చర్చించే వేదికగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఈ సమస్యల మీద కొందరు వ్యక్తులుగా స్పందిస్తున్నారు, ప్రశ్నిస్తున్నారు. కాని, ఒక సమూహంగా మన పౌరసమాజం స్పందించడం లేదు. ప్రశ్నించడం లేదు. వివక్ష గురవుతున్న తరగతులు, దళితులు, బహుజనులు, ఆదివాసీలు, మైనారిటీ మతస్తులు, మహిళలు - తమకు ఎదురైన తక్షణ సమస్యలపై ఎవరికి వారు స్పందిస్తున్నారు. అదొక ఉమ్మడి ఉద్యమం కావడం లేదు. **పౌరసమాజంలో స్తబ్ధతను తొలగించడం ఎలా ? యువతరాన్ని ఎలా ఆలోచింపచెయ్యాలి ? వివక్ష తరగతులతో కూడిన ఉమ్మడి ఉద్యమాన్ని ఎలా రూపొందించాలి ?** అన్న అంశాల ఆధారంగా మన సంస్థ కార్యకలాపాలను రూపొందించుకోవాలి.




### పౌర సమాజాన్ని కదిలించాలి

ప్రస్తుతం పౌర సమాజం స్తబ్దంగా వుంది. మౌనంగా వుంది. ఎవరి బాధ వారిది, ఎవరి గోల వారిదిగా అత్యధికులు భావిస్తున్నారు. వివిధ ప్రజా సంఘాలు తమ సభ్యుల సామూహిక ప్రయోజనాల కోసం, సాధించుకున్న హక్కులపై దాడి జరిగితే స్పందిస్తున్నాయి, పోరాడుతున్నాయి. ఇవి కూడా విడివిడి ప్రతిఘటనలుగానే వుంటున్నాయి. తమకు అవసరమైన తక్షణ సమస్యల మీద, తమ భవిష్యత్తుకు ప్రమాదం వుందని భావించినప్పుడు కొన్ని సమూహాలు స్పందిస్తున్నాయి. మన సమాజంలో రాజ్యాంగ విలువల మీద, ప్రజాస్వామ్య సమస్యల మీద నిత్య జీవనంలో వాటి ఆవశ్యకత మీద తగిన అవగాహన లేదు. ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడంలో అవి ఎలాంటి కీలక పాత్ర పోషిస్తాయో తెలియజెప్పే ప్రచార కార్యక్రమాలతో వారిని చైతన్యపరచాలి.

రాజ్యాంగ లక్ష్యాలు, ప్రజాస్వామ్య విలువలు తమ జీవితానికి తప్పనిసరి అవసరం అన్న భావన ఎంత బలంగా నాటుకుంటే అంతబలంగా వారు వాటికి సమర్థకులు అవుతారు. వాటి మీద జరిగే దాడులను అంత బలంగా ప్రశ్నించేవారు, ప్రతిఘటించే వారవుతారు. పౌర సమాజం స్తబ్ధత నుండి క్రియాశీలం అవుతుంది. ఇలాంటి ప్రచార కార్యక్రమాలతోనే సరిపెట్టుకోకూడదు. మరొక దానిని దీనికి జత చెయ్యాలి. రాజ్యాంగ లక్ష్యాలను, ప్రజాస్వామ్య మౌలిక విలువలను పెడమార్గం పట్టించడం చూస్తున్నాం. వివక్ష తరగతుల మీద - మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీ మతస్తుల మీద వేధింపులు, దాడులు, హత్యాకాండలు సాగుతున్నాయి. ప్రజలందరి స్వేచ్ఛను, పౌరహక్కులను కుదించడం చూస్తున్నాం. వీటిపై ఎవరికి వారు కొంత మేరకు స్పందిస్తున్నారు. గొంతు విప్పుతున్నారు. ప్రశ్నిస్తున్నారు. వీరందరికీ మన సంస్థ ఉమ్మడి వేదిక కావాలి. ఐక్యంగా గళం విప్పే వేదికగా వుండాలి. ఈ రెండు తరహాల కార్యక్రమాలను ఏకకాలంలో నిర్వహించుకోవాలి.

## ప్రత్యేకంగా విద్యార్థుల కోసం

కళాశాలలలో, హైస్కూళ్లలో విద్యార్థుల కోసం **"రాజ్యాంగ పీఠిక పఠనం - పీఠిక ప్రతిజ్ఞ"** పేరుతో వందలాది విద్యాసంస్థలలో వేలాది మంది విద్యార్థులకు రాజ్యాంగ పరిచయ కార్యక్రమాన్ని చేపట్టాలి. రాజ్యాంగ పీఠిక ప్రకటించిన **"ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం"** కోసం పేదలను ప్రత్యేకించి వివక్ష తరగతుల సమూహాలను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టాలి. మన సంస్థ ఒక పౌర సమాజ సంస్థ. రాజకీయ సంస్థగా వ్యవహరించదు. కాని ప్రజల జీవితాలను రాజకీయ విధానాలు ప్రభావితం చేస్తాయి. రాజకీయమే రాజ్యాంగం భవిష్యత్తు, ప్రజాస్వామ్య మనుగడలో రాజకీయం కీలక పాత్ర పోషిస్తుంది. అందుచేత మన సంస్థ విధానపరమైన రాజకీయ చర్చకు వేదికగా వుంటుంది. ప్రజల జీవన స్థితిని మెరుగుపరిచే ప్రత్యామ్నాయ విధానాలను చర్చిస్తుంది. ప్రజలను చైతన్య పరుస్తుంది. ఎన్నికలు, ప్రజాస్వామ్య పద్ధతులపై ప్రజలను అప్రమత్తులను చేస్తుంది. యువతను, మహిళలను సమీకరించడానికి ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా ప్రజలను మూఢ నమ్మకాలకు ; అంధ విశ్వాసాలకు లోను కాకుండా చైతన్య పరుస్తుంది. మతపరమైన, ప్రాంతీయ పరమైన, భాషా పరమైన విద్వేషాలకు లోను కాకుండా సమైక్యతను ప్రచారం చేస్తుంది. విద్వేషాలను రెచ్చగొట్టే చరిత్ర సంస్కృతి వక్రీకరణలను వ్యతిరే కించే సాంస్కృతిక కార్యకలాపాలను చేపడుతుంది. రాజ్యాంగ లక్ష్యాలు, ప్రజాస్వామ్య విలువల ప్రచారానికి, సంస్థ భావజాల వ్యాప్తికి సోషల్ మీడియాను ప్రచారసాధనంగా ఉపయోగి స్తుంది. సంస్థ సభ్యులకు, కార్యకర్తలకు, వివిధ స్థాయిల నాయకత్వాలకు ఈ భావజాలం మీద తగిన అవగాహన నిబద్ధత కల్పించాడానికి తగిన **"వర్క్ షాప్"**లను నిర్వహిస్తుంది.

## భవిష్యత్ కార్యక్రమాలు - కొన్ని ప్రతిపాదనలు

- **1).ప్రచార సమావేశాలు :** రాజ్యాంగ లక్ష్యాలు, ప్రజాస్వామ్య విలువలపై ప్రతి పట్టణంలోనూ కనీసం 2 బహిరంగ సమావేశాలు నిర్వహించాలి.. ప్రతి సమావేశంలో ఇద్దరు ముగ్గురు స్థానిక ప్రముఖులుతో లేదా రాష్ట్రంలో బాగా మాట్లాడగల వారితో నిర్వహించాలి.
- **2).చర్చా సమావేశాలు - రౌండ్ టేబుల్స్ :** దేశంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన వివిధ అం శాలను చర్చించడానికి వీలుగా నిర్వహించాలి. ఈ రౌండ్ టేబుల్ సమావేశాలు మన సభ్యులు, మిత్రులతోపాటు వివక్ష తరగతులకు చెందిన-ఆదివాసీ, దళిత, బహుజన, మహిళా సంఘాలను - మైనారిటీ మతస్తుల వారిని, పౌరహక్కుల సంస్థల వారిని ఆహ్వానించాలి. చర్చలో అందరికీ అవకాశం వుండేలా నిర్వహించాలి.
- **3).రాజ్యాంగ పీఠిక పఠనం - ప్రతిజ్ఞ :** కళాశాలలు, హైస్కూల్స్ విద్యార్థులకు విద్యా సంస్థల సహకారంతో **"రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ"** కార్యక్రమాన్ని నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం రోజున పలు విద్యా సంస్థలలో నిర్వహించాలి. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించాలి. పీఠికలోని పదాలను విద్యార్థులకు పరిచయం చేయడానికి అధ్యాపకులకు" వర్క్ షాప్‌లు నిర్వహించాలి. 2026 అక్టోబరు 2 నుండి నవంబరు 26 వరకు ఈ కార్యక్రమం చేపట్టాలి.
- **4).శిక్షణా కార్యక్రమాలు :** వివిధ స్థాయిలలో సంస్థ సభ్యులకు, నాయకత్వాలకు వర్క్ షాప్‌ల రూపంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. 2026 సెప్టెంబరు నెలలో ప్రాంతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణ **"భాగస్వామ్య పద్ధతి"** గల వర్క్ షాప్‌గా నిర్వహించాలి.
- **5). పని విభజనతో సభ్యుల బృందాలు :** మీ పట్టణంలోని సభ్యులతో, తగిన మిత్రులతో వివిధ బృందాలను ఏర్పాటు చేసుకుని వారికి బాధ్యతలు అప్పగించాలి.

  **1).** ప్రచార సమావేశాల నిర్వహణ **2).** రౌండ్ టేబుల్ సమావేశాలు **3).** విద్యా సంస్థలలో పీఠిక పఠనం - ప్రతిజ్ఞ

  **4).** సోషల్ మీడియాలో ప్రచారం, మీడియా సమావేశాల ఏర్పాటు - సంస్థ వార్తలను పత్రికలకు విడుదల చేయడం.

  **5).** సభ్యుల నుంచి మిత్రుల నిధుల సేకరణ, నిర్వహణ బృందం.

  **6).** యువతను సమీకరించడం కోసం వారి ఆకాంక్షలను, అభిప్రాయాలను తెలుసుకోవడానికి రూపొందించే ప్రశ్నావళితో అభిప్రాయ సేకరణ చేసి పంపాలి. పట్టణ నాయకత్వం ఈ బృందాలకు తగు సూచనలు, అవసరమైన సహకారం ఇచ్చి బహుముఖ కార్యకలాపాలను నిర్వహించుకోవాలి.

## రాష్ట్ర కేంద్రం తోడ్పాటు

ప్రచారానికి అవసరమైన కరపత్రాలు, పుస్తకాలు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు తగిన సంఖ్యలో అందిస్తుంది. ప్రాంతీయ శిక్షణా కార్యక్రమాలకు కొంత ఆర్థిక సాయం చేస్తుంది. రాష్ట్ర స్థాయిలో నాయకత్వానికి వర్క్‌షాప్ నిర్వహిస్తుంది. ముఖ్యమైన ఇతర కార్యక్రమాలకు వీలును బట్టి తోడ్పాటునిస్తుంది. సభ్యులు, మిత్రులు ఇచ్చే విరాళాల నుంచి రాష్ట్ర కేంద్రం తోడ్పాటు.

### తీర్మానం 1 : పాఠ్య పుస్తకాలలో రాజ్యాంగ పీఠికను కొనసాగించాలి

**భా**రత రాజ్యాంగ పీఠిక దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతీక. స్వాతంత్ర్యం, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం, లౌకిక భావన, ప్రజాస్వామ్యం వంటి భారత రాజ్యాంగ మౌలిక విలువలను ప్రతి తరానికి పరిచయం చేసి తీరాలి. అలాంటి రాజ్యాంగ పీఠికను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించే నిర్ణయం విద్యార్థులను రాజ్యాంగ విలువలకు దూరం చేసే చర్యగా ఈ సదస్సు భావిస్తున్నది. విద్యా వ్యవస్థ ద్వారా రాజ్యాంగ ఆదర్శాలను, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చెయ్యాలని కోరుతూ, వాటిని బలహీనపరిచే ఇలాంటి చర్యలను ఈ సదస్సు ఖండిస్తున్నది. అందువల్ల ఈ సదస్సు ఈ క్రింది అంశాలను డిమాండ్ చేస్తున్నది.

- 1).పాఠ్య పుస్తకాలలో రాజ్యాంగ పీఠికను తొలగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
- 2).అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలలో భారత రాజ్యాంగ పీఠికకు తగిన స్థానం కల్పించాలి.
- 3).విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, లౌకిక భావనను పెంచే విధానాలను అమలు చేయాలి.
- 4).విద్యా వ్యవస్థను రాజకీయ, మత, సైద్ధాంతిక జోక్యాలకు అతీతంగా ఉంచి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా తీర్చిదిద్దాలి.
- 5).విద్యార్థులకు ఆయా స్థాయికనుగుణంగా పరీక్షలలో రాజ్యాంగ పీఠిక నుంచి కొన్ని ప్రశ్నలు తప్పనిసరి చేయాలి. తద్వారా ప్రతి విద్యార్థి రాజ్యాంగ పీఠికను సమగ్రంగా అధ్యయనం చేసే అవకాశముంటుంది. ఈ అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది.

**(ప్రవేశపెట్టిన వారు : పి.సుబ్బరాజు,**
**విశ్రాంత ఉపాధ్యాయులు, కాకినాడ)**

### తీర్మానం-2 : వందేమాతరంపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ఉపసంహరణకు డిమాండ్

**1950** జనవరి 24న భారత రాజ్యాంగ సభ 'వందేమాతరం' గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే భారతదేశ అధికారిక "జాతీయ గేయం" **(National Song)**గా ఆమోదించింది. దేశాన్ని మాతృమూర్తిగా భావిస్తూ దేశభక్తిని చాటే ఈ రెండు చరణాలను గత 70 ఏళ్లుగా భారత ప్రజలందరూ ఎటువంటి విభేదాలు లేకుండా ఆమోదించారు. రాజ్యాంగ సభ దీనికి జాతీయ గీతం ప్రతిపత్తిని కల్పించింది. వందేమాతరంలో మిగిలిన నాలుగు చరణాలు నిర్దిష్ట మతాచారాలు, ఆరాధనా రూపాలకు సంబంధించినవి కావడంతో వాటిని విడిచి పెట్టడం జరిగింది. ఈ చరణాలను ఎవరైనా వ్యక్తిగతంగా లేదా మతపరమైన ఆరాధనల్లో పాడుకోవడంపై ఎవరికీ అభ్యంతరం వుండదు. తమ మతపరమైన విభజన రాజకీయాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొత్తం ఆరు చరణాలనూ తప్పనిసరిగా పాడాలంటూ మార్గదర్శకాలు ఇవ్వడం, దానిని బిల్లు రూపంలోకి తీసుకు రావడానికి ప్రయత్నించడం ఇది రాజ్యాంగంలోని లౌకికత్వానికి, దేశ ప్రజల మధ్య ఐక్యతకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది.

**సదస్సు డిమాండ్లు :** 'వందేమాతరం' మొత్తం చరణాలను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలి. జాతీయ గౌరవ అవమానాల నిరోధక(సవరణ) బిల్లు, 2026లో ఈ రకమైన బలవంతపు నిబంధనలను పొందుపరచడం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలి. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించే ఇలాంటి ప్రయత్నాలను, దేశంలోని ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు, పౌరులందరూ ఐక్యంగా వ్యతిరేకించాలని సదస్సు విజ్ఞప్తి చేస్తోంది.

**(ప్రవేశపెట్టిన వారు : పి.పి.శాస్త్రి,**
**సీనియర్ న్యాయవాది, ఏలూరు)**

### తీర్మానం - 3 : వివక్ష తరగతులపై దాడులను నిరోధించాలి

**సా**మాజిక జీవనంలో మతవిద్వేషం, సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన గరిష్ట స్థాయిలో వున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడించింది. 2022లో మొత్తం 198 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజాగా ఆ వివరాలతో ఒక నివేదికను విడుదల చేసింది. 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన' (ఎస్‌హెచ్ఐ) ఇండెక్స్‌లో గరిష్ఠంగా 10 పాయింట్లకుగాను భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉందని ఈ నివేదిక తెలిపింది. తర్వాత స్థానాల్లో వరుసగా నైజీరియా(8.7), సిరియా(8.1) వున్నాయి.

దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, క్రైస్తవులు మరియు ఇతర మైనారిటీ వర్గాలతోపాటు సమాజంలోని బలహీన వర్గాలపై జరుగుతున్న కుల, మత విద్వేష దాడులు, సామాజిక వివక్ష, లైంగిక హింస, హత్యలు, ఆస్తుల ధ్వంసం, విద్వేష ప్రచారాలు, రాజ్యాంగబద్ధ హక్కుల ఉల్లంఘనలను తీవ్ర

ఆందోళనతో గమనిస్తోంది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కును హామీ ఇస్తున్నప్పటికీ, ఇటువంటి ఘటనలు దేశ రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు, లౌకికతకు, సామాజిక న్యాయానికి మరియు మానవ హక్కులకు ప్రత్యక్ష విరుద్ధమని ఈ సమావేశం అభిప్రాయపడుతోంది.

- దేశంలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు మరియు ఇతర బలహీనవర్గాలపై జరుగుతున్న అన్ని రకాల హింస, వివక్ష, విద్వేష నేరాలను సమావేశం తీవ్రంగా ఖండిస్తోంది. ఇటువంటి ఘటనల్లో నిందితులపై వేగవంతమైన, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తోంది. బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం, న్యాయ సహాయం, భద్రత మరియు గౌరవప్రదమైన సమగ్ర పునరావాసం కల్పించాలి.
- కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, హింసాత్మక దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది. ఈ మూక దాడులను, అత్యాచారాలను, హత్యాకాండను ప్రతిఘటిస్తూ గొంతు విప్పుతున్న వివక్ష తరగతుల సంస్థలకు తన మద్దతును ప్రకటిస్తున్నది. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ మూల విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ సదస్సు విజ్ఞప్తి చేస్తున్నది.

**(ప్రవేశపెట్టిన వారు : పేరూరి మురళీకుమార్, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకులు-తణుకు)**

## తీర్మానం-4 : ఈ ఏడాది మేలో భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన 'కాక్రోచ్' వ్యాఖ్యలపై నిరుద్యోగ యువత ఆగ్రహం

సామాజిక మాధ్యమాల్లో అభిజీత్ దిప్కే ప్రారంభించిన వేదిక "కాక్రోచ్ జనతా పార్టీ (జఫీూ)" వేగంగా యువత మద్దతు పొందింది. అనంతరం చీజుజు తదితర పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆగ్రహం పెరగడంతో, ఈ వేదిక ఆ అసంతృప్తికి ప్రతీకగా మారింది. ఈ లీకేజీతో నిరాశకు గురైన 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంతో దీనికి బాధ్యతవహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చెయ్యాలన్న నినాదంతో జంతర్ మంతర్ దగ్గర ప్రారంభమైన ప్రదర్శనలు దేశమంతటికీ విస్తరించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తొలివిజయం సాధించింది. అయితే ఈ ఉద్యమ సందర్భంగా శాంతియుత ప్రదర్శకుల మనో ధైర్యాన్ని దెబ్బతీసి ఉద్యమాన్ని అణచివెయ్యాలని, కేంద్ర ప్రభుత్వం బలప్రయోగానికి దిగింది. రోజుల తరబడి విచక్షణారహితంగా లాఠీ చార్జీలతోపాటు, వాటర్ కేన్‌లు, బాష్పవాయు ప్రయోగాలకు పరిమితం కాకుండా పెల్లెట్లు, చివరికి ఎ.కె.47 తుపాకులను వినియోగించారు. పోలీసు బలగాలతో కలిసి సాధారణ దుస్తులతో మేకుల లాఠీలతో ఆర్‌ఎస్‌ఎస్ బలగాలు విరుచుకు పడ్డాయి. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. దేశవ్యాపితంగా వేలాది మందిని అరెస్టు చేశారు. కేసులు నమోదు చేశారు. ఇప్పుడు మలి దశ ఉద్యమం ప్రారంభమైంది. విద్యార్థులపై జరిగిన ఈ దౌర్జన్యకాండకు కారకులైన కేంద్ర హోంమంత్రి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు.


శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను జవాబుదారీతనం కోసం ప్రశ్నించే పౌరులందరికీ వుంది. ఈ హక్కుల కోసం సాగిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఉద్యమానికి ఈ సదస్సు తన సంఘీభావాన్ని, మద్దతును ప్రకటిస్తున్నది.

**(ప్రవేశపెట్టిన వారు : మార్పు శరత్, మానవ హక్కుల వేదిక, విశాఖపట్నం)**

## తీర్మానం -5 : SIR పేరుతో ఓటర్ల తొలగింపు రాజ్యాంగ విరుద్ధం


**We the People of India** తెలుగు రాష్ట్రాల సదస్సు" కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న **Special Intensive Revision (SIR)** పేరుతో ఓటర్ల జాబితాల పునర్విమర్శ ప్రక్రియపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఓటు హక్కు ప్రతి పౌరుని ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు. ఆ హక్కును ఓటర్ల జాబితా సవరణ పేరుతో హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. **SIR** పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు పెద్ద ఎత్తున తొలగిస్తే అది ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ప్రత్యేకించి పేదలు, వలస కార్మికులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వృద్ధులు, పట్టణ నిరుపేదలు వంటి వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు. పౌరసత్వాన్ని నిర్ధారణ చేసే అధికారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున అనుమానిత ఓటర్లందరికీ ఆధార్ కార్డ్ ఆధారంగా ఓటు హక్క కల్పించి తుది జాబితా విడుదల చెయ్యాలని ఈ సదస్సు డిమాండ్ చేస్తున్నది. ❑

**(ప్రవేశపెట్టిన వారు : కటారి శ్రీనివాసరావు, సంస్థ సమన్వయ కమిటీ సభ్యులు, హైదరాబాదు**




ఎంత తోమినా..!

నిజం ఆగదు









డెమో.. క్రసీ !

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 4 - Issue No : 11 Online Edition August 2026




**కొత్త పుస్తకాల స్వీకారం**

